26-08Pg1exHMNWJQE ONG_26-08Pg1exHMNWJQE.qxd 8/26/2025 12:00 AM Page 1



ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

26-8-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 206 పేజీలు: 12 వెల: 6.50

గాజా ఆస్పత్రిపై ఇజ్రాయెల్ మళ్లీ భారీ దాడులు

అమెరికాలో లాబీయింగ్‌కు భారత్ ముమ్మర యత్నాలు 9లో


# సమర్థంగా నీటి నిర్వహణ

## 80శాతం పైగా నిండిన రిజర్వాయర్లు

## కృష్ణ, గోదావరి, పెన్న తదితర నదుల ద్వారా ఇప్పటికి 310 టిఎంసిల వినియోగం

## సీమ జిల్లాల ప్రాజెక్టులకు సమృద్ధిగా నీరు

## - సమీక్షలో సిఎం చంద్రబాబు



**విజయవాడ, ఆగస్టు 25, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సమర్ధ నీటి నిర్వహణ సత్ఫలితాలను ఇస్తోందని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టంచేసారు. నీటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని సిఎం తెలిపారు. ఇరిగేషన్ స్కీమ్‌లు.నీటి నిర్వహణ తదితరంశాలపై జలవనరుల శాఖ అధికారులతో సిఎం చంద్రబాబు సోమవారం కీలకంగా సమీక్షించారు.ఇప్పటికే పలు సమీక్షల్లో ఇరిగేషన్ అధికారులకు ఇదే విషయంపై చంద్రబాబు దిశా నిర్దేశం చేస్తూనే ఉన్నారు. తాజా సమీక్షలో సిఎం చంద్రబాబు ప్రతీ వర్షపు చుక్కనూ ఒడిసి పట్టాలన్న లక్ష్యం మేరకు ఓవైపు రిజర్వాయర్లను నింపుతూనే మరోవైపు అన్ని నదీ బేసిన్ల ఆయకట్టుకు నీరిచ్చేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టామన్నారు..దానికి అనుగుణంగా ఈసారి కృష్ణా, గోదావరి, వంశధార, పెన్నా నదీ బేసిన్లలో అన్ని రిజర్వాయర్లలోనూ కలిపి ప్రస్తుతం 80 శాతంమేర నీటి నిల్వలు ఉన్నాయి.మన నిర్ణయాలు ఆచరణలో విజయవంతంగాముందుకు సాగుతున్నాయన్న చంద్రబాబు. కృష్ణా నదిపై ప్రధాన ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులు గత నెలలోనే నిండాయి. పైనుంచి నిరంతర వరద ప్రవాహాలు కొనసాగుతుండడంతో వచ్చిన నీటిని వచ్చినట్లు కిందికి పంపుతున్నారు. ఇదే సమయంలో ఆయా ప్రాజెక్టులనుంచి గరిష్ట మొత్తంలో నీటిని వివిధ లిఫ్టుల ద్వారా, కాలువల ద్వారా ఇతర రిజర్వాయర్లకు, చెరువులకు, పంటలకు మళ్లిస్తున్నారు. ఈ ఏడాది జులై నెలలోనే కృష్ణాకు భారీ వరద రావడంతో పెద్ద ఎత్తున నీటినికి సీమ ప్రాంతానికి తరలించి ప్రాజెక్టులు నింపుతున్నారు. ప్రస్తుతం కృష్ణా డెల్టాలోని ఆయకట్టుకు ఈ ఏడాది జూన్ 1 తేదీ నుంచి ఇప్పటి వరకూ 52 టీఎంసీల నీటిని రైతులు వినియోగించుకున్నారు. ప్రభుత్వం చేపట్టిన సమర్ధ నీటి నిర్వహణతో గతంతో పోలిస్తే ఈసారి అదనంగా 12 టీఎంసీల వినియోగం జరిగింది. గోదావరి బేసిన్‌లోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ ద్వారా ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలను యథాతథంగా దిగువకు సముద్రంలోకి వదులుతున్నారు. గోదావరి డెల్టాలోని పంటల సాగుకు సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ 70 టీఎంసీల మేర నీటిని ఆయకట్టుకు విడుదల చేశారు. పెన్నా బేసిన్లో వెలిగోడులో 15 టీఎంసీలు, సోమశిలలో 56 టిఎంసిలు, కండలేరులో 31 టిఎంసిల నీరునిల్వఉంది. వంశధార బేసిన్లోని గొట్టా బ్యారేజీనుంచి ఈ సీజన్లో 8టిఎంసిల నీటిని ఆయకట్టుకు అందించింది ప్రభుత్వం. మొత్తంగా చూస్తే ఆగస్టు 24 నాటికి ప్రధాన జలాశయాల్లో 650 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

**సమర్ధ నీటి నిర్వహణ వినియోగం**

ఈ యేడాది ఇప్పటి వరకు కృష్ణా, గోదావరి, వంశధార బేసిన్లలో కలిపి 309 టిఎంసిల నీటిని ఆయకట్టుఅవసరాలకు వినియోగించారు. సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 70 టిఎంసిలు, ప్రకాశం బ్యారేజీ నుంచి >>2

# నర్సింగ్ కోర్సుల్లో సంస్కరణలు



## మొదటిసారి ప్రత్యేక పరీక్ష ద్వారా ప్రవేశాలు..

## మేనేజ్‌మెంట్ కోటా ప్రవేశాలను కూడా చేపట్టనున్న డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ

**విజయవాడ,ఆగస్టు25,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతిభ కలిగిన విద్యార్థులకు పెద్దపీట వేయడంతో పాటు, నాలుగేళ్ల వ్యవధితో కూడిన బియస్సీ నర్సింగ్ కోర్సు ప్రవేశాల్లో అవకతవకలకు తావులేకుండా చూసేందుకు కూటమి ప్రభుత్వం సంస్కరణలు ప్రవేశపెట్టింది. 2025-26 విద్యా సంవత్సరంలో జరిగే ప్రవేశాలతో ఈ సంస్కరణలు అమల్లోకి రానున్నాయి. ఈమేరకు బియస్సీ (నర్సింగ్) కోర్సులో ప్రవేశాలకు సంబంధించి 1998లో జారీఅయిన జిఓనంబరు 145 మరియు 2023లో జారీ అయిన జిఓ నంబరు 41లో తగు మార్పులు చేయడానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు.

**నూతన సంస్కరణలు..**

ఇప్పటి వరకు నాలుగేళ్ల బియస్సీ(నర్సింగ్) కోర్సులో ఎంసెట్ ర్యాంకుల ఆధారంగాను, ఇంటర్మీడియేట్ మార్కుల ప్రాతిపదికన ప్రవేశాలు జరిగాయి. మొదటిసారిగా గత ఏడాది జులైలో బియస్సీ(నర్సింగ్)లో ప్రవేశాల కోసం ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ కామన్ ఎగ్జామినేషన్ టెస్ట్‌ను(ఏపిఎన్‌సెట్) డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నిర్వహించింది. ఈ పరీక్షలో వచ్చిన ర్యాంకుల ఆధారంగా ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు జరుగుతాయి. ఇప్పటి వరకు ప్రైవేట్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో ప్రవేశాలను డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్‌యూనివర్సిటీ నిర్ణయిస్తూ ఉండగా... మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలను ఆయా కళాశాలల యాజమాన్యాలు నిర్ణయించేవి. తద్వారా ప్రతిభ తక్కువ కలిగిన విద్యార్థులకు, ఇతర రాష్ట్రాల వారికి మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలు లభించేవని ఆరోపణలొచ్చాయి. ఈ నేపథ్యంలో.. ప్రభుత్వ, ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో ప్రవేశాలతో పాటు ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల్లోని మేనేజ్‌మెంట్ సీట్లకు కూడా డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆన్‌లైన్ వెబ్ కౌన్సిలింగ్ ద్వారా ప్రవేశాలు చేపట్టనుంది. విశ్వవిద్యాలయం నియమించే సెలక్షన్ కమిటీ ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసిన విద్యార్థులనే మేనేజ్‌మెంట్ సీట్లలో చేర్చుకోవాల్సి ఉంటుంది. ఈసంస్కరణతో ప్రతిభ కలి >>2



సోమవారం గాంధీ బునకర్ మేళా ప్రారంభ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సుచిత్ర ఎల్ల

# మన చేనేతకు ప్రపంచ గుర్తింపు

## జాతీయ స్థాయిలో ఏపి చేనేతకు 10 అవార్డులు గర్వకారణం

## ప్రతి కుటుంబం చేనేతను ఆదరించాలి: సుచిత్ర ఎల్ల

**విజయవాడ,ఆగస్టు25,ప్రభాతవార్తప్రతినిధి:** భారతీయ చేనేత, హస్తకళలకు ప్రపంచ వ్యాప్తంగా మరింత గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని హ్యాండ్‌లూమ్,క్రాఫ్ట్స్ అభివృద్ధికి నిర్దేశించిన సలహాదారు సుచిత్ర ఎల్ల తెలిపారు. 'గాంధీ బునకర్ మేళా'(జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన - 2025)ను విజయవాడ శేష సాయి కళ్యాణ వేదికలో సోమవారం సుచిత్ర ఎల్ల, చేనేత. జౌళి శాఖ కమిషనర్ జి. రేఖా రాణి, 8వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణిలతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసినసభలో జ్యోతి ప్రజ్వలనచేసారు..ఈ సందర్భంగా సుచిత్ర మాట్లాడుతూ చేనేత మరియు హస్తకళల ప్రొడక్ట్స్‌ను జాతీయ, అంతర్జాతీయంగా మార్కెట్ చేసేందుకు బాధ్యత తీసుకుని పనిచేస్తామన్నారు. మన వస్తువులకు బ్రాండింగ్ ఎలా చేయాలో వాటికి >>2



# ప్రధాని మోడీ డిగ్రీ వివాదం

## 'సిఐసి' ఆదేశాలను తోసిపుచ్చిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ప్రధాని నరేంద్రమోడీ డిగ్రీ వివరాలను వెల్లడించాలంటూ ఢిల్లీ విశ్వవిద్యాలయానికి కేంద్ర సమాచార కమిషన్ గతంలో జారీ చేసిన ఆదేశాలను ఢిల్లీ హైకోర్టు పక్కన పెట్టింది. ఈ మేరకు ఫిబ్రవరి 27న రిజర్వ్ చేసిన తీర్పును జస్టిస్ సచిన్ దత్తా నేడు వెలువరించారు. నీరజ్ అనేవ్యక్తి ప్రధాని మోడీ డిగ్రీ వివరాల కోసం సమాచార హక్కు చట్టం కింద సిఐసికి దరఖాస్తు పెట్టారు. ప్రధాని 1978లో బిఎ పూర్తి చేశారు. దీంతో ఆ ఏడాది బిఎ పరీక్షలో ఉత్తీర్ణులైనవారి రికార్డుల తనిఖీకి 2016 డిసెంబర్‌లో ప్రధాన సమాచార కమిషనర్ అనుమతించారు.

దీన్ని డియు సవాల్ చేయగా 2017 జనవరిలో ఢిల్లీ హైకోర్టు స్టే ఇచ్చింది. తెలుసుకునే హక్కు కన్నా వ్యక్తిగత గోప్యతా >>2

# 'స్త్రీశక్తి' గ్రాండ్ సక్సెస్

## • ఉచిత బస్సులకు త్వరలో లైవ్ ట్రాకింగ్ • బస్సులకు రెండు వైపులా బోర్డులు • ఆర్టీసీ సమీక్షలో సిఎం చంద్రబాబు • 13 రోజుల్లో 100% ఆక్యుపెన్సీతో బస్సులు నడుస్తున్నాయన్న అధికారులు



సోమవారం ఆర్టీసి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ ఆగస్టు 25,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళల సహకారంతో స్త్రీ శక్తి పథకం గ్రాండ్ సక్సెస్ అయిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆర్టీసీపై సిఎం చంద్రబాబు సమీక్షించారు. స్త్రీ శక్తి పథకం అమలు ఎలా జరుగుతుందని ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆక్యుపెన్సీ రేషియో ఎంత మేర పెరిగిందని ఆరా తీశారు. స్త్రీ శక్తి బస్సుల్లో సీట్ల కోసం పోటీ పడే క్రమంలో ఏమైనా ఇబ్బందులు ఎదురువుతున్నాయా..? అని ముఖ్యమంత్రి అడిగారు. స్త్రీ శక్తి పథకం అమలు చేసినప్పటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో పెరిగిందని అధికారులు చెప్పారు. గతంలో ఆక్యుపెన్సీ రేషియో 68 నుంచి 70 శాతంగా ఉండేదని.. ఇప్పుడు 60 డిపోల పరిధిలో తిరిగే బస్సుల్లో 100 శాతం ఆక్యుపెన్సీ రేషియో వస్తోందని.. అలాగే 13 జిల్లాల్లో 100 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో బస్సులు తిరుగుతున్నాయని అధికారులు వివరించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సందర్భంగా సీట్ల కోసం ఇబ్బందులు.. గందరగోళం వంటి సంఘటనలు తలెత్తడం లేదని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. అంతే కాకుండా.. ఉచిత బస్సు వెసులుబాటును మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారని... అవసరమైనమేరకే ప్రయాణాలు చేస్తున్నారని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.."ఏపీ మహిళల్లో చైతన్యం ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం ఎలాంటి పథకాలను తెచ్చినా.. వాటిని సద్వినియోగం చేస్తారు. ప్రభుత్వం అందించేపథకాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందుతారు. అందుకే తాను ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా ఉన్నప్పటి నుంచి మహిళలకు ప్రత్యేక పథకాలు ఇవ్వడానికి ఆసక్తిచూపిస్తా. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంభనకల్పిస్తే.. ఇప్పుడు స్త్రీశక్తి ద్వారా ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించాం. ఒకప్పుడు బాలికా విద్యను ప్రోత్సహించేందుకు సైకిళ్లు ఇచ్చాం. ఇప్పుడు విద్యార్థినులు, మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం కానుకగా ఇచ్చాం. దీని వల్ల బస్ పాసుల కోసం క్యూ లైన్లల్లో నిల్చొనే శ్రమ తప్పింది. ఆర్టీసీ బస్సుల్లో వెళ్తే భద్రత కూడా ఉంటుంది." అని సిఎం >>2

# కుప్పంలో కృష్ణమ్మ పరుగులు

## • మూడు నెలల ముందే రైతులు, ప్రజల కల సాకారం • హంద్రీ-నీవా కాలువల వెంబడి జనం • జలహారతులతో స్వాగతం



హంద్రీ-నీవా కాలువల ద్వారా కుప్పం వచ్చిన కృష్ణాజలాలు

**కుప్పం, ఆగస్టు 25 ప్రభాతవార్త:** సిఎం చంద్రబాబునాయుడు తలపెట్టిన సంకల్పం సిద్ధించింది. రాష్ట్రంలోనే చిట్టచివరి నియోజకవర్గమైన కుప్పానికి కృష్ణాజలాలు తెస్తానని చెప్పిన మాట నిలబెట్టుకున్నారు. సిఎం చంద్రబాబునాయుడు చొరవతో కుప్పం ప్రాంతంలో హంద్రీ-నీవా కాలువల్లో కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. దీంతో పడమటి మండలాల రైతులు, ప్రజలు కృష్ణమ్మకు జలహారతులతో ఘనస్వాగతం పలుకుతూ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలం డ్యామ్ బ్యాక్ వాటర్‌నుంచి వస్తున్న కృష్ణాజలాలతో రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో రైతులకు సాగుకు, ప్రజలకు తాగేందుకు జలాలు అందుతున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ కల్లా హంద్రీ-నీవా జలాలు కుప్పానికి వస్తాయని పేర్కొన్నా మూడు నెలల ముందే ముఖ్యమంత్రి చొరవతో కుప్పానికి నీళ్లు చేరాయి.

**రైతులు.. ప్రజల కల సాకారం :**

ఎటువంటి శాశ్వత జలవనరులులేని కుప్పం ప్రాంతంలో రైతులు వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేస్తారు. ఇలాంటి తరుణంలో కుప్పం రైతుల కష్టాలు తీర్చాలని సిఎం చంద్రబాబు 2015లోనే హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్‌కెనాల్‌పనులకు శ్రీకారం చుట్టారు. >>2

# డిప్యూటీ స్పీకర్ రఘురామకు సుప్రీం కోర్టులో ఊరట

## కానిస్టేబుల్ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసిన ధర్మాసనం



**విజయవాడ,ఆగస్టు25.ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజుపై కానిస్టేబుల్ కేసుకు సంబంధించి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. ఫరూక్ బాషా అనే కానిస్టేబుల్ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను సోమవారం సుప్రీం ధర్మాసనం కొట్టివేస్తున్నట్లు తీర్పువెలువరించింది. రఘురామ, అతడి కార్యాలయ సిబ్బంది దాడి చేశారంటూ కొన్నేళ్ల కిందట కేసు వేసిన పిటిషనర్ ఫరూక్.. ఈ కేసును తాను కొనసాగించుకోదలచుకోవడం లేదంటూ అత్యున్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలుచేశారు. ఈ అఫిడవిట్ పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ జెకె మహేశ్వరిధర్మాసనం ఈ కేసును కొట్టివేస్తు న్నట్లు తీర్పు ఇచ్చింది.హైదరాబాద్ గచ్చిబౌలి బౌల్డర్ >>2

# 'మెగాసిటీ'గా తిరుపతి!

## నెల్లూరు తరహాలో రోడ్ల పరిశుభ్రతకు స్వీపింగ్ యంత్రాలు

## ఎల్ఆర్ఎస్‌కు మంత్రివర్గం ఆమోదం: మంత్రి నారాయణ



సోమవారం తిరుపతిలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

**తిరుపతి,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** స్మార్ట్‌సిటీగా రూపుదిద్దుకున్న తిరుపతినగరం ప్రాధాన్యత దృష్ట్యా మెగాసిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు, నిధులు సమకూర్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. నెల్లూరు తరహాలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్ల పరిశుభ్రతకు స్వీపింగ్ యంత్రాలను వినియోగించాలని మంత్రి నగర కమిషనర్ మౌర్యను ఆదేశించారు. వచ్చే జూన్ నెలాఖరుకు >>2

# 'మెప్మా'తో మహిళలకు స్వయం ఉపాధి

## వెయ్యి మందికి పైగా లబ్ధిదారులకు రుణ సౌకర్యం

## చేతిలోని స్మార్ట్‌ఫోన్‌తో సైతం మహిళలకు ఆదాయం: మంత్రి లోకేష్



**సచివాలయం,ఆగస్టు 25,ప్రభాతవార్త :** ఎపి మహిళలు సరికొత్త మార్గంలో పయనిస్తున్నారు.మెప్మా సహకారంతో స్వయం ఉపాధి పొందుతూ వారి కుటుంబాలకు ఆసరాగా ఉంటారని ఐటి,విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.చేతిలోని స్మార్ట్ ఫోన్ ఉపయోగిస్తూ,ఎలక్ట్రిక్ స్కూటర్ నడుపుతూ సొంతంగా సంపాదిస్తున్నారు.రాష్ట్రంలో విజయవాడ,విశాఖపట్నం,నెల్లూరు తదితర నగరాల్లో మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా సొంత కాళ్లపై నిలబడేందుకు ర్యాపిడో ద్వారా కుటుంబానికి అదనపు ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

**ఒక కుటుంబం -- ఒక వ్యాపారవేత్త స్ఫూర్తి**

మహిళల స్వయం ఉపాధికి తొలి అడుగు ఈ ఏడాది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పడింది. అదే రోజు సిఎం చంద్రబాబు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించడంతో మొదలైంది. సిఎం మానస పుత్రికగా ప్రారంభించిన ఒకకుటుంబం - ఒక వ్యాపారవేత్త కింద మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరి >>2



ఫిజీ ప్రధాని సిత్వెని రబుకా సోమవారం న్యూఢిల్లీలో రాజ్‌ఘాట్‌ను సందర్శించి గాంధీకి నివాళులర్పించిన దృశ్యం

# కోర్సుల్లో సంస్కరణలు

>> గిన విద్యార్థులకు నర్సింగ్ కోర్సులో ప్రవేశాలు లభిస్తాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

**ప్రవేశానికి అర్హతలు**

నాలుగేళ్ల బియస్సీ(నర్సింగ్) కోర్సులో ప్రవేశం పొందడానికి...సాధారణ తరగతులకు (అన్ రిజర్వ్‌డ్) చెందిన వారు ఎపిఎన్‌సెట్ పరీక్ష రాసిన వారిలో 50 పర్సంటైల్‌లో ఉండాలి(అనగా ఎపిఎన్‌సెట్ పరీక్ష రాసిన వారిలో 50 శాతం వారు పొందిన మార్కుల కంటే ఎక్కువ పొంది ఉండాలి). సాధారణ తరగతులకు చెందిన దివ్యాంగులు 45 పర్సంటైల్ లో ఉండాలి(45 శాతం వారు సాధించిన మార్కుల కంటే ఎక్కువ పొంది ఉండాలి).

ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ తరగతులకు చెందిన వారు, ఈ తరగతులకు చెందిన దివ్యాంగులు 40 పర్సంటైల్‌లో ఉండాలి.రాష్ట్రంలో బియస్సీ(నర్సింగ్) విద్యను అందించే కళాశాలల్లో మొత్తంగా 13,726 సీట్లుండగా...2024-25 విద్యా సంవత్సరంలో కన్వీనర్ కోటాలో 6,441 మంది విద్యార్థులు ప్రవేశాలు తీసుకోగా, మేనేజ్‌మెంట్ కోటాలో 5,144 మంది ప్రవేశాలు పొందారు. 2,141 సీట్లు మిగిలిపోయాయి. కన్వీనర్ కోటా ప్రవేశాల్లో రిజర్వేషన్ నియమాలు వర్తిస్తాయి. మేనేజ్‌మెంట్ సీట్లలో రిజర్వేషన్లు ఉండవు.



సోమవారం న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రైతుల 'సంయుక్త కిసాన్ మోర్చా' ఆందోళన దృశ్యం

# సమర్ధంగా నీటి నిర్వహణ

>> 52 టిఎంసిలు, వంశధార నుంచి 8 టిఎంసిల మేర నీటిని కాలువలకు విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు, హంద్రీ నీవా, నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా ఈ సీజన్లో ఇప్పటి వరకు 156 టిఎంసిల నీటి వినియోగం జరిగింది. ఈ ఏడాది హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా మల్యాల ఎత్తిపోతల నుంచి రాయలసీమ ఉమ్మడి జిల్లాల్లో ఉన్న లక్షల ఎకరాల ఆయకట్టుకూ సాగునీరు అందిస్తున్నారు. హంద్రీనీవా కాలువల వెడల్పు చేయడంతో 738 కి.మీ ప్రయాణించి కృష్ణా జలాలు చిత్తూరు జిల్లా చివరి ప్రాంతాలకు చేరుతున్నాయి. కృష్ణా జలాలు ఇప్పటికే కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం చంద్రబాబు సూచనలతో ఏడాది కాలంగా చేపట్టిన సమర్ధ నీటి నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ ద్వారా పంటలకు అవసరమైన సాగునీరు సకాలంలో ఇవ్వడంతో పాటు... రానున్న కాలానికి అవసరమైన విధంగా రిజర్వాయర్లను నీటితో నింపుతున్నారు.

ఈ సీజన్ లోనే 1969 టిఎంసిలు సముద్రం పాలు.. ఇలా సాధ్యమైనంత ఎక్కువ మొత్తంలో వరద నీటిని సద్వినియోగం చేసుకుంటున్నా... వివిధ నదీ బేసిన్ల నుంచి పెద్ద ఎత్తున నీరు సముద్రంలోకి వెళ్లింది. ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న వరద ప్రవాహాలతో మన ప్రాజెక్టులు నిండగా మిగిలిన నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. గోదావరి, కృష్ణా, వంశధార, పెన్నా బేసిన్ల నుంచి ఈ సీజన్లో జూన్ 1 తేదీ నుంచి ఇప్పటి వరకూ 1969 టిఎంసిలకు పైగా నీరు సముద్రంలో కలిసింది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి గోదావరి నీరు ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకూ 1483 టిఎంసిల మేర సముద్రంలోకి వెళ్లింది. ప్రకాశం బ్యారేజి నుంచి డెల్టా అవసరాల వినియోగం తర్వాత సముద్రంలోకి ఈ సీజన్లోనే 468 టిఎంసిల నీరు వెళ్లింది. అలాగే వంశధార బేసిన్లో ఈ వర్షాకాల సీజన్లో ఇప్పటికే 18 టిఎంసిలకు పైగా సముద్రంలోకి వదిలారు. ప్రస్తుతం శ్రీశైలం నుంచి 4.38 లక్షలు, సాగర్ నుంచి 3.38 లక్షలు, పులిచింతల నుంచి 2.72 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి పంట కాలువలకు 18 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పైనుంచి వరద వస్తుండడంతో 3.42 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. ఎగువ రాష్ట్రాలనుంచి వరద వచ్చిన సమయంలో మన రిజర్వాయర్లు నింపుకున్నా...పెద్ద మొత్తంలో నీరు సముద్రం లోకి పోతోంది. నదుల అనుసంధానం ద్వారా వరద నీటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ముందుగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసుకుని గరిష్ట నీటి వినియోగం సాధించడం, కొత్త ప్రాజెక్టులు చేపట్టడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్న విషయం నిరంతరం గుర్తుంచుకోవాలన్నారు.

# డిగ్రీ వివాదం

>> పరిరక్షణ హక్కు మిన్న కాబట్టి సిఐసి ఉత్తర్వును కొట్టివేయాలని ఢిల్లీ విశ్వవిద్యాలయం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. ప్రధాని మోడీ డిగ్రీ వివరాలను కోర్టుకు అందించడానికి యూనివర్సిటీ సిద్ధంగానే ఉన్నా ఆర్టిఐ కింద ఈ వివరాలను అపరిచితులతో పంచుకునేం దుకు సుముఖంగా లేదని తెలిపారు. విద్యార్థుల రికార్డులకు తాము సంరక్షణదారులమని ఇతరుల ఆసక్తిని తృప్తిపరిచేందుకు ఆ రికార్డులను ఆర్టిఐ కింద బయటపెట్టాల్సిన అవసరం లేదని డియు పేర్కొంది.

## సుప్రీం కోర్టులో ఊరట

>> హిల్స్‌లోని రఘురామకృష్ణరాజు నివాసం వద్ద ఎస్‌కే ఫరూక్ బాషా అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. ఆయన భద్రతా సిబ్బంది పిలిచి విచారించారు. ఐడీ, ఆధార్ కార్డులు చూపించమని అడగ్గా ఫరూక్ అందుకు నిరాకరించాడు. దీంతో అనుమానం వచ్చి గచ్చిబౌలి పోలీసులకు అప్పగించి రఘురామ పిఏ ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో ఫరూక్ బాషా ఎపి ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ అని తేలింది. ఆ తర్వాత విధి నిర్వహణలో ఉన్న తనపై నలుగురు వ్యక్తులు దాడి చేశారంటూ.. ఎంపీ రఘురామ కృష్ణరాజుతోపాటు మరో నలుగురిపై ఫరూక్ బాషా కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం తనతో పాటు తన కుమారుడు, మరో ఇద్దరిపై నమోదైన కేసును క్వాష్ చేయాలని రఘురామ హైకోర్టును ఆశ్రయించగా చుక్కెదురైంది. ఈ తీర్పును సవాల్ చేస్తూ 12 జూలై 2022న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ సమయంలో ఎంపీగా ఉన్నానని, అప్పటి సీఎం వైఎస్ జగన్‌తో ఘర్షణలు ఉన్న కారణంగా వై కేటగిరీ భద్రత ఉండేదని. అందుకే అనుమానాస్పదంగా తిరుగాడుతున్నవ్యక్తిని సందేహంతోప్రశ్నిస్తే ఇదంతా జరిగిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అదీగాక, ఇటీవల ఫరూక్ సైతం ఎపికి, హైదరాబాద్‌కు 400 కిలోమీటర్ల దూరంఉన్న కారణంగా పిటిషన్ ఉపసంహరించు కోవాలని ముందుకొచ్చిన నేపథ్యంలో సుప్రీం ధర్మాసనం కేసును కొట్టివేసింది

# కుప్పంలో కృష్ణమ్మ పరుగులు

>> పెద్దపంజాణి మండలం అప్పినపల్లి నుంచి కుప్పం బ్రాంచ్‌కెనాల్ కాలువ 143కి.మీ.ల మేర ఉంది. అప్పట్లోనే దాదాపు 436కోట్లు నిధులు కేటాయించారు. అనంతరం 2019లో మరో వంద కోట్లు మంజూరు చేశారు. అయితే ఎన్నికల నాటికి 87శాతం పనులు పూర్తయ్యాయి. అనంతరం అధికారంలో వచ్చిన వైఎస్సార్సీ ప్రభుత్వం హంద్రీ-నీవా పనులు పూర్తి చేయక ఎన్నికల ఏడాది 2024లో స్టంట్ వేసింది. కాలువల్లో పూర్తిస్థాయి నీరు లేకున్నా నీటిని విడుదల చేసి అభాసుపాలైంది. మరలా అధికారంలో వచ్చాక సిఎం చంద్రబాబు హెచ్ఎన్ఎస్ఎస్ పనుల పూర్తికి చర్యలు చేపట్టారు. ఏడాది కాలంలోనే దాదాపు గతంలో ఎన్నడూ ఖర్చు చేయని రీతిలో 3890కోట్లు ఖర్చు చేసి చివరి ప్రాంతం అయిన కుప్పానికి నీరు అందిస్తున్నారు. దీంతో రైతులు, ప్రజల కల సాకారం అయింది. పడమటి ప్రాంతాలైన పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోకి హంద్రీ-నీవా కాలువల ద్వారా కృష్ణా జలాలు రావడంతో కాలువల వెంబడి జనం, రైతులు పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు. తమ తమ గ్రామాల్లో కృష్ణమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, జలహారతులు పడుతున్నారు.

**ఎక్కడి శ్రీశైలం.. ఎక్కడి కుప్పం :**

ఎక్కడో కర్నూలు జిల్లాలో ఉన్న శ్రీశైలం డ్యామ్.. రాష్ట్రంలోనే చివరి నియోజకవర్గం కుప్పం. వీటి మధ్య దూరం దాదాపు 550కి.మీ.లకుపైనే. అక్కడి నుంచి కృష్ణానదీ జలాలు కర్నూలు, అనంతపురం, అన్నమయ్య జిల్లాల మీదుగా పుంగనూరు, పలమనేరు మీదుగా కుప్పం రావడం అంటే అది నిజంగా చరిత్రే. ఈ చరిత్రను సిఎం చంద్రబాబు సృష్టించి రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తున్న అపర భగీరథుడు అనడంలో సందేహం లేదు.

# 'మెగాసిటీ'గా తిరుపతి!

>> తిరుపతిలో తుడ టవర్స్‌ను పూర్తిచేస్తామన్నారు. గతప్రభుత్వం క్రమపద్ధతి లేకుండా టౌన్‌ప్లానింగ్ చేసిందని ఆయన విమర్శించారు. భవన నిర్మాణాల అనుమతుల విషయంలో కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోందని తెలిపారు. సోమవారం ఉదయం తిరుపతి తుడ కార్యాలయంలో పట్టణాభివద్ధిపై తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, నగరపాలక కమిషనర్ మౌర్య, తుడ విసి శుభంబన్సల్, పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మతో కలసి మంత్రి నారాయణసమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి ప్లానింగ్ లేకుండా భవనాలు నిర్మించారని, ల్యాండ్ రెగ్యులైజేషన్ పథకం(ఎల్‌ఆర్‌ఎస్) ఇప్పటికే మంత్రివర్గం ఆమోదించిందన్నారు. త్వరలోనే బిల్డింగ్ రెగ్యులైజేషన్ పథకం(బిఆర్‌ఎస్)పై చర్చించనున్నట్లు తెలిపారు.

ప్రతినెలా శాలిలైట్ చిత్రాల పరిశీలన, అధ్యయనంతో ప్లానింగ్‌కు విచలనంఉంటే సిఎం సూచనలతో చర్యలు తీసుకుంటామన్నారు. ఆమోదంలేకుండా భవనాలు నిర్మించుకుంటే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. తిరుపతి నగరం పరిధిలో టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేసి తుడ ఆదాయాన్ని పెంచాలని సూచించారు. తుడ ప్రాజెక్ట్ నిర్మాణపనుల్లో వేగంపెంచాలని, కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు పన్నుల ద్వారా వస్తున్న ఆదాయాన్ని కమిషనర్ మౌర్య మంత్రికి వివరించారు. పక్కాప్రణాళికలతో ముందుకెళ్లి లక్ష్యాన్ని చేధించాలని మంత్రి నిర్దేశం చేశారు.ప్రభుత్వాన్ని తప్పుదారిపట్టించే నివేదికలు వద్దని, ఏ విషయంలనూ వాస్తవ పరిస్థితులు చెప్పాలని గట్టిగా తెలిపారు.

# రాష్ట్రంలో రైతులకు ఎరువుల కొరత ఉండదు: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ ఆగస్ట్ 25, ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్రంలోని రైతులకు ఎరువుల సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా, పంటలకు అవసరమైన ఎరువులు సమయానికి అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఖరీఫ్ 2025 సీజన్‌లో ఎరువుల అవసరం, సరఫరా, నిల్వలు, కేంద్రంరాష్ట్రం సమన్వయం, రైతులకు ఇచ్చిన హామీలపై మంత్రి అచ్చెన్నాయుడు విస్తృతంగా వివరణ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్‌కు 31.15 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరంగా అంచనా వేయబడి, ఇప్పటి వరకు 21.34 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి చేరాయనితెలిపారు. అందులో యూరియా, డీఏపీ, ఎంఒపీ, ఎస్ఎస్‌పీ, కాంప్లెక్స్ ఎరువులు కలిపి 6.22 లక్షల మెట్రిక్ టన్నులు రైతులకు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

రైతులకు ఎరువుల కొరత రాకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని 1.10 లక్షల మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ ఉంచిందని మంత్రి తెలిపారు. గోదావరి వరదల వల్ల కొన్ని ప్రాంతాల్లో రవాణా సమస్యలు తలెత్తినప్పటికీ, రైతులకు ఎరువులు సమయానికి అందేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఇంకా 79,633 మెట్రిక్ టన్నులు డిపోలలో నిల్వగా ఉండగా, అవసరమైన ప్రాంతాలకు తరలింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

ఎరువుల సరఫరాలో కేంద్రం-రాష్ట్రం సమన్వయంతో 50:50 నిష్పత్తిలో పంపిణీ జరుగుతోందని మంత్రి స్పష్టం చేశారు. కేంద్రం నుండి ఇప్పటి వరకు 3.50 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, అందులో 1.30 లక్షల మెట్రిక్ టన్నులు చేరాయని, 0.47 లక్షల మెట్రిక్ టన్నులు రాబోతున్నాయని తెలిపారు. ఆగస్టు నెలలో 1.65 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, అందులో 0.75 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే రాష్ట్రానికి చేరాయని, మిగిలిన 0.90 లక్షల మెట్రిక్ టన్నులు గంగవరం, కాకినాడ, విశాఖపట్నం, ఒరిస్సా పోర్టుల ద్వారా త్వరలో చేరనున్నాయని వివరించారు. రైతులకు ఎరువులు పారదర్శకంగా, సమయానికి అందించేందుకు ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా పర్యవేక్షణ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. ఈ విధానం వల్ల ఎరువుల నిల్వలు, అవసరాలు, పంపిణీపై రియల్ టైమ్ సమాచారం అందుతుందని చెప్పారు. జిల్లా స్థాయి అధికారులు, సహకార సంఘాలు, వ్యవసాయ శాఖ సంయుక్తంగా సమన్వయం చేసుకుంటూ ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 6.48 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని మంత్రి స్పష్టం చేశారు. రైతులు సాగు కొనసాగించడానికి కావలసినంత ఎరువులు సకాలంలో అందుతాయని హామీ ఇచ్చారు. వర్షాల ప్రభావంతో కొన్నిచోట్ల రవాణా ఆలస్యం జరిగినా, రైతులకు ఇబ్బంది కలగకుండా తక్షణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వర్షాల వలన దెబ్బతిన్న ప్రాంతాల్లో పంటలకు ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎరువులు అందిస్తున్నామని చెప్పారు.

# 'స్త్రీశక్తి' గ్రాండ్ సక్సెస్

>> చెప్పారు.

**సహకరిస్తోన్న మహిళలకు ధన్యవాదాలు..**

స్త్రీ శక్తి పథకాన్ని మహిళలు చాలా చక్కగా ఉపయోగించుకుంటున్నారు. అవసరం ఉంటేనే బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. అనవసర ప్రయాణాలు పెట్టుకో వడం లేదు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా భారమైనా సరే.. మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి... వారికి చేయూత అందివ్వడానికే స్త్రీ శక్తి పథకం ప్రారంభిస్తున్నామని మహిళలకు చెప్పాను. ఆ మేరకు మహిళలు కూడా సహకరిస్తున్నారు. రాష్ట్ర పరిస్థితిని అర్థంచేసుకుని... దానికి అనుగుణంగా వ్యవహరిస్తున్న మహిళలకు ధన్యవాదాలు. ఇప్పటి వరకు సహకరించిన విధంగానే మహిళలు భవిష్యత్తులోనూ సహకరించాలని కోరుతున్నాను. ఆర్టీసీ సిబ్బందికి ప్రయాణికులు సహకరించాలి. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు.. అభివృద్ధి కార్యక్రమాలకు ఇదే విధమైన సహకారం లభిస్తే.. మరింత ఉత్సాహంగా పని చేస్తాం. మరింత మేలు ప్రజలకు, మహిళలకు చేకూర్చగలం." అని చంద్రబాబు వివరించారు.

**బోర్డులు పెట్టండి... లైవ్ ట్రాకింగ్ అమల్లోకి తీసుకురండి.**

స్త్రీ శక్తి పథకం కింద నడిపే బస్సులకు వెనుకా... ముందు భాగాన బోర్డులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మొత్తంగా 8,458 స్త్రీ శక్తి బస్సులకు బోర్డులు పెట్టాలని చెప్పారు. సీట్లకోసం పోటీ పడితే.. ఆర్టీసీ సిబ్బంది సంయమనంతో వ్యవహరించాలని సీఎం సూచించారు. ఇప్పటి వరకు ప్రయాణికులతో ఆర్టీసీ సిబ్బందికి ఎలాంటి ఘర్షణ వాతావరణం తలెత్తలేదని ఆర్టీసీ ఎండీ తెలిపారు. మహిళా ప్రయాణికుల సంఖ్య ఎంత మేరకు పెరిగిందని ముఖ్యమంత్రి ఆరా తీశారు. పథకం ప్రారంభానికి ముందు 40 శాతం మహిళలు ప్రయాణిస్తే.. 60 శాతం మంది పురుషులు ప్రయాణించే వారని.. ఇప్పుడు 65 శాతం మేర మహిళలు ప్రయాణిస్తుంటే.. 35 శాతం మేర పురుషులు ప్రయాణిస్తున్నారని అధికారులు వివరించారు. అలాగే స్త్రీ బస్సుల లైవ్ ట్రాకింగ్ విధానం ఎప్పటి నుంచి అమల్లోకి తెస్తున్నారని ముఖ్యమంత్రి ఆరా తీశారు. రెండు, మూడు రోజుల్లో గుంటూరు డిపోలో స్త్రీ శక్తి బస్సుల లైవ్ ట్రాకింగ్ విధానాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపడతామని... ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా స్త్రీ శక్తి బస్సులకు లైవ్ ట్రాకింగ్ విధానాన్ని ప్రవేశపెడతామని అధికారులు చెప్పారు. లైవ్ ట్రాకింగ్ విధానం అమల్లోకి వస్తే.. బస్సుల వేళలు తెలుసుకుని.. ఆ మేరకు తమ ప్రయాణ సమయాలను మహిళలు ఫిక్స్ చేసుకుంటారని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమీక్ష సందర్భంగా ఆర్టిక్యులేటెడ్ ఈ బస్సులపై అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ తరహా బస్సులు ప్రస్తుతమున్న సాధారణ బస్సులకు... మెట్రో రైలుకు మధ్య మిడిల్ లెవెల్ ట్రాన్స్ పోర్టు వ్యవస్థగా ఉంటాయని అధికారులు వివరించారు.

# ప్రతిభ చూపిన ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ విద్యార్థులు

## ఐఐటి, నిట్, నీట్‌లో రాష్ట్రం నుంచి 55 మంది ఎంపిక

## సిఎం చంద్రబాబును కలిసి సంతోషాన్ని పంచుకున్న విద్యార్థులు

## సీట్లు పొందిన ఒక్కో విద్యార్థికి ప్రోత్సాహకంగా రూ.లక్ష అందించిన సిఎం

**విజయవాడ, ఆగస్టు 25,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతిభావంతులైన విద్యార్థుల ఎదుగుదలకు ఆర్థికంశాలు అవరోధం కాకూడదని సిఎం చంద్రబాబు అన్నారు. విద్యలో రాణించే పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఐఐటీ, నిట్, నీట్ పరీక్షల్లో రాణించడానికి ప్రభుత్వం నగదు ప్రోత్సాహంతో పాటు,అన్ని వసతులు కల్పిస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదివి ఈ యేడాది ఐఐటి, నిట్, నీట్‌లో విజయం సాధించిన విద్యార్థులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఐఐటీ, నిట్, నీట్‌లో సీట్లు సాధించిన 55 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ సంతోషాన్ని ముఖ్యమంత్రితో పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ముఖ్యమంత్రి... మరింతగా కష్టపడి ఉన్నత చదువుల్లోనూ ప్రతిభ చూపాలని సూచించారు. భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవడంతో పాటు... రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**ప్రోత్సహించండి,స్ఫూర్తినింపండి**

విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేలా సాంఘిక సంక్షేమ విద్యాసంస్థలు రూపుదిద్దుకోవాలి. రాష్ట్రంలోని విద్యార్థుల్లో ప్రతిభకు కొదవలేదు. వారికి సరైన వసతులు, ప్రోత్సాహం అందిస్తే ప్రపంచంలో అందరితో పోటీ పడే సత్తా ఉంది. ఇందుకు 55 మంది విద్యార్థులే నిదర్శనం. సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల నుంచి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ఎంపికయ్యే విద్యార్థుల సంఖ్య వచ్చే ఏడాదికి నాలుగు రెట్లుపెరగాలి. ఇప్పుడు ర్యాంకులు సాధించిన విద్యార్థులు తాము చదువుకున్న పూర్వ విద్యాసంస్థకు వెళ్లి అక్కడ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలి. అని ముఖ్యమంత్రి విద్యార్థులతో అన్నారు.

**356 మందికి శిక్షణ... 55 మంది ఎంపిక**

కర్నూలు జిల్లా చిన్నటేకూరు, ఎన్టీఆర్ జిల్లా కుంటముక్కల, గుంటూరు జిల్లా అడవి తక్కెళ్లపాడులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఐఐటీనీట్ సెంటర్లలో వీరంతా కోచింగ్ తీసుకుని ర్యాంకులు సాధించారు. ఈ సెంటర్లలో జేఈఈ మెయిన్ అండ్ అడ్వాన్స్డ్‌లో 176 మంది శిక్షణ పొందగా 129 మంది క్వాలిఫై అయ్యారు. నీట్‌కు 180 మంది కోచింగ్ తీసుకోగా 143 మంది క్వాలిఫై అయ్యారు. చివరగా ఐఐటీలో 12 మంది, నిట్‌లో 30 మంది, నీట్ ఎంబీబీఎస్‌లో 13 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. మొత్తం 55 మంది విద్యార్థుల్లో 20 మంది విద్యార్థినులు ఉండటం విశేషం. వీరు కాకుండా బీడీఎస్‌లో మరో 14 మందికి సీట్లు వచ్చే అవకాశం ఉంది. జీఎఫ్‌టీఐ, సెంట్రల్ యూనివర్సిటీల్లో 19 మందికి సీట్లు లభిస్తాయి.

**ఈ ఏడాది కొత్తగా 7 కోచింగ్ సెంటర్లు**

ఈ ఏడాది కొత్తగా మరో 7 ఐఐటీనీట్ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. కొత్తగా ఏర్పాటు చేసే సెంటర్లతో 1,411 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి అన్నారు. సమావేశం చివరిలో ఐఐటీ, నిట్, నీట్‌లో సీట్లు సాధించిన విద్యార్థులకు మెమొంటోలు, ఒక్కో విద్యార్థికి రూ.లక్ష చొప్పున చెక్ స్వయంగా అందించి వారితో విడివిడిగా ఫోటోలు దిగారు. మొత్తం 55 మంది విద్యార్థులకు రూ.55 లక్షలు ఇచ్చారు. విద్యార్థులు అంతా పేదరికం నుంచి వచ్చి ఉత్తమ ప్రతిభ చూపడంతో ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. భుజం తట్టి ఆల్ ది బెస్ట్ చెప్పారు. సమావేశం చివరిలో బోధనా సిబ్బంది, విద్యార్థులు ముఖ్యమంత్రితో గ్రూపు ఫోటో తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, అధికారులు పాల్గొన్నారు.

# మహిళలకు స్వయం ఉపాధి

>> యాస్ (మెప్మా) సంస్థ ర్యాపిడో ద్వారా మహిళలకు ఎలక్ట్రిక్ వాహనాలు అందించింది.అందులో భాగంగా తొలిదశలో 9పట్టణాల్లో 1000మంది లబ్ధిదారులకు రుణ సౌకర్యం కల్పించారు. వీటిలో విశాఖపట్నంలో 400వాహనాలు,విజయవాడలో 400, నెల్లూరు, గుంటూరులో 50చొప్పున, కర్నూలు, తిరుపతి, కాకినాడ, రాజమండ్రిలో 25వాహనాలు చొప్పున మహిళలకు అందజేశారు. వీటిలో ఎలక్ట్రిక్ టూ వీలర్లు కాగా,240ఎలక్ట్రిక్ త్రీ వీలర్లు ఉన్నాయి.

**మహిళల విజయగాథలు**

విజయవాడకు చెందిన వడ్లపూడి గ్లోరీ మంజు మార్చిలో ప్రభుత్వ సబ్సిడీతో స్కూటర్ కొనుగోలుచేసి ర్యాపిడో నడపడం ప్రారంభించారు.ప్రస్తుతం నెలకు రూ.10వేల వరకు సంపాదిస్తున్నారు.సొంత కాళ్లపై నిలబడటం ద్వారా వస్తున్న ఆదాయం కన్నా ఆర్థిక స్వాతంత్ర్యం లభించడంతో సంతోషంగా ఉందని మంజు చెబుతున్నారు.

విజయవాడలోని కండ్రిక ప్రాంతానికి చెందిన మాధవి తన భర్తకు పక్షవాతం రావడంతో కుటుంబ బాధ్యతలను తాను స్వీకరించారు.ఎస్సీ వర్గానికి చెందిన నేను బ్రహ్మానందరెడ్డిని ప్రేమ వివాహం చేసుకున్నాను.ఆయనకు పక్షవాతం వచ్చిన తర్వాత ప్రభుత్వం ఇచ్చే రూ.6000లు దివ్యాంగ పెన్షన్ మందులకు సరిపోతుంది.ఈ సమయంలో మెప్మా ద్వారా రుణం పొంది యాక్టివా టూ వీలర్ కొన్నారు.ర్యాపిడో నడుపుతూ నెలకు రూ.12వేలు సంపాదిస్తున్నాను ఈఎంఐ చెల్లించడంతోపాటు ఇంటిని నడపడానికి ఆ ఆదాయం తోడ్పడుతుందని సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

**ఇది ఆరంభం మాత్రమేనన్న మంత్రి లోకేష్**

మహిళలు సాధికారత సాధించాలనేది ప్రభుత్వ ఆలోచన అని విద్య,ఐటి శాఖమంత్రి లోకేష్‌అన్నారు. టిడిపి మహిళా రిజర్వేషన్లను ప్రవేశపెట్టడంతో పాటు అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు.ర్యాపిడోతో కలసి రాష్ట్రంలో 1000మందికి పైగా మహిళలు స్వయ ఉపాధి సాధించినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఇది ఆరంభం మాత్రమేనని,రాబోయే రోజుల్లో మరింత చేస్తామని మంత్రి నారా లోకేష్ వివరించారు.

# మన చేనేతకు ప్రపంచ గుర్తింపు

>> ఇంకా ఆదరణ ఎలా చేయాలో అనే విషయాలపై దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. మన కళలను, ఆర్టిజన్స్‌ను, హ్యాండీ క్రాఫ్ట్స్‌ను అభివృద్ధి చేయటం మనందరి బాధ్యత అని అన్నారు. మన కుటుంబాలు చేనేతను ఆదరించేలా చేయాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. హ్యాండ్ ల్యూమ్స్ ఒక జీవనోపాధి దీన్ని ఇంకా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడక్ట్ క్రింద మన చేనేతకు 10 అవార్డ్స్ రావడం చేనేతకు గర్వకారణం అన్నారు. మొత్తం దేశంలో 30 అవార్డ్స్‌లో మనకు 10 అవార్డులు రావడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ఇందులో బాపట్ల జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డు, రాష్ట్రంలో 9 జిల్లా స్థాయి అవార్డులు వచ్చాయన్నారు. చేనేత మరియు జౌళి శాఖ కమిషనర్ జి. రేఖా రాణి మాట్లాడుతూ చేనేత ఉత్పత్తులను పెంచేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్స్‌ను ఆగస్టు నెలలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నేతన్నలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి జిఎస్టీ రీయింబర్స్‌మెంట్ కోసం ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. చేనేత కార్మికులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించి మరియు దేశములోని ప్రముఖ చేనేత ఉత్పత్తులను ఒకే వేదికపై తీసుకువచ్చి వినియోగదారులకు అందుబాటులో ఉంచే కార్యక్రమములో భాగంగా వీటిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చేనేత. జౌళిశాఖ అడిషనల్ డైరెక్టర్ మురళీకృష్ణ, జాయింట్ డైరెక్టర్ రాజారావు, డిప్యూటీ డైరెక్టర్ బి. నాగేశ్వరరావు, ఏడీలు హరికృష్ణ, వనజ, తదితరలు పాల్గొన్నారు.

**'గాంధీ బునకర్ మేళా'ను (జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన 2025)**

జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన2025 అనంతరం చేనేత వస్త్ర ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ ప్రాంతాలకు చెందిన స్టాల్స్‌ను ఆసక్తిగా గమనించారు. అంతేకాకుండా ఒక్కో చీర తయారీకి ఎన్ని రోజులు పడుతుంది, ఎంత మంది చీర తయారీలో పాల్గొంటారు అని స్టాల్స్ నిర్వాకులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రదర్శనలో దేశం మొత్తం మీద వివిధ రాష్ట్రాల నుంచి 100 స్టాల్స్ ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్రదర్శనలో బీహార్, చత్తీస్‌గఢ్, హర్యానా, జమ్మూ కాశ్మీర్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, వెస్ట్ బెంగాల్, ఝార్ఖండ్, గుజరాత్, ఢిల్లీ, హ్యాండిక్రాఫ్ట్స్ విభాగంలో 5, ఆంధ్ర రాష్ట్రం నుండి 45 చేనేత సంఘాలు పాల్గొననున్నాయి. ఈ వస్త్ర ప్రదర్శనలో అన్నిరకాల చేనేత ఉత్పత్తులు ఉత్పత్తి ధరలకే అందుబాటులో ఉంచబడును. కాటన్/సిల్క్ చీరలు, డ్రస్ మెటీరియల్స్, బెడ్‌షీట్లు, కలంకారి, జంథాని, కార్పెట్స్ వంటి విస్తృత శ్రేణి ఉత్పత్తులు ఈ మేళాలో ప్రదర్శన.అమ్మకానికి అందుబాటులో ఉంటాయి. కావున, మన విజయవాడ మరియు పరిసర ప్రాంత ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకుని, చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి, చేనేత కార్మికులను ప్రోత్సహించవలసిన అవసరం ఉంది.

## వారం - వర్జ్యం

26-08-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
తదియ మ.1.57
హస్త పూర్తి
వర్జ్యం : మ.1.01-2.46
దు.ఉ.8.24-9.14, 2) రా.11.27-12.17
శుభసమయం:ఉ.5.30-9.30, సా.4.30-5.15
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. కుటుంబసమస్యల నుండి బయటపడతారు.

**వృషభం:** ఉద్యోగంలో మార్పుల వెను వెంటనే ఫలితాలు ఇవ్వకపోయినా భవిష్యత్తులో కలిసివస్తుంది.

**మిథునం:** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. సోదరుల నుండి విలువైన సమాచారం.

**కర్కాటకం :** సంతాన విద్యా విషయంలో బాధ్యతాయుతంగా మసలుతారు. వస్తు లాభం.

**సింహం:** ఊహించని పరిణామాలు కుటుంబంలో కలతలు సృష్టిస్తాయి. వాహన సౌఖ్యం.

**కన్య :** సన్నిహితులతో స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. సభలు, సమావేశాలలో పాల్గొంటారు.

**తుల :** భాగస్వామ్య వ్యాపారాలు మినహా ఇతర వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి.

**వృశ్చికం:** ఉద్యోగపరంగా కొన్ని ఒడిదుడుకులు సంభవం. ఋణాలు తీరి కొంత ప్రశాంతత పొందుతారు.

**ధనుస్సు:** పెద్దల సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు.

**మకరం:** జీవిత భాగస్వామి సహకారం మీకు మనోధైర్యాన్నిస్తుంది. వాహనయోగం.

**కుంభం:** పోటీపరీక్షలు, ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలను శ్రమించి సాధిస్తారు.

**మీనం :** అయిష్టంగా కొన్ని కార్యక్రమాలు చేయవలసి రావడం కొంత ఇబ్బందికి లోనుచేస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

26-08Pg3exHMNWJQETC GNT ONG_26-08Pg3exHMNWJQETC.qxd 8/25/2025 10:43 PM Page 1



# శ్రీవాణి ఆఫ్‌లైన్ జారీ కొనసాగింపునకు తర్జనభర్జనలు!

## - ఆన్‌లైన్ టిక్కెట్లతోనూ సమస్యలున్నట్లు భక్తుల ఫిర్యాదు




**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఆలయంలో మరీ దగ్గరగా కులశేఖరపడి (మొదటి గడప) వద్దనుండి దర్శనం చేసుకునే అవకాశం ఉన్న శ్రీవాణిబ్రేక్ దర్శనాల టిక్కెట్లు ఆఫ్‌లైన్‌లో జారీ కొనసాగింపు విషయంలో టిటిడి ఎటూ తేల్చుకోలేకపోతోంది. భక్తుల నుండి డిమాండ్ విపరీతంగా ఉండటంతో ఈ టిక్కెట్లు తిరుమలలోని అన్నమయ్యభవనం సమీపంలో శ్రీవాణి ప్రత్యేక కౌంటర్‌ల వద్ద సమయం, సందర్భం లేకుండా జారీచేయడమే ప్రధానంగా భక్తుల నుండి నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. నిర్ణీతసమయం ప్రకారం ప్రతి రోజూ ఉదయం 10గంటలకు ఈ ప్రత్యేక కౌంటర్‌ల వద్ద టిక్కెట్లు జారీచేయాల్సి ఉంది. ఇందుకు భక్తులు వేకువజామున 3,4గంటల నుండే అక్కడ క్యూలైన్లో బారులుతీరి నిలబడుతున్నారు. రోజువారీగా తిరుమలలోని కౌంటర్లలో 800 శ్రీవాణి బ్రేక్ దర్శన టిక్కెట్లు ,రేణిగుంట విమానాశ్రయంలో 200 టిక్కెట్లు పొందిన భక్తులకు ఏరోజుకారోజు దర్శనం కావడంతో సాయంత్రం 4.30గంటలకు ఆలయంలోనికి వైకుంఠమ్ 1 క్యూలైన్‌ల నుండి అనుమతినిస్తున్నారు. దీనివల్ల డబ్బున్న ధనవంతులేగాక సామాన్యభక్తులు కూడా దర్శనం త్వరగా చేసుకునేందుకు వీలుకల్పించారు. ఈ నేపథ్యంలో సాధారణరోజుల్లోనూ మధ్యాహ్నం 12గంటలలోపే శ్రీవాణి బ్రేక్ దర్శన టిక్కెట్లు పూర్తిగా జారీఅవుతున్నాయి. ఇంకా వారాంతం,రద్దీ విపరీతంగా ఉండే రోజుల్లో మరీ అర్ధరాత్రి వేళ టిక్కెట్లు జారీచేస్తుండటంతో ఉదయం 6గంటలకల్లా ఆరోజు దర్శన టిక్కెట్లు పూర్తిగా కోటా లేకపోతోంది. టిక్కెట్లు జారీచేసే విషయంపై గత వారం తిరుమలలో భక్తులు రచ్చచేయడం, నిరసనలకు దిగడం జరిగింది. దీంతో శ్రీవాణి టిక్కెట్లు ఆన్‌లైన్ చేయాలని భావిస్తున్నారు. అయితే ఇప్పటికే ఆన్‌లైన్‌లో రోజువారీగా 500 టిక్కెట్లు మూడునెలలముందే విడుదల చేస్తుండటం, ఈ టిక్కెట్లు అందుకున్న భక్తులు కొన్ని అనివార్యకారణాలతో దర్శనాలకు రాలేకపోతున్నారనేది టిటిడి సమాచారం. అలాంటి సమయంలో ఆ టిక్కెట్లు వృధాగానే పోతున్నాయి. దీనివల్ల ఆఫ్‌లైన్‌లోనే జారీచేయడం వల్ల కొండకు చేరుకున్న భక్తులు తమతమ స్థాయిని బట్టి ముందువచ్చిన వారికి ముందు అనే విధంగా ఏరోజుకారోజు టిక్కెట్లు అందుకోవడానికి సౌలభ్యంగా ఉంటుంది. అంతేగాక ఆఫ్‌లైన్‌లో టిక్కెట్లు పొందిన భక్తులు తిరుమలలోనే స్థానిక ఆలయాలు, తీర్థాలు, పుణ్యక్షేత్రాలను సందర్శించే వీలుకూడా ఉంది. గదులకోసం తంటాలు తప్పుతాయి. మరీ ఎవరైనా భక్తులు సెంటిమెంట్‌గా భావిస్తే యాత్రికుల వసతి సముదాయాల్లో విశ్రాంతి తీసుకోవడం చేయవచ్చు. ఇవన్నీ పరిగణనలోనికి తీసుకుంటున్న టిటిడి అధికారులు ఆఫ్‌లైన్‌లోనే శ్రీవాణి బ్రేక్ దర్శన టిక్కెట్లు కొనసాగించడం మంచిదని అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ టిక్కెట్లు జారీ కౌంటర్ల వద్ద పూర్తి పారదర్శకంగా డిజిటల్ డిస్‌ప్లే చేస్తూ ఎన్ని టిక్కెట్లు లభ్యత వున్నాయనే సమాచారం తెలియజేస్తున్నారు. సోమవారం భక్తుల రద్దీ ఓ మాదిరిగా కొనసాగడంతో మధ్యాహ్నం 1గంటకు 80వరకు శ్రీవాణి బ్రేక్ టిక్కెట్లు ఉన్నాయి. గంటసమయంలో ఆ టిక్కెట్లను భక్తులు బుక్‌చేసుకుని సాయంత్రం దర్శనానికి వెళ్ళడం విశేషం. ప్రతిరోజూ 1,500 టిక్కెట్లు జారీఅవుతున్న శ్రీవాణి మరో 500వరకు పెంచాలని భక్తుల నుండి వస్తున్న విజ్ఞప్తి. మరీ దీనిపై టిటిడి అధికారులు సమగ్రంగా సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. మరీ టిక్కెట్లు 300వరకు పెంచాలనే యోచనతో కార్యాచరణ రూపొందిస్తున్నారనేది సమాచారం. అయితే 10,500 రూపాయలు చెల్లించి దర్శన టిక్కెట్ పోందుతున్న భక్తులకు వసతి సదుపాయం విషయంలో కూడా కుదరదనే అంశంపై భక్తులకు అవగాహన కల్పించాలని ఆలోచన చేస్తున్నారు. మరీ వారంరోజుల్లో ఈ అంశాలపై టిటిడి అధికారులు ఒకస్పష్టతకు రానున్నారు.

## తిరుమల సమాచారం

### వరాహస్వామికి ఏకాంత అభిషేకం




**తిరుమల,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** ఆదివరాహక్షేత్రం కలియుగవైకుంఠం తిరుమలలో సోమవారం ఉదయం భూవరాహస్వామికి ఏకాంత అభిషేకం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వరాహస్వామి జయంతి సందర్భంగా ఉదయం ఆలయ అర్చకులు కలశస్థాపన, కలశపూజ, పుణ్యాహవచనం చేపట్టారు. అనంతరం వేదోక్తంగా పాలు,పెరుగు,తేనె,చందనం, పసుపు, కొబ్బరిజలం వివిధ రకాల పండ్లతో తయారుచేసిన పంచామృతంతో మూలవర్లకు ఏకాంత అభిషేకం నిర్వహించారు. కాగా తిరుమలలో ఆగమశాస్త్రం ప్రకారం వరాహస్వామికి తొలిపైజ, తొలినైవేద్యం , తొలి దర్శనం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ అర్చకులు, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి పాల్గొన్నారు.

### రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నాం: మంత్రి నారాయణ



**తిరుమల,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** గత ఐదేళ్ళ ప్రభుత్వంలో రాష్ట్రం అస్తవ్యస్తంగా తయారైందని, ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం మెల్లగా అన్నీ సరిదిద్దుకుంటే రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నామని రాష్ట్రమంత్రి డాక్టర్ పి.నారాయణ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదప్రజలు ఆర్థికంగా ముందుకు వెళ్ళేలా పి4 పథకం అమలుచేయడం అన్ని వర్గాల నుండి ఆనందం వ్యక్తమవుతోందన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతున్నామని, మరిన్ని సంక్షేమ పథకాలు అమలుచేసే శక్తిని చంద్రబాబునాయుడుకు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ప్రసాదించాలని వేడుకున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి విజన్ దూరదృష్టితో కూడుకుందన్నారు. ఆయన దిశానిర్దేశం రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా అభివృద్ధిచెందేందుకు దోహదపడుతుందన్నారు. సోమవారం ఉదయం కుటుంబం,అనుచరులతో కలసి తిరుమలకు వచ్చిన మంత్రి నారాయణ విఐపి బ్రేక్ ప్రారంభసమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు,ఓఎస్‌డి సత్రానాయక్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. తొలుత ధ్వజస్తంభానికి మొక్కిన మంత్రి ఆనందనిలయంలోని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆశీస్సు లందుకున్నారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### అందరిపై శ్రీవారి ఆశీస్సులుండాలి: ప్రముఖులు



**తిరుమల,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, అంతా మంచి జరగాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. సోమవారం ఉదయం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథశర్మ, ఎంపిలు రఘునందన్‌రావు,మాగుంట శ్రీనివాస్ వేర్వేరుగా శ్రీవారి ఆలయంలోపలకు చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి గోవిందుడి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### సైనికశక్తి, దేశభద్రత మరింత శక్తిమంతంగా ఉండాలి:కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**తిరుమల,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశ సైనికులు దేశభద్రతలో పట్టుదలతో, అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని కేంద్రమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి తెలిపారు. సైనికశక్తి, దేశభద్రత మరింత శక్తివంతంగా ఉండాలని భగవంతుడ్ని ప్రార్థించినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా మంచి వర్షాలు కురిశాయని, రైతులు ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేంకటేశ్వర స్వామిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం వేకువజామున కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కుటుంబంతో కలసి శ్రీవారి సుప్రభాతసేవలో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దేవదేవుడి దర్శనం చేయించి ఆశీస్సులందజేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## రేపు జగన్ తిరుమల పర్యటన లేదన్న వైఎస్సార్సీ



**తిరుమల,ఆగస్టు 25ప్రభాత వార్త ప్రతినిధి:** మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం(రేపు) తిరుమలకు వస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో ఆయన పర్యటనపై టిటిడి వర్గాల్లో చర్చ మొదలైంది. ఆయన ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి రేపు వస్తున్నట్లు, ఆయన అన్యమతస్థుడు కావడంతో హిందూమతంపై విశ్వాసం ఉన్నట్లు డిక్లరేషన్ ఇవ్వాలని, అలా సంతకం చేయకుంటే దర్శనానికి అనుమతిస్తారా?అనే పుకార్లు షికారుచేశాయి. గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ళు శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలోతిరుమలకు వచ్చి పట్టువస్త్రాలు సమర్పించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వైఎస్ జగన్ వైసిపి నేతగా,పులివెందుల ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన తిరుమల పర్యటన ఉందనే సామాజిక మాధ్యం వార్తతో టిటిడిలో గుబులురేగింది. ఈ సున్నిత మైన విషయంపై ఎలా వ్యవహరించాలనే అంశం పెద్ద దుమారం రేపింది. అయితే చివరకు సోమవారం సాయంత్రం వైసిపి ఉమ్మడి చిత్తూరుజిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి తిరుమలకు జగన్ పర్యటన లేదని స్పష్టత నివ్వడంతో నెలకొన్న సందిగ్ధత వీడిపోయింది. 27న తిరుమలకు జగన్ రావడం లేదని, అసలు ఆయన పర్యటన లేదని చెప్పారు. అంతేగాక సిఎంగా జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కూడా హిందు ధర్మపరిరక్షణ జరిగిందని, శ్రీనివాస దివ్యఅనుగ్రహ హోమం ప్రారంభించామని కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

## ఒక్క క్లిక్.. వేయి భావాల లాజిక్

### - పాత్రికేయరంగంలో ఫొటో జర్నలిస్టుల పాత్ర కీలకం

### - ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**.విజయవాడ,ఆగస్టు25,ప్రభాతవార్తప్రతినిధి:** ఫొటోగ్రాఫర్ ఒక్క క్లిక్‌తో కెమెరాలో బంధించే ఛాయాచిత్రం వేయి భావాల లాజిక్ అని.. ఫొటోలు ఎన్నో మధురానుభూతులకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయని, ఫొటో లేని వార్తా పత్రిక వెలుగు లేని దివిటీ లాంటిదని, ఛాయాచిత్రం చూడటంతోనే సగం వార్తా సారాంశం పాఠకులకు అర్థమయిపోతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విశ్రాంత ఐఏఎస్ అధికారి డి. చక్రపాణి అన్నారు.

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానోత్సవాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విశ్రాంత ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి.. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహంతో కలిసి తొలుత కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఔత్సాహిక ఫొటోగ్రాఫర్ పి.ప్రసాద్ సేకరించిన పురాతన అరుదైన కెమెరాలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ మధురానుభూతులను ఫొటోల రూపంలో భావితరాలకు అందించేందుకు వీలుంటుందని.. ఫొటోలు అనేవి తరతరాలకు విజ్ఞాన వారధులని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఏది చేసినా వినూత్నంగా చేయాలని ప్రోత్సహిస్తుంటారని, విలువైన వనరుల సృష్టి జరగాలని ఆకాంక్షిస్తారని.. ఫొటోగ్రఫీ పోటీల నిర్వహణ ద్వారా ఫొటోగ్రాఫర్లను ప్రోత్సహించి.. కొత్త ఉత్తేజంతో వారు ముందడుగు వేసేలా దోహదపడతాయన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఆర్థిక రంగానికి దాదాపు 67 శాతం సేవా రంగం ద్వారా లభిస్తోందని.. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా సేవా రంగం మరింత పురోగతి సాధించేందుకు వీలుంటుందన్నారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి సమష్టి కృషి అవసరమని.. ఛాయాచిత్రాల విజ్ఞాన సారథులు అయిన ఫొటోగ్రాఫర్లు కూడా ఇందులో భాగస్వాములు కావాలన్నారు. ఈ పోటీలు ఆరంభం మాత్రమేనని.. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ అన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి మాట్లాడుతూ.... ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు, ఫొటోగ్రాఫర్లను ప్రోత్సహించేందుకు వివిధ రకాల ఇతివృత్తాలతో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని.. విజేతలకు హృదయ పూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నో సవాళ్లు ఉన్నా వాటిని ఎదుర్కొంటూ ఫొటోగ్రాఫర్లు విజయవంతంగా ముందుకెళ్తున్నారని..

వృత్తి జీవితానికి వన్నె తెస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణిలు ఫొటోగ్రఫీ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేసి సత్కరించారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, స్వచ్ఛాంధ్ర/స్వచ్ఛ ఎన్టీఆర్, యోగాంధ్ర, తల్లికి వందనం/విద్య, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం 2, న్యూస్ ఫొటోలకు సంబంధించి మూడు విభాగాల్లో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించగా విజేతలకు ప్రతి విభాగంలో ప్రథమ (రూ. 10 వేలు), ద్వితీయ (రూ. 7,000), తృతీయ (రూ. 4 వేలు) బహుమతులతో పాటు రూ. 2 వేలు చొప్పున ఆరుగురికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. మెమెంటోలు, శాలువాలతో సత్కరించారు.

## ఏడాదిన్నర బాలుడిపై పైశాచికంగా దాడి!

### తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలైన బాలుడు


బాలుడి తల్లిదండ్రులు

**పలమనేరు టౌన్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** అభం శుభం తెలియని ఏడాదిన్నర బాలుడిపై పైశాచికంగా దాడి జరిగింది. ఈ దాడి ఎవరు చేశారన్న విషయం తెలియడం లేదు. శరీరంపై కాల్చిన గాయాలు, మర్మావయంపై కొరికిన గాట్లు ఉన్నాయి. ఈ నెల 24న సాయంత్రం జరిగిన ఈ సంఘటన హృదయ విదారకంగా వుంది. అపస్మారక స్థితిలో బాలుడు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇది తల్లిదండ్రుల పనేనా లేక ఇతరులు ఎవరైనా ఈ దారుణానికి పాల్పడ్డారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చిత్తూరు జిల్లా గంగవరం మండలం పత్తికొండ వద్ద ఓ కోళ్ళఫామ్‌లో చత్తీస్‌ఘడ్‌కు చెందిన ఓ జంట పనిచేస్తున్నారు. వీరికి ఏడాదిన్నర బాలుడు ఉన్నాడు. ఈ నేపథ్యంలో బాలుడు ఈ నెల 24న హటాత్తుగా భోరున ఏడుస్తూ అరవడంతో తల్లిదండ్రులు వెంటనే పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వచ్చారు. ఆసుపత్రిలో వైద్యులు విషయం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాలుడు అపస్మారక స్థితిలో కోమాలో వుండడంతో ఐసియులో వుంచి చికిత్స చేస్తున్నారు. డా.మరియమ్మ మాట్లాడుతూ ఇది సాధారణంగా వచ్చిన వ్యాధి కాదని బాబును ఎవరో విచక్షణా రహితంగా కొట్టారని, దీంతో బాలుడు తీవ్ర గాయాల పాలయ్యాడని తెలిపారు. తల్లిదండ్రులను విచారిస్తే తాము పనుల్లోకి వెళ్ళడానికి తెలిసిన వ్యక్తి దగ్గర వదిలి వెళ్ళామని చెపుతున్నారని వివరించారు. రక్త పరీక్షలు చేశామని రక్తం తక్కువగా వుందని తెలిపారు. విషయం తెలుసుకున్న హ్యూమన్‌రైట్స్ అండ్ క్రైమ్ కంట్రోల్ మాదేశ్ బృందం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తల్లిదండ్రులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## అలిపిరి వద్ద భూమిపై భూమన ఆరోపణలు దారుణం: టిటిడి

**తిరుమల,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల పవిత్రతను కాపాడాలనే ఉద్దేశ్యంతో 2021 నవంబర్‌లో అలిపిరి సమీపంలోని దేవుని పాదాలచెంత 20 ఎకరాల స్థలాన్ని ఒబెరాయ్ హోటల్‌కు కేటాయింపులు చేసిన దాన్ని తిరిగి వెనక్కుతీసుకోవడం జరిగిందని టిటిడి పేర్కొంది. ఆ భూమికి బదులు దక్షిణంవైపు పర్యాటకశాఖకు స్థలాన్ని టిటిడి కేటాయిస్తూ మేనెలలో జరిగిన టిటిడి బోర్డు సమావేశంలో తీర్మానించింది. అయితే దీనిపై వైసిపి నేత, టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలు సబబుకాదని, భక్తుల మనోభావాలతో ముడిపడిన అంశం కావున ఆయన వ్యాఖ్యలను టిటిడి ఖండించింది. అలిపిరి-చెర్లోపల్లిరోడ్డులో దక్షిణంవైపు ఇప్పటికే పలు నిర్మాణాలు జరిగిన విషయం విదితమే.దక్షిణంవైపు భూమిని పర్యాటకశాఖకు కేటాయించి తిరుమల కొండను ఆనుకుని ఉత్తరంవైపుగా ఉన్న పవిత్రమైన భూమిని టిటిడి తీసుకోవడం జరిగిందన్నారు.

## రేపటి నుండి కాణిపాకం బ్రహ్మోత్సవాలు



**కాణిపాకం, ఆగస్టు 25 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో రేపటి నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా ఆలయంలో 21 రోజుల పాటు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతుంటాయి. ఇందులో భాగంగా ఈనెల 27న వినాయకచవితి, 28న ధ్వజారోహణం, హంసవాహనసేవతో ప్రారంభమయ్యే నవరాత్రి ఉత్సవాలు సెప్టెంబర్ 5న జరిగే ధ్వజావరోహణం కార్యక్రమంతో ముగుస్తాయి. అలాగే 6న అధికార నంది వాహనంతో ప్రారంభమయ్యే ప్రత్యేక ఉత్సవాలు 16న జరిగే తెప్పోత్సవంతో ముగియనుంది. ఈమేరకు ఆగస్టు 27న వినాయక చవితి, 28న ధ్వజారోహణం,హంసవాహనసేవ, 29న బంగారు నెమలివాహన సేవ, 30న మూషికవాహన సేవ,

31న బంగారు చిన్నశేషవాహనం, బంగారు పెద్ద శేషవాహనసేవ, సెప్టెంబర్ 1న చిలుక వాహనం (పగలు), వృషభవాహనసేవ (రాత్రి), 2న గజవాహన(ఏనుగు)సేవ, 3న రథోత్సవం, 4న బిక్షాండి, తిరుకళ్యాణం, అశ్వవాహన సేవ, 5న ధ్వజావరోహణం, వడాయత్తుఉత్సవం,
ఏకాంతసేవ జరుగనుంది. అదేవిధంగా ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా 6న అధికార నందివాహనసేవ, 7న రావణ బ్రహ్మ వాహనసేవ, 8న యాళివాహనసేవ, 9న సూర్యప్రభ వాహనసేవ, 10న చంద్రప్రభ వాహనసేవ, 11న కల్పవృక్ష వాహనసేవ, 12న విమానోత్సవం, 13న పుష్పపల్లకిసేవ, 14న కామధేనువాహనం,15న పూలంగిసేవ, 16న తెప్పోత్సవం జరుగనుంది.

## సెప్టెంబర్ 15కల్లా దసరా ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి


దాతలకు దుర్గమ్మ వారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 25, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల ఏర్పాట్లు సెప్టెంబర్ 15కల్లా పూర్తి చేయాలని ఇఒ వికె శీనా నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించి పనుల వివరాల పురోగతిని తెలుసుకున్నారు. కమీషనర్ ఆదేశాల మేరకు నూతన లడ్డూపోటులో లడ్డూ తయారీ చేయాలన్నారు. నూతన అన్నదాన భవనంలో అన్నదానం జరగాలన్నారు. దసరా ప్రత్యేక పూజలు కుంకుమార్చన, దేవిఖడ్గమాల, శ్రీచక్రనవణార్చన లు మహామండపం 6వ అంతస్థులో జరుగుతాయన్నారు. చండీహోమం యాగశాలలో జరుగుతాయన్నారు. అన్ని పూజల టికెట్లు ఆన్‌లైన్లో కొనుగోలు చేయాలన్నారు. టికెట్లు అందుబాటులో వుంచే వివరాలు త్వరలో తెలుపుతామన్నారు. భక్తులకు ఉదయం 6 నుండి 10.30 వరకు పులిహోర, కట్టుపొంగలి, కదంబం, దద్దోజనం అందిస్తామని, ఉదయం 10.30 నుండి సాయంత్రం 4 వరకు భోజనం, సాయంత్రం 4. నుండి రాత్రి 9.30 వరకు పులిహోర, కదంబం కొండ దిగువన అందించాలని, మూలానక్షత్రం రోజున విజయదశమి రోజున చిన్న లడ్డూ ఉచితంగా అందిస్తామన్నారు. సమీక్ష సమావేశంలో అసిస్టెంట్ కమీషనర్ రంగారావు, ఇఇ లు కోటేశ్వరరావు, రాంబాబు, ఏఇఒ చంద్రశేఖర్, సుధారాణి, గంగాధర్, రమేష్‌బాబు, శ్రీనివాస్, తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. దుర్గమ్మ వారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన యు లక్ష్మిపార్వతి రు.1,00,101ల విరాళాన్ని సోమవారం తమ భర్త వెంకటేశ్వరరావు పేరిట నిత్యాన్నదాన పథకానికి అందించారు. విజయవాడకు చెందిన ఎస్ కృష్ణ, అనంతలక్ష్మి దంపతులు రు.1లక్ష విరాళాన్ని కనకదుర్గ డెవలెప్‌మెంట్ ట్రస్టుకు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. శ్రీ కనకదుర్గానగర్ నుండి మహామండపం వరకు బిటి రోడ్ పనులు సోమవారం ప్రారంభమైన సందర్భంగా వాహనాలకు ప్రవేశం లేదని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. వాహనదారులు ఘాట్‌రోడ్డు మార్గంలో కొండపైకి చేరుకోవాలన్నారు. దుర్గమ్మ వారిని దర్శించుకునే భక్తులు ఫోన్లను మొబైల్ కౌంటర్లలో భద్రపరుచుకోవాలన్నారు.

## ర్యాపిడోతో మహిళలు డ్రైవర్లుగా ఉపాధి పొందడం సంతోషం : మంత్రి లోకేష్



**విజయవాడ,ఆగస్టు25,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ రవాణా సేవల సంస్థ ర్యాపిడోతో కుదిరిన భాగస్వామ్యం ద్వారా వెయ్యిమందికి పైగా మహిళలు డ్రైవర్లుగా ఉండి ఉపాధి పొందడం పట్ల ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు. మహిళలు ర్యాపిడో వాహనాలు నడుపుతున్న వీడియోను సోమవారం తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. మహిళలు ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రాయితీలు కల్పిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రవాణా ప్రణాళిక అంటే కేవలం ఓ చోటు నుంచి మరో చోటుకు ప్రయాణించడం మాత్రమే కాదని, అది మహిళలకు లభించే అవకాశం, గౌరవం అని లోకేష్ అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా తమది కచ్చితంగా మంచి ప్రభుత్వమని రుజువు చేసుకుంటున్నామని వివరించారు. రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం గొప్ప విజయం సాధించిందని, అదే స్ఫూర్తితో మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. మహిళలకు రవాణా సౌకర్యాలు మెరుగుపరచడంతోపాటు, ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తున్నామని మంత్రి లోకేష్ తెలిపారు.

## నేడు సీమ మీదుగా బెంగళూరు-బీదర్ మధ్య ప్రత్యేక రైలు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 25,ప్రభాతవార్త** ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాయలసీమ జిల్లాల మీదుగా బెంగళూరు-బీదర్-బెంగళూరుల మధ్య ఈ నెల 26,27వ తేదీల్లో మంగళ,బుధవారాల్లో ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.

బెంగళూరు నుంచి బీదర్ వెళ్లే నెంబర్ 06549ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు బెంగళూరు నుండి మంగళవారం రాత్రి 9.15గంటలకు బయలుదేరి, బుధవారం ఉదయం 11.30గంటలకు బీదర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బీదర్ నుంచి బెంగళూరు వెళ్లే నెంబర్ 06550 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం మధ్యాహ్నం 14.30గంటలకు బీదరు నుంచి బయలుదేరి గురువారం తెల్లవారుజామున 4గంటలకు బెంగళూరు చేరుకుంటుంది.

ఈరైళ్ల మార్గమధ్యలో యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని,

మంత్రాలయం, రాయచూర్ క్రిష్ణా, యాద్గీర్, వాడి, షాహ్‌బాద్, గుల్బర్గా, హోమ్నాబాద్ స్టేషన్లలో నిలుస్తాయి.

వార్త

సజ్జనుడి జీవితం ఎలా ఉత్తమమవుతుందీ అంటే ప్రేమతో, దయాగుణంతో అతను చేసే చిన్నచిన్న పనుల వల్లనే.

- గ్లిబ్బర్

# పాశవిక ప్రవృత్తికి ఏవీ పగ్గాలు?

భారతదేశమంటే సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లుగా పదేపదే ఎంతో గొప్పగా చెప్పుకుంటాం. కానీ సమాజంలో పూజ్యనీయులైన మహిళల మాన,ప్రాణ విషయంలో చెప్పుకోదగిన గౌరవ మర్యాదలతో ప్రవర్తించలేకపోతున్నాం. చట్టసభల్లో మహిళా బిల్లు ఏనాడో అటకెక్కించారు. రానురాను మహిళల రక్షణ విషయంలో విఫలమవుతున్నారేమోననిపిస్తున్నది. జరిగిన, జరుగుతున్న సంఘటనలు దీనికి బలం చేకూరుస్తున్నాయి. చట్టం తన పని తాను చేసుకుపోతుందని పాలకులు ఎంతగా చెప్తున్నారో అంతకు రెట్టింపు స్థాయిలో మహిళలపై నేరాలు పెరిగిపోతున్నాయి. వాస్తవంగా చదువు,సంధ్యలు పెరిగే కొద్దీ, విజ్ఞానం ఆర్జించే కొద్దీ మనుషుల ప్రవర్తనలో మార్పు రావాలి. సంస్కారం, సభ్యత మరింత పెరగాలి. మంచి ఏదో చెడు ఏదో గ్రహించే విచక్షణాజ్ఞానం పెంపొందాలి. దురదృష్టవశాత్తు అందుకు విరుద్ధంగా తిరోగమిస్తున్నామేమోననిపిస్తున్నది. మహిళలపై పెరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, వేధింపుల సంఘటనలు ఆవేదనే కాదే ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రేమించి పెళ్లి చేసుకున్న కిరాతకుడే భార్య గర్భవతి అని తెలిసినా అత్యంత దారుణంగా హతమార్చిన సంఘటన తెలంగాణ రాజధాని హైదరాబాద్ శివారులో చోటుచేసుకున్నది. పుట్టబోయే బిడ్డ గురించి కలలకంటున్న ఆమెను అనుమానంతో రాక్షసుడిగా మారి గొంతుకోసి అంత్యంత కిరాతకంగా చంపాడు. అంతేకాదు మృతదేహాన్ని అదృశ్యం చేసేందుకు అమానవీయంగా వ్యవహరించాడు. రంపంతో కాళ్లు, చేతులు, తల వేరు చేసి మూటకట్టి విడివిడిగా మూసీనదిలో పారవేశాడు. మిగిలిన శరీర భాగాన్ని తరలించే ప్రయత్నం చేస్తూ మరొకపక్క భార్య అదృశ్యమైందని కట్టుకథ అల్లి చివరిదశలో పోలీసులకు దొరికిపోయాడు. ప్రేమించి పెళ్లిచేసుకున్న నెల తర్వాత నుంచే ఆమెకు వేధింపులు ఆరంభమయ్యాయి. భరించలేని ఆ యువతి వికారాబాద మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అనుగుణంగా కేసు నమోదు అయింది. ఆ తర్వాత గ్రామంలో పెద్ద సమక్షంలో మూడు, నాలుగు సార్లు పంచాయతీ కూడా జరిగింది. భార్యపై అనుమానం పెరగడంతో ఉద్యోగం కూడా మాన్పించాడు. వైద్యపరీక్షలు పూర్తి అయిన తర్వాత తాను వెళ్లి తల్లిగారి ఇంటివద్దనే ఉంటానని చెప్పినా అంగీకరించకపోవడంతో వాదులాట జరిగి అంతం చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. మొన్న శనివారం భార్య మీద దాడి చేసి గొంతు కోసి ఈ కిరాతకానికి ఒడిగట్టాడు. ఇక దేశ రాజధాని ఢిల్లీ సమీపంలో నోయిడా ప్రాంతంలో అదనపు కట్నంకోసం మరొక కిరాతకుడు జుట్టుపట్టుకొని ఈడ్చుకెళ్లి తల్లిదండ్రులతో కలిసి రసాయనికాలు చల్లి నిప్పంటించి చంపిన దారుణ సంఘటన చోటుచేసుకున్నది. ఆయన డిమాండ్ మేరకు మృతురాలి తల్లిదండ్రులు ఒక ఖరీదైన కారుతోపాటు మోటారుసైకిల్, మరి కొంత నగదు, బంగారం పెద్దఎత్తునే ముట్టచెప్పారు. అయినా తాను కుటుంబం కోసం కొన్న మెర్సిడిస్‌బెంజ్ కారు కొనివ్వాలని,మరో ముప్పైఆరు లక్షల అదనపుకట్నం ఇవ్వాలని కొంతకాలంగా ఒత్తిడి చేస్తున్నట్లు మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తాము ఇవ్వకపోవడంతో తమ కుమార్తెపై శనివారం ఆయన కుటుంబ సభ్యులతో సహా అందరూ కలిసి దాడిచేసి రసాయనికం చల్లి నిప్పంటించారు. డెబ్భైశాతం గాయాలతో ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. ఆరేళ్ల కుమారుడు కూడా తనముందే తన తండ్రి అమ్మను కొట్టి ఆమెపై రసాయనం పోసి సీజర్‌లైట్‌తో నిప్పంటించాడని చెప్పడం అందరిని కలచివేసింది. పోలీసులు అరెస్టు చేసిన తర్వాత ఆయనను సంఘటనాస్థలానికి తీసుకువెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తుండగా ఇన్స్‌పెక్టర్ పిస్తోల్ లాక్కొని పారిపోయే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో పోలీసులు జరిపే కాల్పుల్లో నిందితుడికి కాలికి గాయాలు కావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. ఇక భద్రాది కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట పట్టణంలో మరొక దారుణం చోటుచేసుకున్నది. తమ అల్లుడు ఫోన్ చేసి మెట్ల మీద నుంచి తన భార్యపడిపోయిందని ఆస్పత్రిలో చేర్పించామని చెప్పడంతో పరుగున వెళ్లారు. తీరా అక్కడికి వెళ్లేసరికి అక్కడ ఒక ఎముకల గూడుగా మారి విగత జీవిగా పడిఉన్న తమ కుమార్తెను చూసి హతాశులయ్యారు. అల్లుడే తమ బిడ్డను తిండిపెట్టకుండా హింసించి హత్య చేశాడని పోలీసులకు ఫిర్యాదుచేశాడు. గత రెండున్నర సంవత్సరాలుగా తమకుమార్తెతో మాట్లాడే అవకాశం లేకుండా అదనపు కట్నం కోసం ఆమెను వేధించాడని వారు వాపోతున్నారు. అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మరొక రాక్షసుడు భార్యను కత్తితో హత్య చేసి ఆ తర్వాత పెట్రోలు పోసి తగలబెట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వరంగల్‌జిల్లాలో మరొక యువతి భర్త ఘాతుకానికి బలైపోయింది. తన భార్యకు ఆరోగ్యం బాగాలేదని భర్త చెప్పడంతో ఇరుగుపొరుగువారు 108కి ఫోన్‌చేయగా వారువచ్చి ఆ యువతి చనిపోయిందని నిర్ధారించారు. కేవలం వరకట్నం కోసం తమ కుమార్తెను మట్టుబెట్టాడని ఫిర్యాదు చేశారు. ఆమెకు ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఎందరో యువతులు నిత్యం బలైపోతూనే ఉన్నారు. ఇంకెందరో బయటకు చెప్పుకోలేక,అటు పోలీసుస్టేషన్ గడప ఎక్కలేక తమలో తాముక్రుంగిపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు అన్నీఇన్నీకావు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర పాలకులు చట్టాలు చేసిచేతులు దులుపుకుంటే సరిపోదు. ఆచరణలో త్రికరణశుద్ధిగా ప్రయత్నంచేయాలి. అప్పుడే ఈ పశుప్రవృత్తికి కొంతవరకైనా పగ్గాలు వేయగలుగుతాం.

సంపద ఉప్పునీరు లాంటిది. ఎంత తాగితే అంత దప్పిక పెరుగుతుంది.



గోల్డ్‌స్మిత్

ఏప్పుడైతే బాధ్యత మొత్తం మన భుజస్కంధాలపై మోపబడుతుందో అప్పుడు మనం అత్యుత్తమంగా, అత్యున్నతంగా పనిచేస్తాం.



స్వామి వివేకానంద

# ప్రజావాక్కు



## సొంత కెప్టివ్‌మైన్లు అవసరం

దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వరంగ సంస్థలు కీలక పాత్ర పోషించాయి. అలాంటి ప్రతిష్టాత్మక సంస్థల్లోవిశాఖ ఉక్కు కర్మాగారం ఒకటి. ఇది కేవలం ఉక్కు తయారీ కేంద్రం కాదు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అన్న నినాదం వందలాది కుటుంబాల భవిష్యత్తును ప్రతిబింబిస్తోంది. 1971లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు, ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని 1982లో ఉత్పత్తి ప్రారంభించింది. అప్పటి నుంచి ఈ కర్మాగారం తూర్పు తీర ఆర్థిక ప్రగతికి వెన్నెముకగా నిలిచింది. అయితే ఇనుము ఖనిజ మైన్ల లేమి, పెరిగిన ముడిసరుకు వ్యయాలు, అప్పుభారాలు క్రమంగా సంస్థను బలహీనపరిచాయి. ఇటీవల మళ్లీ ప్రైవేటీ కరణ ప్రతిపాదనలు ముందుకు రావడం ఆందోళన కలిగిస్తోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## బదలీ అయిన వారిని రిలీవ్ చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జూన్ నెలలో బదలీలు చేపట్టింది. కానీ కొంత మంది ఉపాధ్యాయులు 2025 బదలీల్లో బదలీ అయ్యి రిలీవర్ లేక పాత స్థానాల్లోనే పనిచేస్తున్నారు. బదలీ అయ్యి మూడునెలలు పూర్తి అవుతున్నా ఇప్పటికీ పాత స్థానాల్లోనే పనిచేస్తున్నారు. అటువంటి ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి బదలీ పొందిన స్థానాల్లో జాయిన్ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. డిఎస్సీ 2025 ద్వారా నియమింపబడే ఉపాధ్యాయులను, బదలీ అయ్యి రిలీవర్‌లేక పాత స్థానాల్లోనే పనిచేస్తున్న ఉపాధ్యాయుల స్థానాల్లో నియమించాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## ఉత్సవాల నిర్వహణకు చెక్ పెట్టాలి

ఆనాటి ఆ స్వతంత్ర పోరాటంలో భారతీయ భావజాలంతో ప్రజలను ఒకటిచేయడానికిబాలగంగాధర్ తిలక్ గారు వినాయక చవితి ఉత్సవాలను ప్రారంభించారు. కానీ ఈ రోజుల్లో వీధికో వినాయకుడు బయలుదేరాడు. విచిత్ర వేషాలతో కొత్తదనం పేరుతో కోతి చేష్టలు చేస్తున్నారు. నిజంగా ఈ వినాయక చవితి ఉత్సవాల పేరుతో కోట్లాది రూపాయలు వృథా అవుతున్నాయి. ఇకనైనా పాలకులు ఈ ఉత్సవాల నిర్వహణకు చెక్ పెట్టాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## నేరాలకు అడ్డాగా ఓటీటీ ప్లాట్ ఫామ్స్

హైదరాబాద్ కూకట్‌పల్లిలో సంచలనం సృష్టించిన బాలిక హత్య కేసును పరిశీలిస్తే పక్క బిల్డింగ్‌లో నివాసం ఉంటున్న 15 సంవత్సరాల టెన్త్ క్లాస్ స్టూడెంట్ కిల్లర్‌గా గుర్తించారు. చోరీకోసం ఇంట్లోకి ప్రవేశించిన ఆ బాలుడు అడ్డ వచ్చిన బాలికను చంపేసిన తీరు చాలా బాధాకరం కలిగిస్తుంది. ఓటీటీలకు అలవాటు పడిన ఆ బాలుడు క్రైమ్ వెబ్ సీరీస్‌లను చూసి, అందులోని సన్నివేశాలను ప్రేరణగా పొంది చోరీకి ప్రణాళిక వేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఓటిటీ కంటెంట్ ప్రజలకు అవగాహన కల్పించడం కంటే నేరాలను ప్రోత్సహించేందుకు అడ్డాలుగా మారిపోయాయి. ఓటీటీలకు సెన్సార్ షిప్ లేకపోవడంతో ఓటీటీల్లో క్రైమ్ సీన్స్ హద్దు మీరుతున్నాయి. ఇలాంటి నేరస్వభావాలను ప్రోత్సహించే ఓటీటీలు, సోషల్ మీడియా కంటెంట్‌లపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపాలి.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## విశ్వబ్రాహ్మణులను ఆదుకోవాలి

ఏపి విశ్వబ్రాహ్మణ రాష్ట్రకార్పొరేషన్ నియామకాన్ని ప్రస్తావిస్తూ, వేల విశ్వబ్రాహ్మణ కుటుంబాలు పూర్తిగా బంగారు నగల తయారీ, మరమ్మత్తులు కార్పొరేట్ స్థాయిలో ఉన్నందున ఏ ఉపాధి లేక వారి పిల్లల చదువు, పోషణ భారంగా మారి, బజారు షాపుల్లో ప్రైవేట్ వృత్తి చేస్తున్నారు. చదువులకు పెట్టుబడి లేదు. కుటుంబంలో ఆడ పిల్లల వివాహాలు చేయలేక కొంతైనా ఆర్థిక సహకారానికి ఆశపడుతున్నారు. జిల్లా స్థాయిలో కార్పొరేషన్ కుటుంబాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన కల్పించాలి. ఇల్లు లేని వారికి స్థలాలు మంజూరు చేసి రుణ సహాయం చేస్తే మంచిది.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

## పర్యవేక్షణ లోపం.. వసతులు కొరత

పెట్రోల్ బంకుల్లో అధికారుల పర్యవేక్షణ లోపంతో కనీస వసతులు కరవవుతున్నాయి. పెట్రోలు,డీజిల్ లీటర్ ధర పెద్ద పెద్ద అక్షరాల్లో తెలిపే బోర్డులు,ఉచితంగా కల్పించాల్సిన సౌకర్యాలైన గాలి నింపేయంత్రాలు, ప్రథమ చికిత్స పెట్టె, స్వచ్ఛమైన తాగునీరు, ఫిర్యాదులు పెట్టె, ఫైర్ నియంత్రణ యంత్రాలు పలు బంకుల్లో మచ్చుకైనా కనిపించడం లేదు. కొన్నిట్లో నామమాత్రంగా ఉంటున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో నిర్వహణ సరిగా ఉండట్లేదు. విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు బంకులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి.

- చల్లా చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఇసి వైఫల్యం వెనుక మన బాధ్యత లేదా?

**ప్రజాస్వామ్యంలో రాజకీయంగా, పార్టీలకున్న పాత్ర ముఖ్యంగా ఎన్నికల నిర్వహణలో ఏ విధంగా సహకరించాలన్న మూలసూత్రాన్ని విస్మరిస్తున్నారు. 1990 లో శేషన్ ఎన్నికల ప్రధానాధికారిగా ఉన్నప్పుడు కమిషన్‌కు పదునైన పనితీరును, ఎలక్టొరల్ అక్రమాలను ఎదుర్కోటానికి మాన్యువల్‌ను దుమ్ముదులిపి చట్టపరంగా చర్యలు ఎవరినీ లెక్క చేయకుండా చేపట్టడంతో ప్రతిభతో కూడిన బలైన ఎన్నికల కమిషన్‌గా శేషన్‌కమిషన్ ప్రపంచ చరిత్రలోనే మిగిలిపోయింది. ఎన్నికల్లో అభ్యర్థులు పార్టీలు హద్దును అతిక్రమించి ఖర్చు పెట్టున్నప్పుడు తీసుకుంటున్న చర్యలు పేలవంగా ఉన్నాయి. ఎన్నికల పండుగను డబ్బులు సంపాదించే పండుగగా ఓటర్లు భావించేస్థితికి మన నాయకులు తీసుకొని వచ్చారు. ఓటర్లు తమకు ఉన్న విలువ గమనించి బాధ్యతగా నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. రాజకీయ పార్టీలు స్వప్రయోజనాల కోసం కాకుండా ప్రజాస్వామ్య పరిధిలోన్యాయంగాఎన్నికలు జరిగేట్లు చూడాలి. అప్పుడే ఎన్నికల కమిషన్‌ను తప్పుపట్టే హక్కు ఎవరైనా పొందగలరు.**



రావులపాటి సీతారాం రావు

కేవలం ఎలక్షన్ కమిషన్‌ను తప్పు పట్టటానికే దేశంలోని విద్యాధికులు, నిపుణులు, సామాన్యులు ప్రయత్నిస్తున్నారు. నిజానికి ఎలక్షన్ కమిషన్ వల్ల కొన్ని పొరపాట్లు జరిగి ఉండవచ్చు. ఆ విషయాన్ని పక్కన పెట్టి కాసేపు నిజానిజాల మీద దృష్టిసారిస్తే పూర్తి అవగాహన సాధ్యపడుతుంది. రాజకీయ పార్టీలకు మనదేశంలోని రాజ్యాంగ వ్యవస్థల అస్తిత్వం కొంత వరకు కోల్పోవడంలో పాత్ర లేదా? ఆ అవగాహన ఈ ముఖ్యమైన విషయంలో అత్యంత అవసరంగా కనపడుతున్నది! ఎన్నికలలోని లోపాలను పట్టించుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉంది. నిజమే! ఓటింగ్ లిస్టులలో ప్రతి రాష్ట్రంలో ఎన్నో పొరపాట్లు జరుగుతున్నాయి. ఓటర్ల పేర్లలో ఒక్కడి పేరే పలుమార్లు కనపడుతున్నది. అర్హతలేని వారిని ఓటర్లుగా చేరుస్తున్నారు. బినామీ ఓటర్లు కూడా తయారవుతున్నారు. ఒకరి బదులు మరొకరు ఓటు వేస్తున్నారు. ఇన్ని తప్పులతో ఉన్న ఎలక్టొరల్ లిస్టుల వల్ల ప్రజల నమ్మకం సడలుతున్నది. దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థను ఎలక్షన్ వ్యవస్థ మీద క్రమేపీ తగ్గడానికి రాజకీయ పార్టీల పాత్ర కూడా ఉందన్న సత్యాన్ని గమనించి తగిన చర్యలు ప్రభుత్వాలూ, రాజ్యాంగ వ్యవస్థలూ తలపెట్టినప్పుడే ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులు బాగుపడతాయి. చివరకు సుప్రీంకోర్టు బీహార్ రాష్ట్రంలోని ఓటర్ల నమోదులోని అవకతవకలను సమీక్షిస్తూ బీహార్‌లో తీసివేయబడ్డ ఓటర్లను నమోదు చేసుకోవడానికి ఆధార్ కార్డు అయినా ఓటరుగా గుర్తింపు తెలిపే ఏ డాక్యుమెంట్ అయినా ఆన్‌లైన్‌లో గుర్తింపుకు సాక్ష్యంగా ఇస్తే చాలు అని ఆదేశించే పరిస్థితి వచ్చింది. ఎన్నికల అవకతవకలు వెలుగులోకి రావటం ఒక విధంగా మంచిదే! వాటిని సరిచేసుకొని, ఎన్నికల కమిషన్‌కు మరింత పారదర్శకంగా, వివాదరహితంగా ఎన్నికలు నిర్వహించడానికి అవకాశం వచ్చినట్లయింది. రాజకీయ పార్టీలు కూడా తమ స్వపక్ష వాదాలు పక్కనపెట్టి, సరైన ఎన్నికల నిర్వహణకు తోడ్పడవచ్చు. పార్టీరహితమైన ఆలోచనలు సమిష్టిగా చేయగలిగితే ప్రజలకు మేలు చేసినవారు అవుతారు. ఎన్నికలల్లో రాజకీయ నాయకులు మరింతగా తలదూర్చకపోతే, ఓటర్లు తమ బాధ్యతను గుర్తించి నైతిక విలువలతో ఓటు హక్కును వినియోగించుకోగలరు. అప్పుడు అభివృద్ధి పొందుతున్న ప్రజాస్వామ్యం బ్రతకటమే కాకుండా దేశంలో పటిష్టంగా నిలబడుతుంది. రాజకీయాలు సక్రమంగా ఉండకపోతే ఎన్నికలు నవ్వులపాలు అవుతాయి. ప్రజాస్వామ్య విలువలను మట్టిలో కలుపుతాయి. ఎలక్టొరల్ రోల్ అప్పుడప్పుడు సక్రమంగా ఉందా లేదా అని చూసుకోవాల్సిన అవసరం బాధ్యత ఎన్నికల కమిషన్‌కు ఉంటుంది. దానిని స్వప్రయోజనాల కోసం రాజకీయ పార్టీలు తప్పుపట్టడం సమంజసంకాదు. ఓట్లు, ఓటర్లకు సంబంధించిన అంశాలలో రాజకీయ పార్టీలు, ఓటర్లు,సామాన్య ప్రజలు ఈ మధ్యన అప్రమత్తంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. ఖచ్చితంగా నమోదు కాబడిన ఓటర్ల లిస్టు, తప్పులు లేని లిస్టు కావాలని పట్టుబడుతున్నారు. కేరళలో లోకల్‌బాడీ ఎన్నికలలో కూడా జాగ్రత్త వహించటం వెలుగులోకి వచ్చింది.




అదే ఓటర్‌కార్డు మీద డూప్లికేటు ఓటర్ కార్డులు బయట పడటం (ఐ.డికార్డు కూడా ఉండటం) ఎన్నో ఓటర్ కార్డులు ఒకే వ్యక్తి కలిగి ఉండటం బయటపడటంతో అక్కడఓటర్లు, పార్టీ నాయకులు నానా హంగామా చేశారు. ఇంతగా విషయాలు ఇంతకు మునుపు బయటకు రాకపోయినా కొందరు ఓటర్లు న్యాయం కోసం పోరాడారు. కానీ ఇప్పుడు ప్రతి వారిలో అవగాహన పెరగడంతో అధికారుల ముందు, సంబంధిత ఎలక్టొరల్ ఆఫీసర్ల ముందు పట్టుపట్టి ప్రతి విషయాన్ని తప్పిదాన్ని మీడియాలో రాజకీయంగా ప్రచారం చేయడంతో బూత్ కమిటీ వ్యవస్థకు ప్రాధాన్యత పెరిగింది. కేరళలోనే కాదు దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలలోబూత్ కమిటీలు ఏర్పడి ఎన్నికలలో లొసుగులు వేలెత్తి చూపుతూ క్షేత్రస్థాయిలోనే పోరాటాన్ని పెంచారు. ఓటు విలువను ఇనుమడింపచేశారు. గతించిన రోజుల్లో గ్రామాలలో పెత్తందారులు, భూస్వాములు, వెనుకబడిన వర్గాల వారికి తెలియకుండానే వారి ఓట్లను రిగ్గింగ్ చేయటమేకాకుండా ప్రతిసారి, ఏ ఎన్నికలలోనైనా వారు నిలబెట్టిన వారే గెలిచే చక్రం తిప్పేవారు. దానితో వారికి రాజకీయ పార్టీలలో కూడా ప్రాధాన్యత పెరిగి, వారిని ఏదో విధంగా లోబర్చుకుంటే చాలు తమ అభ్యర్థులను గెలిపించుకోవచ్చు అన్న నమ్మకం పెరగడంతో చాలా చోట్ల సామాన్య ఓటర్‌కు తెలియకుండానే వారి ఓట్లు బాలెట్ బాక్స్‌లలో పడేవి. నిజాయితీగా ఎన్నికలు జరుగకపోయే ఆ రోజులు పోయాయి. నిజానికి ఎన్నికల కమిషన్ మాన్యువల్‌లో ఇలాంటి అక్రమ పద్ధతులు నివారించడానికి ఎన్నో మార్గదర్శక సూత్రాలు పొందుపర్చారు. ఉదాహరణకు హెచ్చుసంఖ్యలో ఒకే ఇంటి నుంచి ఓట్ల నమోదు కోసం ఎన్నో దరఖాస్తులు ఇవ్వడం నిషిద్ధంఅయితే ఒకే కుటుంబంలో నిజంగా ఎక్కువ సంఖ్యలో దరఖాస్తుదారులు, సభ్యులుగా ఉంటే ఎంక్వైరీ చేసి అనుమతించవచ్చు. బూత్ లెవల్ ఏజెంట్ల పాత్రను గురించి ప్రస్తావించక తప్పదు. ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టినదే బూత్‌స్థాయిలో ఏజెంట్ల పాత్ర. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లు బూత్‌స్థాయి అధికారులకు సహాయపడొచ్చు. బూత్ లెవల్ ఏజెంట్లుగా గుర్తించబడాలంటే వారు అదే చోట ఎలక్టొరల్ లిస్టులో ఓటర్‌గా నమోదు కాబడి ఉండటం తప్పనిసరి. వాళ్ల ముఖ్య కార్యక్రమం కొత్త ఓటర్లను నమోదు చేసుకోవాలన్నా, చెల్లుబాటులో లేని ఓటర్లను తొలగించాలన్నా డ్రాఫ్ట్ రోల్స్‌ను పరిశీలించే అవకాశం వారికిఉంది. తప్పులు సరిదిద్దే పనితోపాటు ఏ లోపాన్నైనా సవరించే బూత్ లెవల్ ఆఫీసర్‌కు సహాయపడవచ్చు. ఎలక్షన్ కమిషన్ అందుకనే రివిజన్ దశలో బూత్ కమిటీలు ఏంచేస్తున్నట్లు అన్న సహేతుకమైన ప్రశ్నను, తప్పులను ప్రశ్నిస్తున్న రాజకీయ పార్టీల ముందు లేవనెత్తింది. ఏది ఏమైతేనేం కేవలం ఎన్నికల కమిషన్ మీదనే భారంఅంతా వేసి వాతావరణం ఎన్నికల్లోఅనుకూలంగా లేకపోతే రాజకీయ పార్టీలు ఏదో లొసుగులను వెలికితీసి కమిషన్‌ను తప్పుపట్టడం అలవాటు చేసుకుంటున్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయంగా, పార్టీలకున్న పాత్ర ముఖ్యంగా ఎన్నికల నిర్వహణలో ఏ విధంగా సహకరించాలన్న మూలసూత్రాన్ని విస్మరిస్తున్నారు. 1990 లో శేషన్ ఎన్నికల ప్రధానాధికారిగా ఉన్నప్పుడు కమిషన్‌కు పదునైన పనితీరును, ఎలక్టొరల్ అక్రమాలను ఎదుర్కోటానికి మాన్యువల్‌ను దుమ్ముదులిపి చట్టపరంగా చర్యలు ఎవరినీ లెక్క చేయకుండా చేపట్టడంతో ప్రతిభతోకూడిన బలమైన ఎన్నికల కమిషన్‌గా శేషన్‌కమిషన్ ప్రపంచ చరిత్రలోనే మిగిలిపోయింది. ఎన్నికల్లో అభ్యర్థులు పార్టీలు హద్దును అతిక్రమించి ఖర్చు పెట్టున్నప్పుడు తీసుకుంటున్న చర్యలు పేలవంగా ఉన్నాయి. ఎన్నికల పండుగను డబ్బులు సంపాదించే పండుగగా ఓటర్లు భావించేస్థితికి మన నాయకులు తీసుకొని వచ్చారు. ఓటర్లు తమకు ఉన్న విలువగమనించి బాధ్యతగా నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. రాజకీయపార్టీలు స్వప్రయోజనాల కోసం కాకుండా ప్రజాస్వామ్య పరిధిలోన్యాయంగాఎన్నికలు జరిగేట్లు చూడాలి. అప్పుడేఎన్నికల కమిషన్‌ను తప్పుపట్టే హక్కు ఎవరైనా పొందగలరు.

# 'బై వన్, గెట్ వన్'లో లాభ నష్టాలెంత!

డి జె మోహన రావు

అత్యుత్తమమైనదిగా కనిపించేది అబద్ధం కావచ్చు. ఒకటి కొంటే ఒకటి ఉచితం అనే నినాదం వెనుకనున్న వాస్తవం ఇదే. ఒక వస్తువు కొనుగోలుపై మరొకటి ఉచితం అని ప్రకటిస్తే మన మనసులో ఏదో ఒక మూల సంతోషం కలుగుతుంది. 'బై వన్ గెట్ వన్ ఫ్రీ' (బోగో) అనే ఈ నినాదం వినియోగదారుల మనస్తత్వంలో ఒక లోతైన ప్రభావాన్ని చూపుతుంది. ఇది ఒక ఆకర్షణీయమైన బహుమతిలా కనిపించినా దాని వెనుక బలమైన వాణిజ్య వ్యూహాలు దాగి ఉంటాయి. నేటి వినియోగదారుడిగా మనం కేవలం ఆకర్షణకు లోనై కాకుండా, దీనిలోని ఆర్థిక గూఢార్థాలను విశ్లేషించడం అవసరం. ఇది కేవలం ఒక ఆఫర్ కాదు. మన ఆర్థిక నిర్ణయాలను ప్రభావితం చేసే ఒక శక్తివంతమైన సాధనం. వ్యాపార సంస్థలకు ఈ ఆఫర్ కేవలం అమ్మకాలను పెంచుకునే సాధనం మాత్రమే కాదుఇది ఒక సమగ్రమైన వాణిజ్య వ్యూహం. ఒక సంస్థ తమ గోడౌన్లలో పేరుకు పోయిన పాత సరుకును త్వరగా ఖాళీ చేయడానికి ఇది ఒక సమర్థవంతమైన మార్గం. అలా చేయడం వల్ల కొత్త సరుకుకు స్థలం దొరకడమే కాకుండా నిల్వ ఖర్చులు కూడా గణనీయంగా తగ్గుతాయి. అంతేకాకుండా ఇది మార్కెట్లోకి కొత్తగా ప్రవేశపెట్టిన ఉత్పత్తులకు ఒక వేదికగా పనిచేస్తుంది. ఈ ఆఫర్ ద్వారా ఒక వస్తువు ధరకే రెండు వస్తువులు వస్తాయి కాబట్టి వినియోగదారులు ఆ కొత్త ఉత్పత్తిని ప్రయత్నించడానికి సుముఖత చూపుతారు. ఈ వ్యూహం సంస్థకు ఒకేసారి రెండు లక్ష్యాలను సాధించే అవకాశాన్ని ఇస్తుంది. పాత నిల్వలను తగ్గించడం, కొత్త ఉత్పత్తికి మార్కెట్‌ను సృష్టించడం. మార్కెట్‌లో పోటీని ఎదుర్కోవడానికి, తమ సంస్థ అత్యుత్తమమైన ఆఫర్లను అందిస్తుందని నిరూపించుకోవడానికి కూడా ఈ వ్యూహం ఉపయోగపడుతుంది. బోగో ఆఫర్‌ను పైపైన చూసినప్పుడు అది పూర్తిగా మనకు లాభదాయకంగా కనిపిస్తుంది.





మనం తరచుగా ఉపయోగించే వస్తువులపై ఈ ఆఫర్ ఉన్నప్పుడు, మన జేబుకు నిజంగానే కొంత ఉపశమనం లభిస్తుంది. కానీ దాని వెనుక ఉన్న కొన్ని సున్నితమైన అంశాలను మనం తప్పకుండా గమనించాలి. అనేక సందర్భాలలో వ్యాపారులు అసలు వస్తువు ధరను కృత్రిమంగా పెంచి ఆ తర్వాత ఈ ఆఫర్‌ను ప్రకటిస్తారు. అంటే, మనం రెండు వస్తువుల ధరను ఒకే వస్తువుపై చెల్లిస్తున్నామని మనకు తెలియకుండానే మోసపోతాం. అంతేకాక, ఈ ఆఫర్‌కు ఆకర్షితులై మనకు అవసరం లేని వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా మన డబ్బును దుబారా చేస్తాం. ఇది మనకు ఆర్థికంగా ఎలాంటి ప్రయోజనం చేకూర్చకపోగా, మన జేబుకు మరింత భారం అవుతుంది. ఈ ఆఫర్లను చూసి అనవసరమైన కొనుగోళ్లు చేయడం వల్ల మనకు ఉపశమనం లభించకపోగా, ఇంట్లో వాడని వస్తువుల నిల్వ పెరుగుతుంది. అమ్మకాల ఒత్తిడికి లోనుకాకుండా తెలివైన కొనుగోలుదారుడిగా ఉండటమే ఈ మాయాజాలం నుండి బయటపడే మార్గం. ఈ ఆఫర్‌ను చూసిన వెంటనే ఉద్వేగపూరితమైన నిర్ణయాలు తీసుకోకుండా ఒక నిశ్శబ్దమైన విశ్లేషణ చేయాలి. ఆ వస్తువు మీకు నిజంగా అవసరమా అని ప్రశ్నించుకోవాలి. అవసరం అనుకుంటే ఒకటి కొంటే ఒకటి ఫ్రీగా వస్తుందంటే సంతోషమే. అవసరం లేకున్నా కొనుగోలు చేయడం అంటే డబ్బులు వృధా. కొంతమంది ముందుకు ఎప్పుడన్నా ఉపయోగపడుతుందిలే అనుకుంటారు. అలాంటి వారు చాలా మంది ఉన్నారు. ఆఫర్‌లో ఉన్న వస్తువు అసలు ధరను ఇతర చోట్ల పరిశీలించాలి. దాని నాణ్యతను గురించి తెలుసుకోవాలి. బైన్ వన్ గెట్ వన్ ఫ్రీ కేవలం 'ఉచితం' అనే పదం కోసం అనవసరమైన వస్తు వులను కొనడం మన ఆర్థిక భవిష్యత్తుపై చేసే ఒక బలహీనమైన దాడి. ఎందుకంటే అత్యుత్తమమైన ఆదా అనేది ఆకర్షణీయమైన ప్రకటనల నుండి రాదు. అది మీ అవగాహనతో కూడిన, తెలివైన కొనుగోలు నిర్ణయాల నుండి మాత్రమే వస్తుంది. కాబట్టి ఇకపై మనం ఇటువంటి ఆఫర్‌ను చూసినప్పుడు కేవలం ఒక ఆఫర్‌గా కాకుండా అది ఒక ఆర్థిక పరీక్షగా భావించి, విజయవంతంగా దాటాలి.

# పంచాయతీలే ప్రగతికి పట్టుకొమ్మలు



డాక్టర్ తిరునహరి శేషు

దేశ ప్రగతికి పంచాయతీలే పట్టుకొమ్మలు గ్రామ స్వరాజ్యమే దేశ సౌభాగ్యంగా భావిస్తాం కాబట్టి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం, గ్రామీణ అభివృద్ధి కోసం బడ్జెట్‌లలో నిధుల కేటాయింపు, ప్రత్యేక కార్యక్రమాలు, పథకాల రూపకల్పనతో పాటు ప్రణాళికలలో కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. తెలంగాణ స్వభావికంగా వ్యవసాయక రాష్ట్రం 61 శాతం జనాభా గ్రామీణ ప్రాంతాలలోనే నివసిస్తుంది కాబట్టి రాష్ట్రం ఏర్పాటు అయిన తరువాత వ్యవసాయం, నీటిపారుదల, గ్రామీణ అభివృద్ధి రంగాలకి బడ్జెట్‌లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించటమే కాదు పల్లె ప్రగతి లాంటి ప్రత్యేక కార్యక్రమాలను కూడా రూపొందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు బడ్జెట్‌లలో గ్రామీణాభివృద్ధి కోసం సగటున 30 వేల కోట్ల రూపాయలను కూడా కేటాయిస్తుంది. దశాబ్దాలుగా గ్రామపంచాయతీల నిధులు, విధుల విషయంలో వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామ పంచాయతీలు స్వయం పోషక ఆర్థిక వ్యవస్థలు కాకపోవటం వలన నిధుల కోసం గ్రామపంచాయతీలు ప్రభుత్వాలు ఇచ్చే నిధులు, గ్రాంట్స్‌పై ఆధారపడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆర్థిక సంఘం కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదల చేసే నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించే నిధులే గ్రామ పంచాయతీలకి ప్రధాన ఆర్థిక వనరులు అయితే ప్రభుత్వాలు సకాలంలో గ్రామపంచాయతీలకి నిధులు విడుదల చేయకపోవటం వలన గ్రామీణ ప్రాంతాలలో పౌర సేవలు అందించడంలో, మౌలిక సదుపాయాలు కల్పించడంలో పంచాయితీ పాలకవర్గాలు వైఫల్యం చెందుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2019లో మొదటిసారి 12,751 గ్రామపంచాయతీలకి ఎన్నికలను నిర్వహించారు కాబట్టి 2020 నుండి ప్రతి సంవత్సరం కేంద్రం నుండి పంచాయతీలకు 1430 కోట్ల రూపాయల నిధులు విడుదలైనాయి. 2020-21 నుండి 2023-24 వరకు 6051 కోట్ల రూపాయల నిధులు పంచాయతీలకు కేంద్రం నుండి అందినాయి. కానీ 2024 ఫిబ్రవరి నుండి ఎన్నికైన గ్రామ పంచాయతీల పాలక వర్గాల కాల పరిమితి ముగిసిపోవటం పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలోకి రావటం రాష్ట్ర ప్రభుత్వం గత 19 నెలలుగా గ్రామ పంచాయతీలకి ఎన్నికలు నిర్వహించకపోవటం వలన 15వ ఆర్థిక సంఘం 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను పంచాయతీలకు రావలసిన 1514 కోట్ల రూపాయలను నిలిపివేసింది. అలాగే 2025 -26 ఆర్థిక సంవత్సరానికి రావలసిన 1477 కోట్ల రూపాయల నిధులను కూడా నిలిపివేసే ప్రమాదం ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయితీ ఎన్నికలను నిర్వహించకపోవటం వలన దరిదాపు 3000 కోట్ల రూపాయల నిధులు కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. ఒకవైపు కేంద్రం నుండి వచ్చే నిధులు రాకపోవటం మరొకవైపు పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవటం వలన ఎన్నికైన ప్రజాప్రతినిధులు లేకపోవడంతో గ్రామ పాలనా వ్యవస్థ పడకేసిందనే చెప్పాలి. గ్రామీణ ప్రాంతాలలో పారిశుద్ధం, వీధి దీపాలు, డ్రైనేజ్ వ్యవస్థ, త్రాగునీరు, రోడ్లు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారుల ఎంపిక, సాధారణ పాలనా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2019లో మొదటిసారి గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించారు. మళ్లీ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు 12,778 గ్రామపంచాయతీలకు సెప్టెంబర్ 30 లోపు రెండోసారి ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించబోతుంది. అయితే అవినీతి రహిత, అంకితభావం, సమర్థవంతమైన వారిని పంచాయతీ ప్రెసిడెంట్‌లుగా ఎన్నుకోవడం ద్వారా గ్రామ పాలనావ్యవస్థని కొత్త పొంతలు తొక్కించవచ్చు. అలాగే గ్రామీణ అభివృద్ధి పట్ల ప్రభుత్వ దృక్పథం, వ్యూహాలు కూడా మారాలి. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ గ్రామీణ అభివృద్ధి సాధనలో ఒక విప్లవాత్మకమైన మార్పుగానే చూడాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రాయోజిత కార్యక్రమాలను సమర్థవంతంగా ఉపయోగించటం, విద్యా, ఆరోగ్యం, పారిశుధ్యం, త్రాగునీరు, రోడ్లు, విద్యుత్, పేదలకి పక్కా ఇళ్ళు లాంటి మౌలిక వసతులను కల్పించటం, వ్యవసాయ ఆధార, అనుబంధ రంగాలు, చేతివృత్తులు, గ్రామీణ చిన్న పరిశ్రమల విస్తరణ ద్వారా ఉపాధి రంగాన్ని విస్తరించటం, ఆధునిక సాంకేతికతతో గ్రామీణ వ్యవస్థని అనుసంధానం చేయటం ద్వారా గ్రామీణ అభివృద్ధిని సాధించే అవకాశాలు ఉంటాయి. గ్రామపంచాయతీలను మహిళలకు రిజర్వ్ చేసిన తర్వాత తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల ప్రగతిలో గుణాత్మకమైన మార్పు కనిపిస్తుంది. ఆళ్లగడప గ్రామపంచాయతీలో చేసిన ప్రయోగం, గంగదేవపల్లి అభివృద్ధి నమూనా, అన్నా హజారే నేతృత్వంలో రాలేగావ్ సిద్ధి అనుభవాలు రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు విస్తరిస్తే గ్రామీణ అభివృద్ధిలో నవశకం మొదలవుతుంది. అభివృద్ధిలో గ్రామీణప్రాంతాల భాగస్వామ్యం పెరగకుండా గ్రామీణ ప్రజల ఆదాయాలు పెరగకుండా 2035 నాటికి తెలంగాణ రాష్ట్రం ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగలేదనే వాస్తవాన్ని పాలకులు గ్రహించాలి. గ్రామీణ అభివృద్ధిని కాంక్షి ంచే ప్రభుత్వాలు మాటలకే పరిమితం కాకుండా పంచాయతీలకి సకాలంలో ఎన్నికలు నిర్వహించటంతో పాటు నిధులు విధులతో గ్రామ పాలనా వ్యవస్థని బలోపేతం చేసినప్పుడే గ్రామీ ణాభివృద్ధి అనే స్వప్నం సాకారమవుతుంది.



Main tab page 111_Main tab page 111.qxd 8/26/2025 12:21 AM Page 1



## దుర్మార్గ పెన్షన్ సవరణ క్లాజ్ రద్దు చేయాలి - ఏపీఆర్‌పీఏ డిమాండ్



**ఒంగోలు, ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లులో దొంగచాటుగా చూపించిన పెన్షన్ సవరణ క్లాజ్‌ను తక్షణమే రద్దు చేయాలని ఏపీఆర్‌పీఏ ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొని సభ్యులందరూ ముక్తకంఠంతో నినదించారు. ఏపీఆర్‌పీఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ప్రకాశవ హవనం వద్ద జి.శేసయ్య అధ్యక్షతన నేడు ధర్నా కార్యక్రమం జరిగింది. ధర్నా శిబిర డిమాండ్లను సంఘం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి సీమెచ్ రాంబాబు వివరించారు. పెన్షన్ సవరణ క్లాజును రద్దు చేయాలని, ఏపీఎస్ 95పెన్షన్ దారులకు కనీస పెన్షన్ రూ.900+డీఏ ప్రకటించాలని, సీనియర్ సిటిజనులకు రైల్వేలో 50శాతం రాయితీని పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 8వ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షనర్లకు 12వ వేతన సవరణ కమిటీలను తక్షణమే నియమించి ఐఆర్ 30 శాతం ప్రకటించాలని, రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ దారులకు, ఉద్యోగులకు రావాల్సిన అన్ని రకాల బకాయిలను వెంటనే మంజూరు చేయాలని, పెన్షన్ దారులకు రావాల్సిన కమ్యూటేషన్, గ్రాట్యూటీ, లీవ్ ఎన్కాష్మెంట్ తక్షణమే మంజూరు చేయాలని, ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన అన్ని రకాల బకాయిలను మంజూరు చేయాలని తదితర డిమాండ్లతో ధర్నా శిబిరం దద్దరిల్లింది. ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి మీగడ వెంకటేశ్వరరెడ్డి, టీవీ ఆర్ సుబ్బారావు, సీహెచ్ లక్ష్మీనారయాణ, రాబిన్ రవికుమార్, పి.పేరయ్య ప్రసంగించారు. శిబిరాన్ని ఉద్దేశించి ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు శరత్‌బాబు కృష్ణారెడ్డి, బీఎస్ఎన్ఎల్ సంఘ నాయకులు నాగేశ్వర రావు, పోస్టల్ సంఘ నాయకులు కే.వీరాస్వామిరెడ్డి, ఎస్‌జీపీఏ నాయకులు పరిటాల సుబ్బారావు, సీఐటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు అయ్యప్పరెడ్డి తదితరులు సందేశాలు ఇచ్చారు. ఈ ధర్నాలో శ్రీయతులు దామరాజు నాగేశ్వరరావు, సింగరాజు శ్రీనివాసరావు, గంధం నరసయ్య, కాకి దేవదానం, బడి తల మోహన్‌రావు, సూదనగుంట నరసింహారావు, బీవీ రావు, ఎన్.వీరాస్వామి, ఎం.శ్రీనివాసరావు, ఈ.రంగయ్య, జి.శ్రీరామ్మూర్తి, ఐవీ ఆంజనేయులు, కాటూరి శ్రీను, ఎస్కే నయీమ్‌భాష, పి.మీనాకుమారి, పి.శేషారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ని ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించారు.

## మేరుగ, చుండూరి, బత్తులను కలిసిన నాయకులు



**ఒంగోలు, ప్రభాతవార్త**

వైఎస్సార్‌సీపీ ఒంగోలు జిల్లా పార్టీకార్యాలయంలో సంతనూతలపాడు ఇన్‌ఛార్జ్ మేరుగ నాగార్జునని, ఒంగోలు ఇన్‌ఛార్జ్ చుండూరి రవిబాబుని, జిల్లా పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు, కార్పొరేటర్ మోయిళ్ల గౌరి సురేష్‌రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు, జడ్పీటీసీ దుంపా రవణమ్మ. ఈ సందర్భంగా మహిళా విభాగం క్రియాశీలకంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేల పలు సూచనలు ఇచ్చిన ఇన్‌ఛార్జ్‌లు ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుండి మహిళలకు ఆర్థిక చేయూత నివ్వడంలో పూర్తిగా వైఫల్యం చెందింది. అక్రమ కేసులు, దాడులు తప్ప చేసింది ఏమి లేదు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలను, అరాచకాలను ప్రజల తరపున ప్రశ్నిస్తూ, వైసీపీలో మహిళా విభాగం క్రియాశీలకంగా పని చేసేలా పార్టీ బలోపేతానికి సంబంధించిన పలు విషయాలపై సూచనలు ఇచ్చిన ఇన్‌ఛార్జ్‌లు. గ్రామ కమిటీలు, మండల కమిటీలు, నియోజకవర్గ కమిటీలలో ఉన్న మహిళా విభాగం బలోపేతం చేసేందుకు పలు అంశాలపై చర్చించిన మోయిళ్ల గౌరి.

## పొగాకు కొనుగోళ్లలో సమతుల్యం పాటించాలి - జిల్లా కలెక్టర్

**ఒంగోలు, ప్రభాతవార్త**

పొగాకు కొనుగోళ్లలో సమతుల్యం పాటించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. జిల్లాలో పొగాకు కొనుగోళ్లపై బోర్డు రీజనల్ మేనేజర్ ఎస్.రామారావు, ఐటీసీ మార్కెటింగ్ మేనేజర్ రాజుదొరైలతో సోమవారం తన కార్యాలయంలో ప్రత్యేకంగా చర్చించారు. కొనుగోళ్లకు సంబంధించి పొగాకు కంపెనీలు ఇచ్చిన ముందస్తు రిక్వైర్మెంట్స్, జిల్లాలో పొగాకు ఉత్పత్తి, ఇప్పటి వరకు కొనుగోలు, బ్యాలెన్స్ వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. లో గ్రేడ్ పొగాకును ఎక్కువగా తిరస్కరిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, అన్ని రకాల ఉత్పత్తులను కంపెనీలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ దిశగా ఉన్నతాధికారుల దృష్టికి తీసకెళ్లాలని ఐటీసీ మార్కెటింగ్ మేనేజర్‌కు చెప్పారు.

## ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాల్సిందే..

**- మీడియాతో నేషనల్ ప్రిడెంట్ ఫర్ రాక్స్ అండ్ మాలహానాడు డా. రత్నాకర్**



**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**


ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పునరాలోచన చేయాలని నేషనల్ ప్రిడెంట్ ఫర్ రాక్స్ అండ్ మాలహావాడు డా. రత్నాకర్ కోరారు. సోమవారం నగరంలోని ఎంసిఎ భవన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన పలు విషయాలు మాట్లాడారు. రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గంపై తెలుగు రాష్ట్రాల్లో కత్తిగట్టాయని పేర్కొన్నారు. దళితులతో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ అంశంపై వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణలో వారి స్టాండ్ ఎందో చెప్పాలని డిమాండ్ చేశారు. కులాన్ని మతాన్ని రెచ్చగొట్టి ఈ దేశాన్ని విభజించి, దేశాన్ని అమ్ముకునే పనిలో మోడీ పడ్డారని విమర్శించారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాల సామాజిక వర్గంపై సాధిస్తున్న కక్ష సాధింపు విషయంలో ఇకనైనా పునరాలోచన చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని వెనక్కి తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎస్సీ వర్గీకరణ టెంపరరీ మాత్రమే, శాంతియుత నిరంతర పోరాటం, పార్లమెంట్లో అమెండ్మెంట్ చేసేవరకు, ఇప్పుడు ఇచ్చిన ఏడుగురు జడ్జిల తీర్పును 11 జడ్జిల, అంతకన్నా ఎక్కువ జడ్జిలతో ఈ తీర్పును పునః సమీక్షించేంత వరకు ఈ నిరంతర శాంతియుత పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు చప్పిడి రవిశంకర్, బొలిమి వినోద్ కుమార్, షేక్ జిలాని, టి. సుబ్బారావు, నెల్లి సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## చీమకుర్తిలో క్యాస్ట్ రీ వెరిఫికేషన్

**చీమకుర్తి, ఆగస్టు 25, ప్రభాతవార్త**

చీమకుర్తి మండలం లో జరగబోతున్న క్యాస్ట్ రీ వెరిఫికేషన్ కు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ ఆర్ బ్రహ్మయ్య సోమవారం కోరారు. 14,939 మంది ఓసి, ఎస్సీ,ఎస్టీ, బీసీ, కులాలను మరో మారు విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు మేరకు కార్యాచరణ చేపడుతున్నట్టుగా తాసిల్దార్ చెప్పారు. రెవెన్యూ అధికారులు వారి సహాయకులతో అన్ని ఇండ్లకు వచ్చి విచారణ జరుగుతారని చెప్పారు. ఈ సమయంలో ప్రజలు వారి ఆధార్ కార్డులను ప్రభుత్వం గతంలో ఇచ్చిన కుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని కోరారు. కొంతమంది ప్రజలకు అవగాహన లేకపోవడంతో, విచారణకు సహకరించడం లేదని తమ దృష్టికి వచ్చిందని తహసీల్దార్ అన్నారు. విచారణ పూర్తయి ప్రజల వివరాలను ఆన్లైన్లో నమోదు చేసినట్లయితే, ఇక కార్యాలయాల చుట్టూ తిరగకుండానే వాట్సప్ ద్వారా సర్టిఫికెట్ పొందటానికి సులువుగా వీలవుతుందన్నారు. ప్రజలు అధికారులు అడిగిన సమాచారాన్ని ఇచ్చి, కుల పునర్విచారణకు సహకరించాలని కోరారు.

## నూతన బట్టల షాపును ప్రారంభించిన దామచర్ల జనార్ధన్



**కొత్తపట్నం, ఆగస్టు 25, ప్రభాతవార్త**

కొత్తపట్నం గ్రామంలో ఈతముక్కల రోడ్డు లోని కెనాన్ బ్యాంకు పక్కన శ్రీలక్ష్మీ యూత్ బ్రాండ్ కార్నర్ బట్టల షాపును ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు సోమవారం ప్రారంభించడం జరిగింది. ఈ షాపుని,షాపింగ్ మాల్ స్థాయిలో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని సామాన్య మానవులకు రేట్లు అనుకూలంగా ఉన్నట్లు దామచర్ల జనార్ధన్ రావు తెలిపారు. చిన్నపిల్లలు మొదలుకొని పెద్దవాళ్ల వరకు అన్ని రకాల దుస్తులు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు పురిని వల్లూరయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు శ్రీరామ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్ చాపల వంశీకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కొత్తపట్నంలో ఇలాంటి వాతావరణంలో షాపు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని ఆయన తెలియజేశారు. కొత్తపట్నం మండలం ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఎంబీబీఎస్ సీటు సాధించిన గురుకుల విద్యార్థిని



**చీమకుర్తి, ఆగస్టు 25, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలలో కష్టపడి చదివి కొమ్ము సమీక్ష అనే విద్యార్థిని మెడికల్ సీటు సాధించింది. చీమకుర్తి గురుకుల పాఠశాలలో చదివి, కొండపి గురుకుల కళాశాలలో విద్యనభ్యసించిన కొమ్ము సమీక్ష కాకినాడ రంగరాయ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు పొందింది. చీమకుర్తికి చెందిన ప్రసిద్ధ వైద్యుడు డాక్టర్ బి. జవహర్ ఆమె ప్రతిభను అభినందించారు. సీటు అలాట్మెంట్ లేఖ డౌన్‌లోడ్ చేసుకోవడానికి ఆర్థిక సహాయం రూపంలో 10,600 సోమవారం అందజేశారు. విద్యార్థినికి ఆశీస్సులు అందిస్తూ, భవిష్యత్తులో వైద్య రంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి మున్సిపల్ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యం ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది









**- ఏ రాజకీయ కారణంతో ఉపరాష్ట్రపతిని రాజీనామా చేయించారు**
**- ట్రంప్ డైరెక్షన్‌లో మోదీ ప్రభుత్వం..**
**- పౌరుల ఓటు హక్కు భంగం కలిగిస్తున్నారు**
**- దేశాన్ని కాపాడాలంటే కమ్యూనిస్టు పార్టీలు బలోపేతం కావాలి**
**- మీడియా సమావేశంలో సీపీఐ ప్రధాన కార్యదర్శి రాజా**


**ఒంగోలు, ప్రభాతవార్త**

ఈ దేశం ఎన్నడూ లేని విధంగా ప్రజాస్వామ్యం ప్రమాదకర పరిస్థితుల్లోకి వెళ్లిపోయిందని, అందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ విధానాలే కారణమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. నేడు దేశం ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోందని, ఈ దేశాన్ని కాపాడాలంటే కమ్యూనిస్టు పార్టీలు బలోపేతం కావాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలలో రెండో రోజు ముఖ్య వక్తగా హాజరైన రాజా మహాసభ ప్రాంగణంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ రాజకీయ కారణంతో ఉప రాష్ట్రపతి రాజీనామా చేశారో ఎన్డీఏ ప్రభుత్వం దేశ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఎందుకు ఉప రాష్ట్ర పతి ఎన్నిక నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. ఈ పదవికి ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ నేతగా పోటీలో ఉంచామన్నారు. నేడు దేశ రాజకీయాలు చాలా ప్రమాదకర పరిస్థితుల్లోకి వెళ్లిపోతున్నాయని రాజా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు నిలయంగా ఉన్న పార్లమెంట్‌లోనే అబద్ధపు మాటలు చెప్పి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారని, బ పెహల్గామ్ తీవ్రవాదుల దాడి కూడా రాజకీయం చేస్తున్నారని, ట్రంప్ చెబితేనే యుద్ధం ఆపమని మోదీ చెప్పడం సిగ్గుచేటన్నారు. కశ్మీర్ సమస్యను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పరిష్కరిస్తారా అని ప్రశ్నించారు. ట్రంప్‌తో మోదీ చెలిమి దేశానికి ప్రమాదకరమన్నారు. రష్యా భారత్ ఆర్థిక సంబంధాలు బలంగా ఉన్నాయని, అందుకే మోదీని పావుగా ట్రంప్ వాడుకుంటున్నారని చెప్పారు. దేశ ప్రజల సమైక్యతా స్ఫూర్తిని దెబ్బతీసేలా ఆర్ఎస్ఎస్ ప్రయత్నం చేస్తుందన్నారు. విపక్షాలపై ఈడీ, ఐటీ పేరుతో దాడి చేసి బెదిరించి తమ గుప్పెట్లో పెట్టుకుంటున్నారని ఇది దేశ రాజకీయాలకు మంచిది కాదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కమీషన్ స్వంతంత్ర సంస్థగా ఉండాలని, దాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం తమ గుప్పెట్లో పెట్టుకుని దేశ ప్రజల ఓటు హక్కును కాలరాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్లో ఓటు హక్కు లేకుండా లక్షలాది మంది ప్రజలను చేస్తున్నారని, ఇదే తరహాలో వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న కేరళ తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో అవలంభించేందుకు కేంద్రం కుట్ర చేస్తుందన్నారు. సెప్టెంబర్ 1వ తేదీన బీహార్‌లో ఓట్ల చోరీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపడతామన్నారు. సుప్రీంకోర్టు కలుగజేసుకొని ఆధార్ కార్డు ద్వారా ఓటు పొందాలని చెప్పినా కేంద్రానికి కనువిప్పు కలగడం లేదన్నారు. దీనిపై ఇప్పటికే సీపీఐ సుప్రీం కోర్టులో పిటిషన్ కూడా వేసిందని తెలిపారు. ఓటు హక్కు పొందాలంటే ఎంత మందికి బర్త్ సర్టిఫికేట్లు ఉంటాయని ప్రశ్నించారు. సామాన్య ప్రజల ఓటు హక్కును కాలరాసేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ పన్నాగానికి పాల్పడుతోందని ఇప్పుడు ఊరుకుంటే దేశమంతా ఇదే పరిస్థితి చోటు చేసుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ దేశ చరిత్రలో ఇలాంటి దాడికి పాల్పడుతాయని ఎవరు ఊహించలేదన్నారు. మరో పక్క దేశంలో ఆర్థిక వ్యవస్థ రోజు రోజుకు దిగజారి పోతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అమ్మేస్తున్నాయని అందుకు ఉదాహరణ విశాఖ స్టీల్ ప్లాంట్ అని చెప్పారు. దేశంలో రైతులు, కార్మికులు, యువత పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తున్నారని, దేశంలో ద్రవ్యోల్బణం పెరిగిపోతోందని ఆందోళన చెందారు. ఈ దేశాన్ని కాపాడాలంటే కమ్యూనిస్టు పార్టీల బలోపేతం కావాల్సిందేనని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 21 నుండి 25 వరకు చండీఘర్‌లో సీపీఐ 25వ జాతీయ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. సీపీఐ 100 ఏళ్ల ఉత్సవాలు జరుపుకుంటోందని అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో డిసెంబర్ 26న భారీ ప్రదర్శన చేపడతామన్నారు. డిసెంబర్ 24, 25వ తేదీల్లో విజయవాడలో వివిధ దేశాల ప్రతినిధులతో అంతర్జాతీయ సెమినార్ నిర్వహిస్తామన్నారు. వామపక్షాలు ఐక్య పోరాటాలు చేసి మరింత సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజనులను నక్సలైట్ల పేరిట చంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జార్ఖండ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో మరణ హోమం చేస్తున్నారని మండిపడ్డారు. తమ పార్టీ పూర్వపు ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మరణం తీవ్రంగా తనను కలిసి వేసిందని, సుధాకర్‌రెడ్డి స్ఫూర్తితో ఆయన ఆశయ సాధన కోసం కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు ఈ మహాసభలు వేదికగా ఈ దేశంలో రాష్ట్రంలో జరుగుతున్న ప్రమాదకర పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి, అఖిల భారత రైతు కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, ఆహ్వాన సంఘం కార్యదర్శి ఎంఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెల్స్‌కో కన్వీనర్‌గా నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి

**- శుభాకాంక్షలు తెలియజేసిన బీజేపీ నాయకులు కార్యకర్తలు**
**- పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: కల్యాణ్ చక్రవర్తి**

**ఒంగోలు, ప్రభాతవార్త**





బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ రాష్ట్ర వ్యాప్తంగా పదాధికారులను నియమించారు. ఈ నేపథ్యంలో ప్రకాశం జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తికి కీలకపదవి కట్టబెట్టారు. బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెల్స్ కి కో కన్వీనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సూర్య కల్యాణ్ చక్రవర్తికి ప్రకాశం జిల్లాకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఒంగోలులోని చెన్నకేశవ మాన్యంలో గల వికసిత భారత్ ట్రస్ట్ ఆఫీస్‌కి విచ్చేసిన కార్యకర్తలు, నాయకులు కల్యాణ్ చక్రవర్తిని భారీ పూలమాలలతో సత్కరించారు. రాష్ట్ర పదాధికారుల లిస్ట్‌లో గత కొన్నేళ్లుగా ప్రకాశం జిల్లా పేరే కనిపించలేదని, అలాంటిది కల్యాణ్ చక్రవర్తి చేసిన సేవలను గుర్తించి ఈ సారి ప్రకాశం జిల్లాకి చోటు కల్పించారని, అది కూడా కల్యాణ్ చక్రవర్తికి ఈ పదవి ఇవ్వడం ఎంతో గర్వకారణం అని, ఆనందంగా ఉందని ఈ సందర్భంగా జిల్లా బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కల్యాణ్ చక్రవర్తి తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు బీజేపీ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. బీజేపీని రాష్ట్రంలో, జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. అందరినీ కలుపుకుంటూ ముందుకు వెళ్తానని, ప్రజల్లో ఉంటూ, వారి సమస్యలు తెలుసుకుని వాటిని తీర్చేందుకు అందరం కలిసి కృషి చేద్దామని పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ మార్కండేయ అమరసింహ, అశోక్ రెడ్డి, లీగల్ సెక్రటరీ ఆంజనేయులు బొద్దులూరి, యువమోర్చ దామోదర్, జిల్లా సెక్రటరీ విజయ రావు, బాలకోటయ్య, ఒంగోలు మండలం 5 అధ్యక్షులు గరికపాటి వంశీ కృష్ణ, సత్య వతి, పద అపర్ణ, కోమలరావు జరుగుమిల్లి, రమేశ్, కావూరి వాసు, సీతారామాంజనేయులు, బాలినేని కల్యాణ్ రెడ్డి దాదాపు 100 మంది బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన ఎపియన్‌జిఓ అసోసియేషన్



**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**

ఎపియన్‌జిఓ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు కె శరత్ బాబు, జిల్లా కార్యదర్శి అర్ సి హెచ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్‌ని కలసి జిల్లాలో పనిచేస్తున్న విలేజ్, వార్డ్ సెక్రటేరియట్ లలో పని చేస్తున్న సచివాలయ మహిళా పోలీస్‌ల సమస్యల గురించి వారి దృష్టికి తీసుకొని రావడం జరిగినది. ప్రధానంగా మహిళా పోలీస్‌ల ఇంక్రిమెంట్‌ల విడుదలలో గల జాప్యాన్ని గురించి యస్‌పి దృష్టికి తీసుకొనిరాగా వెంటనే సంబంధిత అధికారులకు సదరు ఉత్తర్వులు మంజూరు కొరకు ఆదేశాలు జారీ చేయడం జరిగినది. అదేవిధంగా ప్రకాశం జిల్లాలో మహిళా పోలీసుల బదిలీల్లో జరుగుచున్న ఆలస్యం గురించి యస్‌పి దృష్టికి తీసుకొని రాగా బదిలీల్లో ఉన్న అవరోధాలను అతి త్వరగా తొలగించి బదిలీ ఉత్తర్వులు జారీచేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా ఒంగోలు పట్టణ కార్యదర్శి షేక్ మగ్దుం షరీఫ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె కోటేశ్వరమ్మ, సి హెచ్ శిరీష మరియు మహిళా విభాగం యస్పి కార్యాలయపు ప్రతినిధి అశ్విని తదితరులు యస్‌పిని కలసిన వారిలో ఉన్నారు.

## పిన్నిక విజయమ్మకు ఘన నివాళులు





**చీమకుర్తి, ఆగస్టు 25, ప్రభాతవార్త**

ప్రజాకవి, ఉద్యమ నాయకుడు పిన్నిక శ్రీనివాసరావు సతీమణి పిన్నిక విజయమ్మ కు పలువురు ఘన నివాళులర్పించారు. చీమకుర్తిలోని పిన్నిక నివాసం వద్ద సోమవారం జరిగిన సంతాప సభకు జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు పేరం శ్రీనివాస రావు, చింతలపాలెం బాబు అధ్యక్షత వహించారు. ముందుగా నాయకులు ఆమె చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ముఖ్య నాయకులు మాట్లాడుతూ ఈ సమాజంలో బడుగు బలహీన వర్గాల పేద ప్రజలను కవితలు ద్వారా చైతన్య పరుస్తూ నిరంతరం పేద ప్రజల ప్రగతి కోసం,పేద ప్రజల సమస్యల కోసం కృషి చేస్తున్న జాతి కవి పిన్నిక శ్రీనివాసరావు గారికి వారి సతీమణి లేకపోవడం ఎవరు తీర్చలేని లోటు అని, మేమున్నామని వారికి మనోధైర్యాన్ని కల్పించారు. కవిగారి కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సభలో ప్రజా నాట్యకల మండలి వారు ఉద్యమ పాటలు బాగా పాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని సభలో మాట్లాడిన నాయకులు మాజీ ఏయమ్ సి చైర్మన్ డాక్టర్ మారం వెంకా రెడ్డి,ప్రముఖ వైద్యులు డాక్టర్ బి జవహర్, చీమకుర్తి జడ్‌పిటిసి సభ్యులు వేమా శ్రీనివాసరావు,విప్లవ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అరసవెల్లి కృష్ణ, చేనేత జన సామాఖ్య జాతీయ అధ్యక్షులు మాచర్ల మోహన్ రావు, ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యం. యన్. మోహన్ కుమార్ ధర్మ,కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి దుడ్డు వెంకటరావు,,బి సి ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఊటుకూరు వెంకటేశ్వర్లు, అల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బక్కా పరం జ్యోతికాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు షైక్ షైదా,సంతనూతలపాడు కాంగ్రెస్ ఇంచార్జి పసుమర్తి సుధాకర్,ప్రకాశం ఎస్ సి సెల్ జిల్లా అధ్యక్షులు మన్నం ప్రసన్న రాజు ,మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా కన్వీనర్ తోరటి ఆనంద్ మాదిగ, రైతు సంఘం రాష్ట్ర నాయకులు చుండూరు రంగారావు పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి వీరాంజినేయులు,దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రం, గిరిజన ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పేరం సత్యం, ఖాదర్ బాషా ఆశ్రమం వ్యవస్థాపకులు షైక్ ఖాదర్ బాషా, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య మాదిగ,పద్మశాలి యా సంఘం నాయకులు చింతక్రింది అశోక్ కుమార్,చీమకుర్తి మున్సిపాలిటీ కమీషనర్ రామకృష్ణయ్య, మున్సిపాలిటీ శాంటి ఇన్స్పెక్టర్ రమణారెడ్డి,బి సి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తుల మల్లికార్జున రావు, చింతలపాలెం యలమందబాబు,రెడ్ డ్రాప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఇస్తర్ల శంకర్ బహుజన్,కడవ రామకృష్ణ, చలువాది రమేష్, జనసేన నాయకులు పోకూరి రామకృష్ణ రెడ్డి,కె యన్ పిఎస్ నాయకులు అరేతోటి రాంబాబు, దాసరి అంకన్న, రావూరి అంకారవు, రాజారత్నం, పోతురాజు, బక్కా రత్నం, బక్కా రాజు, పాటిబండ్ల వంశీ,పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి వీర ఆంజనేయులు, ఏ పి హేతు వదా సంఘము నాయకులు యమ్ కె బేగం, గిరిజన నాయకురాలు ఉడతా మంత్రాలూ, తెల్ల మేకల గాంధీ, మాజీ మున్సిపాలిటీ చైర్మన్ కౌత్రపు రాఘవ రావు, మర్రి లక్ష్మీనారాయణ, మాజీ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కందిమల్ల గంగాధర్,మంచి పుస్తకం చావాలా సుధాకర్,సిపిఎం నాయకులు కాలం సుబ్బారావు, ఆంజనేయులు,పౌర హక్కుల సంఘం క్రాంతి, ముత్యాల ప్రసాద్, ఓ పి డి ఆర్ జిల్లా కార్యదర్శి ఏ యల్ ప్రసాద్, అల్ ఇండియా బహుజన్ నాయకులు టి వెంకట స్వామి, లక్ష్మి నారాయణ, షైక్ అజిజు, దుడ్డు మార్కు, దొంతు సోమయ్య, దొంతు యాదగిరి నరసింహ రావు,సి ఐ టియు నాయకులు కాలం సుబ్బారావు, కెవీపిఎస్ నాయకులు రామారావు, కంకణాల వెంకటేశ్వర్లు, కరణం గంగయ్య, పాలడుగు సుబ్బారావు, బుచ్చిరాజు అంజయ్య, పాటిబండ్ల వంశీ, బిరుదుల లింగయ్య, బట్టి సల్మాన్, యిర్మీయా, మహిళ నాయకులు నాగలక్ష్మీ, భువనగిరి వెంకయమ్మ ప్రజా నాట్య మండలి బృందం పిడుగురాళ్ల శ్రీను, దే. సింగరావు, వై వీ, గోపి, దర్శాసి ప్రసాద్, వాణి, జలమ్మ కుటుంబం సభ్యులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల

**ఒంగోలు, ప్రభాతవార్త**

సోమవారం ఒంగోలు, పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పాల్గొన్నారు. కొత్తపట్నం నందు శ్రీలక్ష్మీ యూత్ బ్రాండ్ కార్నర్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని ఏ1 కన్వెన్షన్ హాల్ నందు ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు షేక్ రియాజ్ ఒంగోలు అర్బన్ డవలప్‌మెంట్ ఆథారిటి చైర్మన్‌గా ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని సర్వజన ఆరామక్షేత్రం నందు మందలపు వెంకటరావు దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. నగరంలోని పెళ్లూరు గ్రామం నందు ఆవుల నాగర్పమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు.

6_6.qxd 8/26/2025 12:19 AM Page 1



## ప్రజలకు మంచి చేసే కూటమి పాలన పది కాలాలపాటు కొనసాగాలి

### - రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీయాలి






**దొనకొండ ఆగస్టు 25,(ప్రభాతవార్త**
డాక్టర్ గొట్టిపాటిలక్ష్మీ ఒంగోలులోని తి1 కన్వెన్షన్‌లో సోమవారం జనసేన జిల్లా పార్టీ అధ్యక్షులు, మనందరి సుపరిచితులు షేక్ రియాజ్ నేడు ఒంగోలు డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేయడం కూటమి ప్రభుత్వంలో ఒక శుభ పరిణామం. గత ఐదేళ్ల వైసిపి పాలనకు ఎదురొడ్డి పోరాడిన రియాజ్ అన్న లాంటి వారికి మన కూటమిలో తగిన గుర్తింపు లభించిందని ఈ సందర్భంగా దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ లక్ష్మీ తెలిపారు.ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ , ఐటీ విద్యాశాఖమాత్యులు నారా లోకేష్‌బాబు 15 నెలల కూటమి పాలనలో ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తూ విధ్వంసం నుండి వికాసం వైపు అడుగులు వేస్తున్నాం. కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తూ, మంచి ప్రభుత్వంగా ప్రజలందరి దీవెనలు అందుకుంటున్న కూటమి జోరుతో ప్రతిపక్ష వైసిపి ఇక జెండా మూసుకునే రోజులు వచ్చాయి. అయితే వైసిపి సోషల్ మీడియా, పేటీఎం బ్యాచ్, సైకో బ్యాచ్ ప్రజలలో కూటమి ప్రభుత్వంపై చేస్తున్న దిగజారుడు ప్రయత్నాలను ప్రతికూటమి కార్యకర్త ఒక సైనికుని వలె తిప్పి కొట్టాలి. మన కూటమి అంటే ఒక క్రమశిక్షణ, ఎమ్మెల్యే స్థాయి నేతలనైనా దౌర్జన్యాలు చేస్తే సహించేది లేదని పవన్ కళ్యాణ్ గారు శ్రీశైలం ఘటనలో మనకు ఆదేశాలు ఇచ్చినట్లు నిరూపించారు. ప్రతి కార్యకర్త ప్రజల కోసం, ప్రజల అవసరాల కోసం, ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం, రాబోయే తరాలను బాగు చేసే స్ఫూర్తితో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. గత వైసీపీలో విధ్వంసం చూసాం, ఇప్పుడు వికాసం చూస్తున్నాం. సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తూ రాజధాని, పోలవరం నిర్మాణం పూర్తి చేస్తూ, ప్రకాశంలో వెలుగొండను ముందుకు తీసుకు వెళుతూ, స్త్రీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని స్త్రీ శక్తి పేరిట ఉచిత బస్సు, దీపం టు పథకం అమలు చేస్తూ డీఎస్సీ ద్వారా నిరుద్యోగ యువతకు ఊతమిస్తూ, ఆంధ్ర రాష్ట్రం నుండి వెనుకడుగు వేసిన పరిశ్రమలను తిరిగి రప్పిస్తూ మన కూటమి ప్రభుత్వం జన రంజక ప్రభుత్వంగా ముందుకు సాగుతుంది. కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధిలో భాగమైన ఒంగోలు నగర అభివృద్ధికి రియాజ్ అన్న కృషి ఎంతో మేలు చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేస్తూ ఆయన ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నాను అన్నారు. కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలి, అభిమానించాలి కలిసికట్టుగా కూటమి పార్టీలన్నీ ప్రతిపక్ష కుల మతాల చిచ్చును అధిగమించి అరాచకానికి వ్యతిరేకంగా ప్రజలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా, ఆనందంగా జీవించే పాలన రాబోయే 20 ఏళ్ల కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఈ అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.ఈ కార్యక్రమం లో...ఒంగోలు పార్లమెంట్ సభ్యులు శ్రీ మాగుంట శ్రీనివాస రెడ్డి గారు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ గారు, కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఒంగోలు మేయర్ శ్రీమతి గంగాడా సుజాత గారు జిల్లాలోని ప్రముఖ నాయకులు ఉన్నారు.

## నీళ్ల లేక ఇబ్బంది పడుతున్న వెంకటాపురం గ్రామం

### - గ్రామస్తుడు రొడ్డ వెంకట్రావు



**దొనకొండ ఆగస్టు 25,(ప్రభాతవార్త**
దొనకొండ మండలంలోని బ్రాహ్మణపల్లి (కే వెంకటాపురం)లో నీళ్ల లేక ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని గత కొన్ని నెలలుగా సాగర్ వాటర్ రాకపోవడం వల్ల వాటర్ ప్లాంట్లపై ఆధారపడాల్సి వస్తుందని, అదేవిధంగా బోర్లు అడుగంటడం వలన చేతిపంపుల బోర్ల నుంచి కూడా నీళ్ల రాకపోవడం వల్ల ఇంట్లో గృహ ఉపయోగకరమైనటువంటి అవసరాలకు నీరు లేకపోవడం వల్ల గ్రామస్తులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని, గతంలోనైనా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసే వాళ్ళని కనీసం ఆరు నెలల నుంచి అది కూడా లేదని,అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని, అధికారులు స్పందించి ట్యాంకర్‌ల ద్వారా నీరు సరఫరా చేయాలనీ గ్రామస్తులు తెలియజేసారు.

## మట్టి వినాయకుడినే పూజించాలి



**అద్దంకి ,ఆగస్టు 25, ప్రభాతవార్త**
బొమ్మనంపాడు, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో, తాటిబోయిన వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం వారి కుమారుడు తాటిబోయిన వెంకట సుబ్బారావు వందకుపైగా మట్టి వినాయకుడి బొమ్మలను విద్యార్థినీ విద్యార్థులకు అందజేశారు.ప్రధానోపాధ్యాయులు సి.హెచ్.వి.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ఈ విధంగా మట్టి వినాయక బొమ్మలను అందించడం చాలా మంచి విషయమని, మట్టి వినాయక బొమ్మలను పూజించడం వల్ల కాలుష్యానికి దూరంగా వుంటామని, నీటిలో కలపడం వల్ల ఎటువంటి కలుషితం వుండదని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కెఆర్‌కెలో జెకెసి బ్యాచ్ ప్రారంభం



**అద్దంకి , ఆగస్టు 25 ప్రభాతవార్త**
సింగరకొండ సమీపంలోని కెఆర్‌కె గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో జనరల్ నాలెడ్జ్‌సెంటర్ ఆధ్వర్యంలో సోమ వారంజెకెసి బ్యాచ్‌ని ప్రారంభించారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌డాక్టర్ వెల్లుల మోహనరావు మాట్లాడుతూ జెకెసి క్లాస్‌లకు ప్రతి విద్యార్థి తప్పని సరిగా హాజరు కావాలని వారి భవిష్యత్‌కు పునాదితోపాటు విజయానికి కూడ దారి చూపుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జెకెసి కోఆర్డినేటర్ డాక్టర్ షర్మిలారాణి, ఎ.శిఖామణి, వినుకొండ రమేష్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

## ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాస్‌ని సన్మానించిన మండల నాయకులు



**హనుమంతునిపాడు, ఆగస్టు 25, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణంలోని స్థానిక అమరావతి గ్రౌండ్స్ నందు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ రైతు సంబర సభ ట్రాక్టర్ల ర్యాలీలో మండలనాయకులు, కార్యకర్తలు, అభిమానులు రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సందర్భంగా సోమవారం కనిగిరి ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాస్ మండలంలో పర్యటించి టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులను కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రైతులకు పలు బహుమతులు పంపిణీ చేశారు. ముందుగా ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాస్‌ని నాయకులు శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌ఛార్జీ గాయం తిరుపతిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మురారినరసయ్య,యూనిట్ ఇన్‌ఛార్జీ కూడలిరోశయ్య,ఎంపీటీసీ ఉడుముల వెంకటసుబ్బారెడ్డి, గాయం కిష్టారెడ్డి, కనిగిరి ఏడీఏ జైనులుద్దిన్, మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్, మండల యూనిట్ కన్వీనర్ దేవిరెడ్డి రాజారాంరెడ్డి, కోటపాటి శేషయ్య,కత్తి తిరుపాలు, చీకటి వెంకట సుబ్బయ్య, ఏఈఓ గోపికృష్ణ తదితర నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ క్రాప్ డ్రైయర్లతో ఉద్యాన రైతులకు రెట్టింపు లాభాలు

### - ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ

**హనుమంతునిపాడు, ఆగస్టు 25, ప్రభాతవార్త**
ఉద్యాన పంటలను పండించే రైతులకు సోలార్ క్రాప్ డ్రైయర్లు 40 శాతం రాయితీతో అందుబాటులో ఉన్నాయని కనిగిరి ఉద్యాన శాఖ అధికారి విష్ణుప్రియ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హార్టికల్చర్ పంటలు అయిన పండ్లు, కూరగాయాలు, పూలు, మసాలా పంటలు త్వరగా పాడైపోయే స్వభావం కలిగి ఉండటంతో , సహజ ఎండలో ఆరబెట్టే సమయంలో నాణ్యత తగ్గిపోవడం, పురుగులు, పక్షులు, ధూళి కారణంగా రైతులు నష్టపోతున్నారని ఆమె పేర్కొన్నారు. వర్షాకాలంలో ఎండ లేకపోవడం వల్ల నిల్వ సమస్యలు మరింత ఎక్కువవుతున్నాయని వివరించారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం సోలార్ క్రాప్ డ్రైయర్ అని ఆమె స్పష్టం చేశారు. చిన్న, మధ్యస్థ, పెద్ద స్థాయిలలో లభ్యమయ్యే ఈ డ్రైయర్ల ద్వారా పండ్లు, కూరగాయాలు, మసాలాలు, పూలు, ఔషధ మొక్కలను నాణ్యత కోల్పోకుండా ఆరబెట్టి విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి మంచి ధరలకు విక్రయించవచ్చు అన్నారు. సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే సోలార్ క్రాప్ డ్రైయర్ వాడితే 20 నుండి 30 శాతం వరకు పంటల కోత అనంతరం జరిగే నష్టాలు తగ్గి, రైతులకు 5 నుండి 25 శాతం అదనపు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. నిల్వ కాలం కూడా రెట్టింపు అవుతుందని తెలిపారు. ప్రత్యేకంగా కనిగిరి నియోజకవర్గంలో ఎక్కువగా పండించే నిమ్మ, బత్తాయి పంటలను ఆఫ్ సీజన్ సమయంలో తక్కువ ధరకు అమ్మాల్సిన పరిస్థితి ఉన్నా, ఈ సోలార్ క్రాప్ డ్రైయర్ సాయంతో వాటిని డ్రై ప్రొడక్టులుగా మార్చి అధిక ధరలకు విక్రయించి రైతులు లాభాలు పొందవచ్చని ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ వివరించారు. ఇతర వివరాల కోసం రైతులు తమ పరిధిలోని రైతు సేవ కేంద్రం సిబ్బందిని లేదా ఉద్యానశాఖ అధికారిని సంప్రదించాలని ఆమె సూచించారు.

## సుబ్బరామిరెడ్డికి పలువురు నివాళి



**అద్దంకి , ఆగస్టు 25 ప్రభాతవార్త**
ఐటిసి కాంట్రక్టర్ సుబ్బరామిరెడ్డి దశదిన కార్యక్రమం చీరాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి వైసిపి బాపట్ల జిల్లా రైతు విభాగ అధ్యక్షులు ఈదా శ్రీనివాసరెడ్డి,వైసిపి బిసిసెల్ అధ్యక్షులు జి. శ్రీనివాసరావు, సోమ శ్రీనివాసరెడ్డి, వాసు, రాజశేఖర్, చిన్న శ్రీను, తదితరులు సుబ్బరామిరెడ్డికి నివాళులర్పించారు.

## నాగులపాడు పిఎసిఎస్ పాలకమండలి బాధ్యతలు స్వీకరణ

### - అధ్యక్షునికి పలువురు అభినందనలు









**అద్దంకి , ఆగస్టు 25 ,ప్రభాతవార్త**
మండలంలోని నాగులపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన చైర్మన్‌గా యేనుగంటి వెంకటరామయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ప్రభుత్వం సహకార సంఘాలకు త్రిమెన్ కమిటీ పాలకమండలిని నియమిస్తుంది.ఈనేపధ్యంలో యేనుగంటి వెంకటరామయ్యను (బాబు)ను చైర్మన్‌గా, డైరెక్టర్లుగా రామాయపాలెం మాజీ సర్పంచ్ వేములపాటి సుబ్బరావమ్మ,సోమేపల్లి వెంకటరావులను నియమించింది.ఈ నేపథ్యంలో నాగులపాడు పిఎసిఎస్‌కార్యాలయంలోఈ నూతన పాలకమండలి బాధ్యతలను స్వీకరించింది.ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ వెంకటరామయ్య మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి కృషిచేస్తానని,రైతులకు సహకర సంఘం ద్వారా పూర్తి సేవలను అందుబాటులోకి తెస్తానని పేర్కొన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, రుణాలు సకాలంలో అందేలా కృషి చేస్తానని చైర్మన్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన సొసైటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఛైర్మెన్ గా అవకాశం కల్పించిన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడ ఆయన ప్రత్యేకకృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు,తెదేపా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.సొసైటీ మాజీ అధ్యక్షులు సందిరెడ్డి రమేష్,ఎఎంసి వైఎస్‌చైర్మన్ ధర్మవరపు నాగేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు కాకాని ఆశోక్, వడ్డవల్లి పూర్ణచంద్రరరావు,వలి,పలువురు టిడిపి నాయకులు యేనుగంటి వెంకటరామయ్యను అభినందించారు.

## అద్దంకి నియోజకవర్గంలో కరణం వెంకటేష్ పర్యటన





**బల్లికురవ, ఆగస్టు 25, ప్రభాతవార్త**
చీరాల వైకాపా ఇన్‌ఛార్జీ కరణం వెంకటేష్‌బాబు సోమవారం అద్దంకి నియోజకవర్గంలోని పలు గ్రామాలలో పర్యటించారు. తొలుత మేదరమెట్ల లోని సింగమనేని చంద్రమౌళి,వనజాక్షి దంపతుల కుమారుడు రాజేష్, దీప్తిల వివాహం ఇటీవల జరిగింది. ఈ సందర్భంగా వారి నివాస గృహానికి చేరుకొని నూతన దంపతులను ఆశీర్వదించి వివాహమహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా గోవాడగ్రామంలో ఎడ్లపల్లి శ్రీనివాస రావు,పుష్పలతల కుమార్తె యశోదలక్ష్మీ, బ్రహ్మ తేజల వివాహం ఇటీవల జరిగింది.ఈ సందర్భం గా వారి నివాస గృహానికి చేరుకుని నూతన దంపతులను ఆశీర్వదించి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. బల్లికురవ మండలం వల్లాపల్లి గ్రామంలో మంచాల శ్రీనివాసరెడ్డి, పద్మావతి దంపతుల కుమారుడు వెంకటకృష్ణారెడ్డి,ప్రశాంతి వివాహం ఇటీవల జరిగింది. ఈసందర్భంగా ఆయనకుటుంబ సభ్యలను పరామర్శించారు.వారియోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

## మండలంలో సమృద్ధిగా ఎరువులు నిల్వలు - ఎఒ



**అద్దంకి , ఆగస్టు 25, ప్రభాతవార్త**
మండలంలో సమృద్ధిగా ఎరువులు అందుబాటులో ఉన్నాయని అద్దంకి మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు.మండలంలో ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా 110టన్నులు,డి.ఏ.పి 142.5 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 335 టన్నుల ఎరువులు, రైతు సేవా కేంద్రాలలో యూరియా 32 టన్నులు,డి.ఏ.పి 74 టన్నులు ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎరువులు అందవేమోనని ముందస్తు కొనుగోలు చేస్తున్నారని, ఇప్పటికే అవసరానికి మించి ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఎఒ తెలిపారు. వచ్చే నెలలో మరిన్ని ఎరువులు జిల్లాకి వస్తాయని, రైతులు అవసరం మేరకే ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. అవసరం లేకుండా ఎరువులు నిల్వ చేయడం నేరమని తెలిపారు. వ్యవసాయేతర అవసరాలకు యూరియా అమ్మినా,కొన్నా,నిల్వ చేసిన నేరమని తెలిపారు. అధిక ధరలు కు అమ్మినా,యూరియా తో పాటు వేరే ఎరువులు లింక్ పెట్టినా లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎరువుల పై రెవెన్యూ, పోలీసు, వ్యవసాయశాఖ అధికారులు తో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయడమైనది ఎఒ తెలిపారు.

## బ్రహ్మకుమారీ సెంటర్‌లో రక్తదానం శిబిరం

### - 50 మంది పాల్గొని రక్తదానం





**అద్దంకి , ఆగస్టు 25, ప్రభాతవార్త**
అద్దంకి పట్టణంలోని బ్రహ్మకుమారీస్ సెంటర్‌లో సోమవారం ప్రత్యేక రక్తదానం శిబిరం జరిగింది. ఈ శిబిరంలో 50మందిదాక హజరై రక్తదానం చేశారు. బ్రహ్మకుమారీస్ ప్రారంభ సమయంలో మొదటి ఇన్‌చార్జిగా పనిచేసిన ప్రకాష్‌కుమారీ వర్ధంతిని పురస్కరించుకొని ఈ రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీహరిణి కళాశాల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్ని రక్తాని దానం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వనితా క్లబ్, వాసవీ క్లబ్ సభ్యులు కూడ పాల్గొన్నారు.


## ఎరువులు, పురుగు మందుల దుకాణాలు తనిఖీ



**కొనకనమిట్ల, ఆగస్టు 25, ప్రభాతవార్త**
మండలంలోని పెద్దారికట్లలో భాగ్యలక్ష్మి, శ్రీ లక్ష్మీ నరసింహ లక్ష్మీ ఋషిత ఎరువులు, పురుగు మందుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి కే.ప్రకాష్‌రావు సోమవారం తనిఖీలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీ చేయడం జరిగిందన్నారు. పురుగుమందులు,ఎరువుల నిల్వలను పరిశీలించారు .ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ దుకాణాలలో కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులకు బిల్లులు తప్పనిసరిగా రైతులకు ఇవ్వాలన్నారు. లైసెన్సు అన్ని డాక్యుమెంట్లు సరి చేసుకోవాలని లేనిచో షాపులు లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే ఎక్కువ రేటుకి అమ్మాలని చూసిన వాళ్ల మీద శాఖాపరమైన చర్యలు తీసుకొని షాపులు సీజ్ చేస్తామన్నారు. లైసెన్సు కూడా రద్దు చేయడం జరుగుతుందన్నారు. సమయానికి రికార్డులు, బిల్లు బుక్కులు అప్‌డేట్ చేసుకొని ఎంఆర్పీ రేట్లకి అమ్మాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రవికాంత్, విక్రం పాల్గొన్నారు.

## చెరుకూరు సొసైటీ చైర్మన్‌గా వడ్డే మాల్యాద్రి





**పొన్నలూరు, ఆగస్టు25,ప్రభాతవార్త**
మండలంలోని చెరుకూరు ప్రాథమిక పరపతి సహకార సంఘం చైర్మన్‌గా నియమితులైన వడ్డే మాల్యాద్రి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు.ఆయనతో పాటు ముచ్చు ఆదియ్య, కుర్రా మాల్యాద్రి డైరెక్టర్లుగా ఈ కార్యక్రమం లో బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యహాజరై నూతన చైర్మన్, డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.అంతకు ముందు దామచర్ల సత్యకు నాయకులు,కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఆయనను గుర్రంపైఊరేగించి గ్రామస్తులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. ముఖ్యంగా దామచర్ల సత్యకు గ్రామమహిళల నుండి విశేషస్పందన లభించింది.ఈ కార్యక్రమం లో మండల టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ ఎంపిపి కొండ్రగుంట శ్రీనివాసరావు,మాజీ పార్టీఅధ్యక్షుడు మండవ ప్రసాద్, మండల టిడిపినాయకులు కర్ణకోటిరెడ్డి,మాజీ సర్పంచ్ పల్లపోతు ప్రసాద్,మండవ మురళీమోహన్,అనుమోలు సుధాకర్, జనసేన కనపర్తి మనోజ్ కుమార్,సన్నమూరి నరసింహం తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం ఢీ కొని మహిళా కానిస్టేబుల్‌కు గాయాలు

**బల్లికురవ, ఆగస్టు 25, ప్రభాతవార్త**
బల్లికురవ, అద్దంకి రహదారిలో సోమవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో మహిళ పోలీసు తీవ్రంగా గాయపడింది. వివరాల్లోకి వెళ్తే.. బల్లికురవకు చెందిన గెల్లా రత్నకుమారి వల్లాపల్లి సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం తర్వాత భోజన విరామ సమయంలో బల్లికురవ వచ్చే క్రమంలో గుంటుపల్లి పోలేరమ్మ గుడి సమీపంలో బల్లికురవ నుండి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రత్నకుమారి కాలుకు తీవ్ర గాయాలైనట్లు తెలుస్తుంది. క్షతగాత్రురాలుని నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

## దోర్నాలలో హెచ్‌ఐవీ అవగాహన కార్యక్రమం



**పెద్దదోర్నాల, ఆగస్టు 25, ప్రభాతవార్త**
దోర్నాల కేజీబీవీ బాలికల పాఠశాలలో సోమవారం హ్యాండ్స్ ఆఫ్ కంప్యాషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏపీ సాక్స్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సమితి ఆదేశాల మేరకు ఐఈసీ కాంపెయిన్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో అవుట్ రీచ్‌వర్కర్ పి.రేణుక దేవి విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ మాట్లాడుతూ హెచ్‌ఐవీ వ్యాప్తి చెందే 4మార్గాలు ఉన్నాయని వివరించారు. అవి కలుషితం అయిన సూదులు, సిరింజిల వాడకం ద్వారా కలుషితం అయిన రక్త మార్పిడి ద్వారా రక్షణ లేని లైంగిక సంబంధాల ద్వారా హెచ్‌ఐవీ భారిన పడ్డ తల్లి నుండి శిశువుకు వ్యాప్తి చెందే అవకాశం ద్వాఆర అలాగే హెచ్‌ఐవీ ఎయిడ్స్ నియంత్రణ చట్టం 2017 ప్రకారం, హెచ్‌ఐవీ భారినపడ్డ వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వివక్షతో చూడకూడదని, సమాన హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందని విద్యార్థులకు సూచించారు. అదే విధంగా ఎస్‌టీఐ గురించి అవగాహన కల్పిస్తూ అవి ఎలా వస్తాయి, వాటి లక్షణాలు ఏమిటి, వాటి నివారణ కు జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో వివరించారు. విద్యార్థులు ఇలాంటి విషయాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్.అనూష, ఏఎన్‌ఎం రాణి, పీఈఎస్ రాణి భవాని పాల్గొన్నారు.

## డియస్సీలో సత్తాచాటిన రిక్షా డ్రైవర్ కుమారుడు సయ్యద్ అన్సారీ



**యర్రగొండపాలెం,ఆగస్టు 25,పభాతవార్త**
య ర్రగొండపాలెం పట్టణంలోని ఉట్ల స్ధంభాలవీధిలో నివాసం ఉంటున్న సయ్యద్ సాధిక్,ఖ్రమూన్నిసాల కుమారుడు సయ్యద్ అన్సారీ ఇటీవల ప్రకటించిన మోగా డియస్సీ 2025లో తన సత్తాచాటి ప్రకాశంజిల్లాలో 14వ ర్యాక్‌సాధించాడు.ఈ సందర్భంగా అన్సారీయ మాట్లాడుతూ పుట్టుకతో పేదరికంలో పుట్టిన తన తండ్రి సయ్యద్ సాధిక్ య గ్రొండపాలెం పట్టణంలో రిక్షా తోక్కు కుంటు తనను చదివించాడని ఆవేదన వ్యక్తం చేశాడు.తాను య ర్రగొండపాలెం పట్టణంలోని యంపియూపిస్కూల్ లో 1వతరగతి నుండి 7వ తరగతి వరకరు 8వ తరతగతి నుంచి 10వ తరగతివరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువు కున్నాని ఇంటర్,డిగ్రీ మార్కాపురం ప్రవేటు కళాశాలలో చదువుకోని బి.ఎడ్ పూర్తి చేసిన తరువాత ప్రవేటు టీచర్‌గా పనిచేశానని తెలిపాడు.తాను ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాదించాలని పట్టుదలతో తాను 2025మెగా డియస్సీలో ప్రకాశంజిల్లాలో స్కూల్ అసిసెర్ట్ మ్యాథ్స్‌లో 14వ ర్యాంక్ సాధించడం జరిగిందని అన్నారు.తనను ప్రోత్సహించిన తన తల్లిదండ్రులకు కుటుంబసభ్యులకు తనను ఆర్థికంగా ఆదుకొని ఇంతటి ఘన విజయం సాదించడానికి కారణమైన తన మేనమామ ప్రభుత్వ ఉపాధ్యాయుడు షేక్.అబ్దుల్ సలాం ఈ సదర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## నిమ్మ..రైతుకు కన్నీటి చెమ్మ



**యర్రగొండపాలెం,25,పభాతవార్త**
యర్రగొండపాలెం,పుల్లలచెరువు నిమ్మరైతులకు నిమ్మకాయ ధరలు నేల చూపులు చూస్తున్నాయి.ఇటీవల వర్షాలు కురవడంతోపాటు వాతవరణంలో వచ్చిన మార్పులతో ఇతర రాష్ట్రాల్లో భారీగా రేట్లు తగ్గిపోయాయి.కిలో రూ.40లు పలకగా కనీసం కోత కూలి,పార్శిల్ ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు.రూలక్షలు పెట్టుబడులు పెట్టి తోటలు కౌవులుకు తీసుకున్న రైతులు భారీగా నష్టపోయారు.కొన్ని తోటల్లో తెగుళ్లతో మచ్చలు ఏర్పడి నాణ్యత తగ్గాయి.హైదరాబద్ మార్కెట్‌కు సరకు అధికంగా వస్తుండంతో ధరలు తగ్గయని రైతులు వాపోతున్నారు.


## డేవిడ్‌రాజుకు కరణం ఘన నివాళి

**బల్లికురవ, ఆగస్టు 25, ప్రభాతవార్త**
మాజీ ఎమ్మెల్యే, మాజీ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పాలపర్తి డేవిడ్ రాజు జ్ఞాపకార్థ స్తుతి కూడిక సందర్భంగా సోమవారం, మట్టిగుంట లో జరిగింది. ఈ కార్యక్రమానికి చీరాల వైకాపా ఇన్‌ఛార్జీ కరణం వెంకటేష్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా డేవిడ్ రాజు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. తన హయాంలో బడుగు,బలహీన వర్గాల సంక్షేమానికి అవిరల కృషి చేశారని డేవిడ్‌రాజు సేవలను గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి - నలుగురు వ్యక్తులకు గాయాలు

### - మృతునిది సజ్జాపురంగా గుర్తింపు





**సంతమాగులూరు ,ఆగష్టు 25, ప్రభాతవార్త**
గుంటూరు - కర్నూలు రహదారిలో సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం -సంతమాగులూరు మధ్య సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు మృతుడు నంబూరి దావీదు (62) ది మండలంలోని సజ్జాపురం గ్రామం.సజ్జాపురం గ్రామానికి చెందిన కొందరు ఆటోలో పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం పొట్లూరు గ్రామం వెళ్ళి ఒక కుటుంభ పంచాయితీ లో పాల్గొని అదే ఆటోలో తిరిగి వస్తుండగా ఆటో పుట్టవారిపాలెం దాటి సంతమాగులూరు రెండు గ్రామాల మద్యలో గల నక్కల వాగు వద్ద వెనుక నుండి వస్తున్న కారు డ్రైవర్ నిర్లక్ష్యంగ ఆనడుపుతూ ముందు వెళుతున్న ఆటోను వెనుక నుండి ఢీకొట్టగా ఆటో వాగు వంతెనకు ఢీకొని ఆటో డ్రైవర్ ప్రక్కన కూర్చుని ప్రయాణిస్తున్న దావీదు ఆటోలో నుండి ఎగిరి వంతెన గోడపై నుండి రమా రమి 10 అడుగుల లోతుగా ఉన్న క్రిందకు పడి పోవడంతో తల వెనుక భాగాన రక్త గాయం కావడంతో అక్కడి కక్కడే కన్ను మూశాడు. ఆటోలో ప్రాయాణిస్తున్న మరికొందరికి గాయాలు కాగా వారిని 108 వాహనంలో నరసరావుపేట వైద్యశాలకు తరలింయారు.విషయం తెలుసుకున్న సంతమాగులూరు సీఐ కె.వెంకట్రావు,ఎస్సై ఎం.పట్టాభిరామయ్య ఏఎస్సై శ్రీనివాసరావులు తమ సిబ్బందితో ఘటనా స్థలికి వెళ్లి క్షత గాత్రులను నరసరావుపేట తరలించి బాదిత కుటుంభసభ్యుల నుండి పిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

7_7.qxd 8/26/2025 12:20 AM Page 1



## కరాటే ప్రదర్శనలో గోల్డ్, సిల్వర్‌మెడల్స్ సాధించిన విద్యార్థులు



**గిద్దలూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త**
ఈనెల 24వ తేదీ తెలంగాణ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌కు గిద్దలూరు స్టోన్ కాన్ గిచిన్ కరాటే ప్రెసిడెంట్ ఎస్ శ్రీనివాస్ విద్యార్థులు గోల్డ్ సిల్వర్ మెడల్స్ సాధించారు. 9 సంవత్సరాల విభాగం కరాటే ప్రదర్శనలో విద్యార్థులు గోల్డ్,సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా మెడల్స్ సాధించిన విద్యార్థులకు పట్టణానికి చెందిన పలువురు అభినందనలు తెలియజేశారు.

## ఉచిత ఉపకరణములు అందించేందుకు నిర్ధారణ పరీక్ష శిబిరం



**గిద్దలూరు, ఆగస్టు 25 ,ప్రభాతవార్త**
పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రభుత్వ అవసరాలుగల పిల్లలకు ఉచిత ఉపకరణములు అందించేందుకు సోమవారం నిర్వహించిన నిర్ధారణ పరీక్ష శిబిరానికి 80మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఐఈ కోఆర్డినేటర్ నాగేంద్రనాయక్ మాట్లాడుతూ ఆరు మండలాల నుంచి 1-18 సంవత్సరాల లోపు వయసుగల విద్యార్థులు, చిన్నారులు పాల్గొన్నారని వివరించారు. వారికి వైకల్య నిర్ధారణ పరీక్షలు చేశామని తెలిపారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలకు తగ్గట్టుగా ఉచితంగా పరికరాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఎస్.అశ్వనికుమార్, పి.నాగభూషణరెడ్డి, ఆరు మండలాల ఐఈఆర్‌టి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్‌గా షేక్ రియాజ్ ప్రమాణ స్వీకారం



**గిద్దలూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త**
ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్‌గా జనసేన నాయకులు షేక్‌రియాజ్ ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ మహోత్సవ కార్యక్రమంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని రియాజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

## వైఎస్సార్సీపి పట్టణ అధ్యక్షులుగా షేక్ సలీమ్..

**- ప్రధాన కార్యదర్శిగా గోలమారి సత్యనారాయణ రెడ్డి నియామకం**



**మార్కాపురం రూరల్, ఆగస్టు 25 ప్రభాతవార్త**
మార్కాపురం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అన్నా రాంబాబు ఆధ్వరనయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మార్కాపురం పట్టణ అధ్యక్షుడిగా 20 బ్లాక్ కౌన్సిలర్ షేక్‌సలీం,పట్టణ ప్రధాన కార్యదర్శిగా గొల్లమారి సత్యనారాయణ రెడ్డిలను పార్టీ సభ్యుల ఆధ్వర్యంలో ఎన్నుకోబడిందని ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారని తెలిపారు. అధ్యక్షులు సలీమ్, ప్రధాన కార్యదర్శి గొలమారి సత్యనారాయణ రెడ్డి ఇరువురు మాట్లాడుతూ మా మీద నమ్మకం ఉంచి మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జి,సమన్వయకర్త అన్నారాంబాబుకు,పార్టీ అగ్ర నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తూ 2029 సాధారణ ఎన్నికలలో రాష్ట్రంలో మన వైఎస్సార్సీపి జెండాను ఎగురవేసే విధంగా పార్టీకోసం పనిచేస్తామని, మీ నమ్మకాన్ని వమ్ము చేయమని తెలిపారు.

## మండలంలో యూరియా కొరత లేదు..

**- అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు.. ఏవో బుజ్జి భాయి**



**మార్కాపురం రూరల్, ఆగస్టు 25, ప్రభాతవార్త**
మార్కాపురం మండల వ్యవసాయాధికారిణి కె బుజ్జిబాయ్ సోమవారం అన్ని ఎరువుల దుకణాలను తనిఖీ చేయడం జరిగింది. యూరియా కొరత లేదని తెలియజేయడం జరిగింది. రైతులకు తగినంత యూరియా అందుబాటులో ఉన్నదని ఎంఆర్‌పి ధరలకే ఎరువులు అమ్మాల, ఫెర్టిలైజర్ షాపుల డీలర్లను ఆదేశించారు. మండలంలో 3500ఎకరాలు పంట నమోదు చేయడం జరిగిందని, ఇంకా పంట నమోదు కొనసాగుతుందని తెలిపారు. ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కాకుండా అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

## మీ కోసం కార్యక్రమానికి మూడు అర్జీలు



**సంతనూతలపాడు, ఆగస్టు 25 ప్రభాతవార్త**
సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమానికి ఈ మేరకు ప్రజల నుండి మూడు అర్జీలు దాఖలైనట్లు తహశీల్దార్ ఎస్ఎల్ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఒకటి మ్యుటేషన్, రెండు సర్వే కొలతలకు ఈ మేరకు అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు ఎంపీడీఓ డి.సురేష్‌బాబు, ఎంఈఓ డి.వెంకారెడ్డి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సావిత్రి, మండల హౌసింగ్ ఏఈ ఎన్.మణి ప్రసాద్, వ్యవసాయ శాఖ ఏఈఓ సుబ్బారెడ్డి, వెలుగు సీసీ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ ప్రతినిధి మేళం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎలాంటి భద్రతా లేని అసంఘటిత రంగ కార్మికులు




**సంతనూతలపాడు, ఆగస్టు 25, ప్రభాతవార్త**
ఎలాంటి భద్రతా లేకుంగా అసంఘటిత రంగంలో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారని సీఐటీయు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు పేర్కొన్నారు. సంతనూతలపాడులోని సుందరయ్య భవన్‌లో సోమవారం నాడు జరిగిన సీఐటీయు మండల 8వ మహాసభలో రెండవ రోజు నివేదికపై చర్చలు జరిగాయి. రంగాల వారి నాయకులు చర్చలో పాల్గొని, ఈ కాలంలో జరిగిన ఉద్యమాలపై సమీక్ష చేశారు. మహాసభ ముగింపు సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు మాట్లాడుతూ మండలంలో అసంఘటిత రంగంలో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారని, వారికి ఎటువంటి భద్రత సౌకర్యాలు లేక అభద్రతతో పని చేస్తున్నారన్నారు. ప్రమాదాలు జరిగితే పట్టించుకునే నాథుడే లేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ లాంటి సౌకర్యాలు కూడా అమలు కావడం లేదని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు గత, ప్రస్తుత పాలకులు చంద్రన్న జగనన్న భీమా పేరుతో పక్కదారి మళ్లించారన్నారు. వెంటనే ఆ నిధులను వెల్ఫేర్ బోర్డులో జమ చేసి కార్మికుల పెండింగ్ క్లైములు వెంటనే పరిష్కారం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చాలీచాలని జీతాలతో స్కీం వర్కర్లు నానా యాతన పడుతున్నారని అన్నారు. అంగన్‌వాడీలకు రకరకాల యాప్‌లు తెచ్చి ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు పని చేయక నిత్యం ఆనసిక వేదనకు గురవుతున్నారన్నారు. పేస్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని, పని చేయని ఫోన్లు వెనక్కి తీసుకొని ట్యాబ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘం మండల కార్యదర్శి నెరుసుల మాలతి మాట్లాడుతూ అన్ని రంగాల్లో పని చేస్తున్న మహిళలు ఒక వైపు శ్రమ దోపిడికి, మరో వైపు లైంగిక దాడులకు గురవుతున్నారని ప్రభుత్వం వెంటనే లైంగిక దాడులను అరికట్టాలని కోరారు. అనంతరం సీఐటీయు మండల నూతన కమిటీ 15 మందితో ఎంపికైంది. మండల కన్వీనర్ షేక్ మస్తాన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభకు తుళ్లూరు సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు ఉక్కెర సీతారామరాజు, దాసరి చిన్నబాబు, షేక్ నాగూర్, కైలా అవినాష్, కావూరి శ్యామ్, ఎన్.శ్రీను, కే.బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర రెవెన్యూ మంత్రి సత్య ప్రసాదును మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర టీడీపీ కార్యదర్శి స్వాములు



**సంతనూతలపాడు, ఆగస్టు 25, ప్రభాతవార్త**
బాపట్లలో సోమవారం నాడు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను రాష్ట్ర టీడీపీ కార్యదర్శి, సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ నేత అడకా స్వాములు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలుతెలిపారు. సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు తదితరులు రెవెన్యూ మంత్రిసత్య ప్రసాద్‌ను కలిసి వారిలో ఉన్నారు.

## మంగమూరు, ఎనికపాడు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు సౌకర్యాన్ని పునరుద్ధరించండి



**సంతనూతలపాడు, ఆగస్టు 25, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలంలోని మంగమూరు ఎనికపాడు గ్రామాలకు ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని సీపీఎం నాయకులు ఒంగోలు ఆర్టీసీ డిపో మేనేజర్ ఘట్టమనేని శ్రీనివాసరావును సోమవారం ఒంగోలులో కలిసి వినతిపత్రాలను సమర్పించారు. నిత్యం వందలాది మంది ప్రజలు పలు పనులు నిమిత్తం ప్రతి రోజు ఒంగోలుకు వస్తుంటారని బస్సు సౌకర్యం లేక ప్రజలు పలు ఇబ్బందులుఎదుర్కొంటున్నారని వారు విన్నవించారు. భవన నిర్మాణ కార్మికులు అసంఘిటిత రంగ కార్మికులు కాలేజీ విద్యార్థులు ఒంగోలుకు నిత్యం వస్తుంటారని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందని గ్రామాలకు బస్సు రాకపోతే వారు అసౌకర్యాన్ని మహిళలు ఉపయోగించుకోలేక పోతున్నారని ఈ సందర్భంగా వారు డిపో మేనేజర్‌కి విన్నవించారు. ఈ విషయమై ఆఆయా గ్రామాలలో వారు సంతకాలు సేకరణ చేసిన వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి మాట్లాడుతూ ఆర్టీసీ ఆర్‌ఎంతో మాట్లాడి రూటును పరిశీలించి రెండు రోజుల్లో బస్సు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులుషేక్‌మస్తాన్,టి.రాము,పి.సుబ్బారెడ్డి, ఎన్‌వి.నరసింహం, ఎం.శ్రీనివాసరావు, జే.కోటేశ్వరరావు, టి.నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ సేవలను రైతులకు చేరువ చేయాలి

**- మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పిలుపు**

**- మన్నేపల్లి సొసైటీ నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణ**



**తాళ్లూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త**
మన్నేపల్లి ప్రాథమిక అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీ(పీఏసీఎస్) సేవలను రైతులకు చేరువయ్యేలా నూతన పాలకవర్గం కృషి చేయాలని దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు కోరారు. మన్నేపల్లి సొసైటీ ఛైర్మన్‌గా గొంది రమణారెడ్డి(సమర), సభ్యులుగా కన్నెబోయిన శ్రీనివాసరావు, నవులూరి వీర రాఘవులు సోమవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే పాపారావు నూతన పాలక వర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పాపారావు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేసిన సీనియర్ నేత రమణారెడ్డి(సమర)ను చైర్మన్‌గా ఎంపిక చేయటం సంతోషకరంగా ఉందన్నారు. రైతులు సంక్షేమం కోసం పెట్టుబడి నిధులు రాయితీతో వ్యవసాయ పరికరాలను ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. కొత్తగా నియమితులైన పాలకవర్గ సభ్యులు, నిత్యం రైతులకు అందుబాటులో ఉండి వారికి మేలు జరిగేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం నూతన చైర్మన్ రమణారెడ్డి, సభ్యులును దుశ్శాలువాలు, పూలమాలతో సన్మానించారు. చైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి రావడానికి కృషి చేసిన దర్శి నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, కడియాల లలిత్ సాగర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మేడగం వెంకటేశ్వరరెడ్డి, గొల్లపూడి వేణుబాబు, నాగంబొట్లపాలెం సొసైటీ చైర్మన్ వల్లభనేని సుబ్బయ్య, ఎంపీడీఓ సానికొమ్ము సత్యం, దర్శి సహకార సొసైటీ సహకారాధికారి జిలాని భాషా, తూర్పు గంగవరం సొసైటీ బ్యాంకు మేనేజర్ మాధవరావు, సొసైటీ సీఈఓ అంజిరెడ్డి, నాయకులు ఇడమకంటి రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, షేక్ కాశీం సైదా, హనుమారెడ్డి, కైపు రామకోటిరెడ్డి, పాలెపోగు రాజు, శివ నాగిరెడ్డి, యాతం శ్రీనివాసరెడ్డి, నుసం ఆదినారాయణరెడ్డి, వీర నాగిరెడ్డి, రావినూతల పరిశుద్ధరావు, చాట్ల డాని, నాదెండ్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## పీఎం శ్రీ ద్వారా జీరో అకౌంట్ ఓపెన్



**తాళ్లూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త**
మండలంలోని తూర్పు గంగవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పీఎం శ్రీ ద్వారా విద్యార్థులకు జీరో అకౌంట్‌ను సోమవారం ప్రారంభించారు. పీఎంశ్రీ వకేషనల్ ఎడ్యుకేషన్ (బిఎఫ్ఎస్ఐ) కోర్సులో భాగంగా యూనియన్ బ్యాంక్‌ఆఫ్‌ఇండియాలో జీరో అకౌంట్‌ను ప్రారంభించారు. విద్యార్థులు అందరూ అకౌంట్స్ తీసుకోవాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు వైఎస్సార్ కే.ప్రసాద్, బిఎఫ్ఎస్ఐ ఒకేషనల్ ట్రైనర్ యర్రగొర్ల అంజిబాబు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## ఫోక్సో కేసులో నిందితుడికి 3 ఏళ్ల జైలు శిక్ష

**- రూ.7వేలు జరిమాన**

**హనుమంతునిపాడు, ఆగస్టు 25, ప్రభాతవార్త**
12 సంవత్సరాల మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి సోమవారం గౌరవ ఫోక్సో కోర్టు జడ్జి కే.శైలజ నిందితుడికి 3 సంవత్సరాల జైలు శిక్ష రూ.7వేలు జరిమాన వధించినట్లు ఎస్సై కే.మాధవరావు తెలిపారు. హనుమంతునిపాడు మండలానికి చెందిన మైనర్ బాలికపై అదే మండలానికి చెందిన ధనేకుల తిరుపతయ్య(55) అను వ్యక్తి 04-09-2000న మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంటిలో తల్లిదండ్రులు లేని సమయంలో వాళ్ళ ఇంటి వద్దనే ఉన్న వాళ్ల బంకులో బాధితురాలు ఒంటరిగా ఉన్న సమయంలో ముద్దాయి బంకు దగ్గరికి వచ్చి కూల్ డ్రింక్ అడిగి తీసుకొని, కూల్ డ్రింగ్ తాగిన తర్వాత, ఒక్క సారి నువ్వు బంకు లో నుండి బయటకు రమ్మని బాలికను పిలవగా, ముద్దాయి తెలిసినవాడు కావడంతో బాలిక బంకు నుండి బయటకు రాగానే, ఒక్క సారిగా ముద్దాయి ఒక చేతితో బాలికను నోరు మూసి, బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు బాధితురాలు భయంతో పెద్దగా అరవగానో, ముద్దాయి బాధితురాలిని వదిలివేసి అక్కడ నుండి పారిపోయాడని అదే రోజు సాయంత్రం 4 గంటలకు ఊరుకు వెళ్లిన తల్లిదండ్రులు ఇంటికి వచ్చేసరికి, ఏడుస్తున్న కూతురిని చూసి ఏమి జరిగిందని అడుగగా, బాధితురాలు జరిగిన విషయం తెలిపిందని వెంటనే వారు వెళ్ళి హనుమంతునిపాడు పోలీసు స్టేషన్‌లో రిపోర్టు ఇవ్వగా అప్పటి ఎస్సై వై.శ్రీహరి కేసు నమోదు చేయడం జరిగిందని, అప్పటి కనిగిరి సీఐ కే.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జ్ షిట్‌ను దాఖలు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం పోలీసులు సమయానుసారం సాక్షులను కోర్టు నందు హాజరు పరుచగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొట్టిపాటి శ్రీనివాసరావు, ప్రాసిక్యూషన్ తరుపున వాదించారు. జిల్లా ఎస్పీ మార్గదర్శకత్వంలో ప్రత్యేక ఫోక్సో మానిటరింగ్ టీం ద్వారా సమర్ధవంతంగా ట్రయల్ నడిపి సరైన సాక్షాదారాలతో నిందితుడుపై పలు సెక్షన్‌ల కింద నేర నిరూపణ చేయడంతో 25-08-2025 న ఒంగోలులో గౌరవ ఫోక్సో కోర్టు జడ్జి కే.శైలజ నిందితుడికి 3 సంవత్సరాలు జైలు శిక్ష రూ.7వేలు జరిమాన విధించినటులన ఆయన తెలిపారు. అదే విధంగా పై కేసులో ముద్దాయికి శిక్ష పడటంతో కృషి చేసిన అప్పటి కనిగిరి సీఐ కే.వెంకటేశ్వరరావుని ప్రస్తుతం ఉన్న కనిగిరి సీఐ ఖాజావలిని హనుమంతునిపాడు ఎస్సై మాధవరావు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొట్టిపాటి శ్రీనివాసరావు, కనిగిరి హెడ్ కానిస్టేబుల్ ఎస్‌కే హుస్సేన్‌ని, కోర్టు లైజన్ ఏఎస్సై ఈవీ స్వామి, కానిస్టేబుల్ ఎం.యల్లమందలను జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రత్యకంగా అభినందించినట్లు ఎస్సై తెలిపారు.

## వినాయక విగ్రహ ఏర్పాటుదారులు నిబంధనలు పాటించాలి



**టంగుటూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త**
టంగుటూరు మండల పరిధిలో వినాయక విగ్రహాల కమిటీ సభ్యులకు ఎస్సై నాగమల్లేశ్వరరావు సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండపాల వద్ద మత్తు పానీయాలు సేవించకూడదన్నారు. నిమజ్జన సమయంలో తాము చెప్పిన రూటును మాత్రమే వెళ్లాలని రూటు మార్చకూడదు అని చెప్పారు. అసభ్యకరమైన నృత్యాలు, డ్యాన్సులు పూర్తిగా నిషేద్ధమని హెచ్చరించారు. మండపాల వద్ద మత విధ్వేషాలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడకూడదన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో నిమజ్జన కార్యక్రమం జరిగేలా చూడాల్సిన బాధ్యత కమిటీ వారిపై ఉందన్నారు.

## కంభం చెరువులోకి పల్టీలు కొట్టిన కారు





**కంభం, ఆగస్టు 25, ప్రభాతవార్త**
కంభం చెరువును సందర్శించేందుకు హైదరాబాదు నుంచి సోమవారం వచ్చిన పర్యాటకుల కారు కట్టపై రివర్స్ చేస్తుండగా ప్రమాదవశాత్తు చెరువులోకి పల్టీ కొట్టింది. బేస్తవారిపేట పట్టణంలో బంధువుల ఇంట జరుగుతున్న వేడుకకు హాజరయ్యేందుకు హైదరాబాదు నుండి వెంకటేశ్వర రెడ్డి అనే వ్యక్తి వచ్చాడు. కంభం చెరువును చూడాలని తన కారులో ముగ్గురు వ్యక్తులతో కలిసి వచ్చి కట్టను తిలకించిన అనంతరం తిరిగి వెళ్ళేందుకు డ్రైవర్ కారును రివర్స్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి చెరువులోకి దొర్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కారునుంచి కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. ప్రమాదంలో అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

## హత్యకేసులో ముద్దాయిలు అరెస్టు..

**- తదుపరి దర్యాప్తు కోసం బైకు స్వాధీనం చేసుకున్న పోలీసులు**



**మార్కాపురం రూరల్, ఆగస్టు 25, ప్రభాతవార్త**
పట్టణంలోని మార్కెట్ యార్డు జంక్షన్ వద్ద పారిపోవటానికి సిద్ధంగా ఉన్న హత్యకేసులో ముద్దాయిలుగా ఉన్న ఇరువురిని అరెస్టు చేసి అనంతరం దర్యాప్తు కోసం వారి వద్ద ఉన్న బైకును స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక పోలీసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 9వ తేదీ ఉదయం పట్టణంలోని సత్యనారాయణ స్వామి గుడి దగ్గర గోగిరెడ్డి కాశయ్య అనే వ్యక్తిని మార్కెట్ నుంచి తన ఇంటికి వెళుతుండగా ఆవుల నాగేంద్ర, చళ్ళ శ్రీనివాసులు ఇరువురు యువకులు బైకుపై వెళుతూ కాలు తగలడంతో కాశయ్యను చూసుకుని బైకుపై వెళ్ళాలి కదా అని ప్రశ్నించారు. దానికి కోపగించిన యువకులు ఆ వ్యక్తిని కాళ్ళతో తన్ని తలభాగం రోడ్డుపై తగిలే విధంగా కొట్టగా తలకు అంతర్లీనంగా గాయాలతో గుంటూరు అమరావతి ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. అనంతరం మరణించారని, అతనిపై గోగిరెడ్డి వెంకట సుబ్బమ్మ ఫిర్యాదు చేశారు. డిఎస్‌పి యు నాగరాజు ఆదేశాలతో సిఐ సుబ్బారావు పర్యవేక్షణలో ఎస్సైలు ఎం సైదుబాబు, రాజమోహన్ రావు, అంకమరావు, పోలీస్ సిబ్బందితో బృందాలుగా ఏర్పడి గాలిస్తూ పారిపోవటానికి సిద్ధంగా ఉన్న ముద్దాయిలను ఆగస్టు 25న అరెస్టు చేశామని మార్కాపురం ఏజే ఎఫ్‌సిఎం కోర్టుకు రిమాండుకు పంపవలసి ఉన్నదని ఎస్సై తెలిపారు. యువకులు గంజాయి సేవించి ఆ మత్తు వలననే వ్యక్తి చావుకు కారణమయ్యారని గంజాయి మత్తులో యువకులు రెచ్చిపోతున్నట్లు తరచూ దాడులు నిర్వహిస్తున్నారని, గంజాయిని అరికట్టడంలో పోలీస్ యంత్రాంగం వైఫల్యం అవుతుందని బయట బహిరంగంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. కానీ పోలీస్ శాఖ నుంచి అధికారిక ప్రకటన రాలేదు.

## నిష్ గ్రూప్స్ ఛైర్మన్ హరిశారాన్ దేవగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అప్పిశెట్టి

**గిద్దలూరు, ఆగస్టు 15 ప్రభాతవార్త**
నిష్ గ్రూప్స్ ఛైర్మన్ హరిశారాన్ దేవగన్ జన్మదినం సందర్భంగా భారతీయ జనతాపార్టీ గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిశారాన్ దేవగన్ ఆయురారోగ్యాలతో మరెన్నో పుట్టినరోజులు జరుపుకుంటూ ప్రజా సేవలో, వ్యాపార రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నట్లు ఉదయ్ శంకర్ తెలిపారు.

## కంభంలో చోరీ



**కంభం, ఆగస్టు 25 ప్రభాతవార్త**
కంభం పట్టణంలో ఇంటికి తాళం వేసిన గృహంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. అందిన సమాచారం మేరకు పట్టణంలోని షిర్డీ సాయి నగర్‌లో నివాసం ఉంటున్న భాస్కర్ తన కుటుంబంతో కలిసి ఆదివారం అర్ధవీడు లోని బంధువుల ఇంటికి వెళ్ళగా ఇంటికి తాళం వేసిన విషయాన్ని గమనించిన దొంగలు ఇంటిలోకి చొరబడి బీరువాలోని వస్తువులను చల్లాచెదురుగా వేసి అందులోని 2జతల కమ్మలు, 10తులాల బంగారు రూ.15వేల నగదు చోరీ చేసినట్లు తెలిసింది. సమాచారమందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నింగి ఊడి నేలమీద పడిందా..!

**- వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా మాలపాటి వెంకటరెడ్డి ప్రమాణ స్వీకారం..**

**- తరలివచ్చిన అఖండ ప్రజానీకం.. - పసుపుమయంగా మారిన ప్రాంగణం**

**మార్కాపురం రూరల్, ఆగస్టు 25 ,ప్రభాతవార్త**
మార్కాపురం పట్టణ ప్రధాన రహదారులన్నీ అడుగడుగునా తెలుగుదేశంపార్టీ పెద్దలు, మంత్రుల, జిల్లాలోని శాసనసభ్యుల, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి సోమవారం వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా మాలపాటి వెంకట రెడ్డి, పాలకవర్గం డైరెక్టర్‌ల పదవీ ప్రామాణ స్వీకారోత్సవ కార్యక్రమం కోసం ఫ్లెక్సీలతో పసుపుమయంగా మారి అందరినీ అబ్బురపరచాయి. ఊరంతా టిడిపి శ్రేణులు పండుగలా చేసుకున్నారు. మునుపెన్నడూ ఇలా జరగలేదని పలువురు మాట్లాడుకోవడం గమనార్హం. శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి పిలుపు మేరకు టిడిపి శ్రేణులు సాయంత్రం 4 గంటలకు బైక్ ర్యాలీ చేసుకుంటూ అశేష జనవాహినితో, నినాదాల మధ్య అత్యంత ఉత్సాహంతో మార్కెట్ యార్డు ఆవరణంలో ఏర్పాటు చేసిన సభాప్రాంగాణానికి చేరుకున్నారు.

## మహిళా పోలీసులతో సమీక్ష



**తాళ్లూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త**
మండలంలోని సచివాలయ మహిళా పోలీసులతో ఇన్‌ఛార్జీ ఎంపీడీఓ సానికొమ్ము సత్యం సోమవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని చిన్నారుల ఆధార్‌కార్డుల నమోదు, సిటిజన్స్, ఈకేవైసీ, వర్క్‌ఫ్రమ్ హోమ్ నుండి పనులు చేస్తున్న ఉద్యోగుల డేటా, బంగారు బాల్యం గురించి సమీక్ష నిర్వహించారు. తగిన సూచనలు చేశారు. ఏఎస్సై మోహన్‌రావు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులో 12 మందికి జరిమాన

**హనుమంతునిపాడు, ఆగస్టు 25, ప్రభాతవార్త**
మద్యం సేవించి వాహనాలు నడిపిన 12 మందిని హనుమంతునిపాడు ఎస్సై కే.మాధవరావు అదుపులోకి తీసుకొని సోమవారం గిద్దలూఉ కోర్టులో హాజరు పరచగా కనిగిరి అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి వారికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమాన విధించడం జరిగిందని ఎస్సై తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడితే అలాంటి వారిపై జరిమానా, జైలు శిక్షలు విధించం జరుగుతుందని ప్రజలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని ఆయన సూచించారు.

## రియాజ్‌కు శుభాకాంక్షలు తెలిపిన దామచర్ల సత్య



**టంగుటూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త**
ఒంగోలులోని ఏ1 కన్వెన్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన షేక్ రియాజ్ ఒంగోలు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటి చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ జనసేన

**ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ అభినందనలు తెలిపిన జనసైనికులు**



**సంతమాగులూరు ,ఆగస్టు 25,ప్రభాతవార్త**
ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ సోమవారం జిల్లాలోని పలవురు జనసైనికులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా సెక్రటరీ చల్లా వెంకట కృష్ణారావు, గోరంట్ల సాయి,మండల అధ్యక్షులు సాదు వెంకటేష్, మోరగుండి రామకోటేశ్వరావు, సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ మేడా రేణుకేశ్వరరావు, తోట కృష్ణ ఇమడా బత్తిని వెంకటేశ్వరరావు, వీర మహిళ అన్నపూర్ణ గారు రియాజ్ ను కలిసి శుభాకాంక్షలు అందజేయడం జరిగింది

8_8.qxd 8/26/2025 12:21 AM Page 1



## వధూవరులను ఆశీర్వదించిన దద్దాల నారాయణ యాదవ్



**కనిగిరి, ఆగష్టు 25, ప్రభాతవార్త**
పీసీపల్లి మండలం పిల్లివారిపల్లిలో మోరబోయిన సురేంద్ర - జయమ్మ దంపతుల కుమార్తె సుప్రజ వివాహ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కనిగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణ యాదవ్ నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.వివాహ వేడుకలో గోపవరపు బొరారెడ్డి,ఒకే రెడ్డి,మేకల మాల్యాద్రి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, కటికల వెంకటరత్నం, సైకం ఏడుకొండలరెడ్డి, యర్రంరెడ్డి మోహన్‌రెడ్డి, భూమిరెడ్డి కొండారెడ్డి, మూలే రాజశేఖర్‌రెడ్డి, సూర మాల్యాద్రిరెడ్డి, మైల కొండయ్య, శీలం సుదర్శన్, పడుచూరి రమేష్ గౌడ్, బోగాల నరసారెడ్డి, పోలక సుధాకర్‌రెడ్డి, గోపిరెడ్డి రోసిరెడ్డి తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## ఒడా ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన షేక్ రియాజ్‌కు ఘన సన్మానం



**కనిగిరి, ఆగష్టు 25, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా జనసేన అధ్యక్షులు షేక్ రియాజ్ సోమవారం ఒంగోలు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ(ఒడా) ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయనను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధనరావు ఘనంగా సన్మానించారు. రియాజ్ నాయకత్వంలో ఒడా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పేద, వెనుకబడిన వర్గాలకు ఉపయోగపడేలా కృషి చేస్తారని జనార్ధనరావు నమ్మకం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రియాజ్ తన ప్రతిభను వినియోగించి సమాజానికి మరింత సేవ చేయాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సన్మాన కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## సోలార్ క్రాప్ డ్రైయర్లతో ఉద్యాన రైతులకు రెట్టింపు లాభాలు

### - ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ

**కనిగిరి, ఆగష్టు 25, ప్రభాతవార్త**
ఉద్యాన పంటలను పండించే రైతులకు సోలార్ క్రాప్ డ్రైయర్లు 40 శాతం రాయితీతో అందుబాటులో ఉన్నాయని కనిగిరి ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ తెలిపారు. హార్టికల్చర్ పంటలు అయిన పండ్లు, కూరగాయాలు, పూలు, మసాల పంటలు త్వరగా పాడైపోయే స్వభావం కలిగి ఉండటంతో, సహజ ఎండలో ఆరబెట్టే సమయంలో నాణ్యత తగ్గిపోవడం, పురుగులు, పక్షులు, దూళి కారణంగా రైతులు నష్టపోతున్నారని ఆమె పేర్కొన్నారు. వర్షాకాలంలో ఎండ లేకపోవడం వల్ల నిల్వ సమస్యలు మరింత ఎక్కువవుతాయని వివరించారు.ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం సోలార్ క్రాప్ డ్రైయర్ అని ఆమె స్పష్టం చేశారు చిన్న,మధ్యస్థ,పెద్ద స్థాయిలలో లభ్యమయ్యే ఈ డ్రైయర్ల ద్వారా పండ్లు, కూరగాయాలు, మసాలాలు, పూలు, ఔషధ మొక్కలను నాణ్యత కోల్పోకుండా ఆరబెట్టి విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి మంచి ధరలకు విక్రయించవచ్చు అన్నారు. సాంప్రదాయ పద్దతితో పోలిస్తే సోలార్ క్రాప్ డ్రైయర్ వాడితే 20 నుండి 30 శాతం వరకు పంటల కోత అనంతరం జరిగే నష్టాలు తగ్గి, రైతులకు 15 నుండి 25 శాతం అదనపు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. నిల్వ కాలం కూడా రెట్టింపు అవుతుందని తెలిపారు. ప్రత్యేకంగా కనిగిరి నియోజకవర్గంలో ఎక్కువగా పండించే నిమ్మ, బత్తాయి పంటలను ఆఫ్ సీజన్ సమయంలో తక్కువ ధరకు అమ్మాల్సిన పరిస్థితి ఉన్నా, ఈ సోలారన క్రాప్ డ్రైయర్ సాయంతో వాటిని డ్రై ప్రొడక్టులుగా మార్చి అధిక ధరలకు విక్రయించి రైతులు లాభాలు పొందవచ్చని ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ వివరించారు. ఇతర వివరాల కోసం రైతులు తమ పరిధిలోని రైతుసేవ కేంద్ర సిబ్బందిని లేదా ఉద్యానశాఖ అధికారిని సంప్రదించాలని ఆమె సూచించారు.

## ఆరోగ్యం కోసం వచ్చిన రోగులకు ఆహార భరోసా

### - స్నేహహస్తం ట్రస్టు అండగా



**కనిగిరి, ఆగష్టు 25, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో సోమవారం స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రోగులకు ఉచితభోజన వసతి కల్పించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, డయాలసిస్ పేషెంట్లు, వారి బంధువులు, అనాధులు ఈ సదుపాయం పొందుతూ సంతోషం వ్యక్తం చేసి,ట్రస్టు సభ్యులను హృదయపూర్వకంగా ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు సుధీర్‌బాబు మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చడం, బలహీన వర్గాల భారం తగ్గించడం మా ట్రస్టు ప్రధాన లక్ష్యం. మానవత్వమే మహాధర్మం, ప్రతి ఒక్కరూ సాటి మానవుల పట్ల జాలి, దయ, కరుణతో ముందడుగు వేస్తే సమాజంలో ఎవరు ఆకలితో బాధపడరని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్నేహహస్తం సభ్యులు మోహన్, శంకర్,మీరా మొహిద్దిన్ తదితరులు పాల్గొన్నారు. తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ప్రజల అవసరాన్ని గుర్తించి స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు చేపట్టిన ఈ భోజన వసతి కార్యక్రమం మానవతా విలువలకు నిదర్శనంగా నిలిచి, స్థానికుల ప్రశంసలు అందుకుంది.

## మానవత్వం చాటుకున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణ యాదవ్



**పామూరు, ఆగష్టు 25, ప్రభాతవార్త**
పామూరు కరెంటు ఆఫీసు కాలనీకి చెందిన పార్టీ కార్యకర్త షేక్ సద్దాం కొంత కాలంగా పక్షవాతం, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమైన విషయం తెలుసుకొని ఈ రోజు అతనిని పరామర్శించి రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్న కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్. అనంతరం వారి కుటుంబ సభ్యులను అడిగి చికిత్సకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకుని అండగా ఉంటానని భరోసా కల్పించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చప్పిడి సుబ్బయ్య, కల్లూరి రామిరెడ్డి, యాదాల సాయి కిరణ్, గట్ల విజయభాస్కర్‌రెడ్డి అంబటి కొండారెడ్డి, షేక్ చాంద్ భాషా, షేక్ నాయబ్ రసూల్, ఇర్రి కృష్ణారెడ్డి, చెనికల శ్రీనివాసులు, శ్రీరామ శ్రీనివాసులు, షేక్ కాలేషా, ఎం80 నాయబ్ రసూల్, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, కటికల వెంకటరత్నం, సైకం ఏడుకొండలురెడ్డి, మర్రి రాజు, రాచకొండ మహేంద్ర, షేక్ నాగూర్ భాష, పోలేపల్లి సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముక్కు కవిత జన్మదిన వేడుకల్లో పాల్గొన్న యారవ





**పామూరు, ఆగష్టు 25, ప్రభాతవార్త**
పామూరు స్థానిక పంచాయతీ కార్యాలయంలో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సతీమణి డాక్టర్‌ముక్కు కవిత జన్మదిన వేడుకలు నరసింహారావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.ముందుగా పంచాయతీ ఈవో అరవింద్‌రెడ్డి కేక్‌కట్ చేశారు. అనంతరం కనిగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ యారవ రమా శ్రీనివాస్ చేతుల మీదుగా కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యారవ శ్రీనివాస్ వైస్ ఛైర్మన్ పాలపర్తి రమణయ్య, పంచాయతీ ఈవో అరవింద్‌రెడ్డి, పామూరు టౌన్ అధ్యక్షులు షేక్ అమీర్‌బాబు, ఉపాధ్యక్షులు ఇర్రి కోటిరెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు మెంటా నరసింహారావు,సాంబ,షేక్ గౌస్ భాషా, నరసింహులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యోసోబుకు ఆర్థిక సాయం అందజేత



**దర్శి, ఆగష్టు 25, ప్రభాతవార్త**
దర్శి ఎమ్మార్సీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న యోసోబు అనారోగ్యానికి గురై ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నందున సహృదయంతో ఆలోచించి జడ్పీహెచ్ఎస్ కొత్తపల్లి ప్రధానోపాధ్యాయులు ఎస్.కిరణ్ కుమార్,ఉపాధ్యాయుల సహాయ సహకారాలతో దర్శిమండల విద్యాశాఖ అధికారులు కే.రఘురామయ్య, బి.రమాదేవి ద్వారా రూ.5500లను యోసోబుకు ఇవ్వడమైంది .ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్.కిరణ్‌కుమారి, ఉపాధ్యాయులు వి.జనార్ధన్‌రెడ్డి, ఐవీఎల్ నారాయణ, వి.రెడ్డి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ మాగుంటను కలిసిన టీడీపీ నాయకులు



**దర్శి, ఆగష్టు 25, ప్రభాతవార్త**
ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డిని సోమవారం ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో పలువురు టీడీపీ నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.సన్మానించిన వారిలో ఉల్లగల్లు మాజీ సర్పంచ్ కొండవీటి సుబ్బారావు, టీడీపీ నాయకులు అంబటి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పలు వివాహ శుభ కార్యక్రమాల్లో పాల్గొన్న డాక్టర్ కడియాల లలిత్ సాగర్





**దర్శి, ఆగష్టు 25, ప్రభాతవార్త**
దర్శి పట్టణం ఎస్సీ కాలనీలో పలు శుభ కార్యక్రమాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేసిన టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్. వారితో పాటు మార్కెట్ యార్డు ఛైర్మన్ దారం నాగవేణి-సుబ్బారావు, దర్శి మండల టీడీపీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, దర్శి మున్సిపల్ వైస్ ఛైర్మన్ గర్నిపూడి స్టివెన్, కౌన్సిలర్ ఇత్తడి సునీల్- దినకర్, అనిల్, క్లస్టర్లు, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గంలోని వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కూటమి శ్రేణులు ఉన్నారు.

**పరామర్శ :**
దర్శి పట్టణంలోని ఎస్సీ కాలనీలో సోమవారం అనారోగ్యంతో మృతి చెందిన ఇత్తడి లుధియా, గుడ్డుపల్లి సల్మాన్‌లు కుటుంబాలను పరామర్శించిన టీడీపీ యువనాయకులు డాక్టర్‌కడియాల లలిత్ సాగర్.

**వివాహ వేడుకల్లో లలిత్ సాగర్ :**
మండలంలోని జముకులదిన్నె గ్రామంలో సోమవారం సాయి కిరణ్ వివాహ వేడుకల్లో టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీయాలి

### - డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, ఆగష్టు 25, ప్రభాతవార్త**
ఒంగోలులోని ఏ1 కన్వెన్షన్ హాల్‌లో సోమవారం జనసేన జిల్లా పార్టీ అధ్యక్షులు, మరందరి సుపరిచితులు షేక్ రియాజ్ నేడు ఒంగోలు డవలప్‌మెంట్ అథారిటి ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయడం కూటమి ప్రభుత్వంలో ఒక శుభ పరిణామం. గత ఐదేళ్ల వైసీపీ పాలనకు ఎదురొడ్డి పోరాడిన రియాజ్ అన్న లాంటి వారికి మన కూటమిలో తగిన గుర్తింపు లభించిందని ఈ సందర్భంగా దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ లక్ష్మీ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 15 నెలల కూటమి పాలనలో ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తూ విధ్వంసం నుండి వికాసం వైపు అడుగులు వేస్తున్నాం, కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తూ మంచి ప్రభుత్వంగా ప్రజలందరి దీవెనలు అందుకుంటున్న కూటమి జోరుతో ప్రతిపక్ష వైసీపీ ఇక జెండా మూసుకునే రోజులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను తినండి మంచి ఆరోగ్యం పొందండి

### - ఎమ్మార్వో లక్ష్మీ నారాయణ



**ముండ్లమూరు, ఆగష్టు 25, ప్రభాతవార్త**
సోమవారం ముండ్లమూరు ఎమ్మార్వో ఆఫీసు ఆవరణంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో స్టాల్ ఏర్పాటు చేశారు. ఎండీఓ శ్రీదేవి, ఎమ్మార్వోలక్ష్మీనారాయణ, ఏవో తిరుమలరావు సందర్శించడం జరిగింది. కూరగాయాలు ఆకుకూరలు కొనుగోలు చేశారు. ప్రజలను ఉద్దేశించి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను తినడం వల్ల అందరి ఆరోగ్యం బాగుంటుందని ఉత్పత్తులను ప్రోత్సహించడం వల్ల మరింత మంది రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తారని తద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుంది భూమి ఆరోగ్యం మెరుగుపడుతుంది,రసాయరహిత వ్యవసాయాన్ని ప్రోత్సహించడం వల్ల క్యాన్సర్ మధుమేహం వంటి జబ్బుల నుండి విముక్తి కలుగుతుంది కావున ప్రతి ఒక్కరు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని మాట్లాడారు.ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ శ్రీదేవి, ఎమ్మార్వో ఆదినారాయణ, ఏవో తిరుమలరావు, ఎంటీ ప్రభాకర్, ఇతర ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్‌జిల్లా సాఫ్ట్‌బాల్ సీనియర్ మహిళా జట్టు ఎంపిక



**దర్శి, ఆగష్టు 25, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా సీనియర్ సాఫ్ట్‌బాల్ మహిళా జట్టుకు ఎంపిక ఏడుగుండ్లపాడులోని శ్రీహర్షిణి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగింది.జడ్పీహెచ్ఎస్ ఉమామహేశ్వరపురం పాఠశాల విద్యార్థినులు 8 మంది ఎంపిక కాబడ్డారు. ఎంపిక కాబడిన వారి పేర్లు బి.భావన(పదో తరగతి), బి.కీర్తన(10వ తరగతి), బి.భాగ్యశ్రీ(8వ తరగతి), సీహెచ్ హరిప్రియ(8వ తరగతి), ఎన్.ప్రణతి(9వ తరగతి), జి.తేజస్విని(9వ తరగతి),సీహెచ్‌మాధురి(9వతరగతి),బి.భవాని(7వతరగతి).విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.మాధవి,వ్యాయామ ఉపాధ్యాయులు పి.తిరుపతిస్వామి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

## బ్యాంక్ అకౌంట్‌లోని నగదును కాజేసిన సైబర్ నేరగాళ్లు

**దర్శి, ఆగష్టు 25, ప్రభతవార్త**
సైబర్ నేరగాళ్ల మోసానికి దర్శి టౌన్, పుచ్చమిట్టకు చెందిన శింగంపల్లి వెంకట నారాయణ మోసపోయినట్లు బాధితుడు ఒక ప్రకటనలో తెలిపారు. బాధితుడు తెలిపిన ప్రకారం దర్శి టౌన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ అకౌంట్ నుండి రూ.20వేలు నగదును ఆన్‌లైన్ ద్వారా సైబర్ నేరగాళ్లు ఫింగర్ ప్రిట్‌తో విత్‌డ్రా చేసినట్లు తెలిపారు. బాధితుడికి విషయం తెలుసుకొని బ్యాంకుకు వెళ్లి బ్యాంక్ మేనేజర్‌కి కంప్లైంట్ చేసి అకౌంట్ లాక్ చేసినట్లు తెలిపారు. బ్యాంకులలో దాచుకున్న నగదుకు సైబర్ నేరగాళ్లమోసానికి ప్రజలుబలైతే,ఇక బ్యాంకులలో డబ్బులుసేవింగ్ చేయడానికి ప్రజలు భయపడతారని, బ్యాంకు అంటేనే అభద్రతా భావం ప్రజల్లో కలుగుతుందని బాధితులు అవేదన వ్యక్తం చేశారు.

## చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దు



**నాగులుప్పలపాడు, ఆగష్టు 25, ప్రభాతవార్త**
నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామం నందు జడ్పీ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులకు ఒంగోలు రూరల్ సర్కిల్ పోలీసుల తరుపున సైబర్ క్రైమ్, డ్రగ్స్,ట్రాఫిక్, మహిళలు, బాలికలు మీద జరుగుతున్న నేరాల మీద అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాత్ బాబు, నాగులుప్పలపాడు ఎస్సై ఎస్‌కే రిజియాసుల్తానా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పుగుండూరు గ్రామంలోగల ఆక్స్‌ఫర్డ్, ఆర్‌వీవీ, సరస్వతి హైస్కూల్ టీచర్‌లు, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన దాదాపు 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, లిక్కర్ మొదలైన మత్తు పదార్థాలు జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని తెలియజేశారు.అదే విధంగా ఈ మధ్య జరుగుతున్న వివిధ రకాలైన సైబర్ నేరాలు మీద ప్రసంగించారు. వారికి ఏదైనా సైబర్ నేరం జరిగిందని తెలిపిన వెంటనే 1930కి కాల్ చేయమని తెలియజేశారు. అదే విధంగా ట్రాఫిక్‌లో ద్విచక్ర వాహనం మీద వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలియజేశారు. ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరాలు భారిన పడితే వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలన్నారు. అదే విధంగా పిల్లల మీద అత్యాచారాలు చేస్తే కఠినంగా చర్యలు తీసుకోబడునని తెలిపారు.

## ఘనంగా కొండపాటి పోలేరమ్మ పొంగళ్లు వేడుకలు



**సంతనూతలపాడు, ఆగష్టు 25, ప్రభాతవార్త**
సంతనూతలపాడులో కొండపాటి పోలేరమ్మ పొంగళ్ళు వేడుకలు ఘనంగా జరిగింది. సంతనూతలపాడులోని ట్యాంక్ నందు గల వడ్డెర సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభపై పోలేరమ్మకు గ్రామోత్సవం నిర్వహించారు. తంబళ్లగుంట వాగు వద్ద గల పోలేరమ్మకు, సంతనూతలపాడులోని పెద్ద చెరువులో గల పోలేరమ్మకు మహిళలు భారీ ఎత్తున పొంగళ్ళు సమర్పించారు. ఆదివారం రాత్రి నుండి సోమవారం వరకు విద్యుత్ ప్రభ నందు పోలేరమ్మకు సంతనూతలపాడు పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ముంఖ్యంగా పురుషులు, మహిళలు వేషధారణలతో విద్యుత్ ప్రభ వద్ద చిందులు తొక్కారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, భద్రాచలం, రామగుండం, తదితర ప్రాంతాల నుండి వడ్డెర సంఘ నాయకులు భారీగా తరలివచ్చారు. సంతనూతలపాడులో ఈ వేడుకలు ఒక పండుగ వాతావరణంలో జరిగాయి.

## ఒంగోలు అర్భన్ డవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ షేక్ రియాజ్ అభినందనలు



**చీరాల, ఆగష్టు 25, ప్రభాతవార్త**
ఒంగోలు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటి ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన జనసే పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్‌కి చీరాల నియోజకవర్గ జనసేన నాయకులు ఘనంగా అభినందనలు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ ఒంగోలు అర్భన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్‌గా షేక్ రియాజ్ బాధ్యతలు స్వీకరించడం చీరాల పరిసర ప్రాంతాల అభివృద్ధికి మేలునిచ్చే అవకాశమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పట్టణ ప్రాంత సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల వేగవంతం దిశగా ఛైర్మన్ చర్యలు తీసుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గూడూరు శివరాం ప్రసాద్, వేటపాలెం మండల అధ్యక్షుడు దుగ్గిరాల మార్కండేయులు, సెంట్రల్ ఆంధ్ర జోన్ కమిటీ సభ్యులు తోట రాజ్ కుమార్, కదలి లక్ష్మణ్, ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యురాలు లక్కాకుల లక్ష్మీ, కనపర్తి రామారావు, లక్కాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రంను సందర్శించిన జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త



**వేటపాలెం, ఆగష్టు 25, ప్రభాతవార్త**
వేటపాలెం మండలంలోని నాయనపల్లి తూర్పు నందు గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంను సోమవారం బాపట్ల జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త ఎం.జోత్స్న సందర్శించారు. భవిత కేంద్రంకు సంబంధించిన అన్ని రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. భవిత కేంద్రం ద్వారా లబ్ధి పొందుతున్న చిన్నారులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శోభా దేవి, ఫిజియోథెరపిస్ట్ కే.చైనయ, ఎస్.ధనలక్ష్మీ, ఆర్.శ్రీధర్, బి.సారమ్మ పాల్గొన్నారు.

## పార్లమెంటరీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దులూరి



**చీరాల, ఆగష్టు 25, ప్రభాతవార్త**
బాపట్లలో నిర్వహించిన పార్లమెంటరీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య,మంత్రి అనగాని సత్యప్రసాద్,గొట్టిపాటి రవికుమార్,శాసనమండలి సభ్యులు,చీఫ్‌విప్ పంచుమర్తిఅనురాధ,జిల్లా ఎమ్మెల్యేలు నరేంద్ర వర్మ, ఆనంద్‌బాబు,వజియ్‌కుమార్, తెలుగు దేశంపార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు, ముఖ్య నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశీలకులతో కలిసి పార్లమెంట్ కమిటీ, అనుబంధ కమిటీ, సాధికార కమిటీల నుంచి ప్రతిపాదనలను స్వీకరించడం జరిగింది. కమిటీల ప్రతిపాదనలను పార్లమెంట్ పరిశీలకులు అధ్యయం చేసి అధిష్టానానికి నివేదిస్తారు. బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని తిరుగులేని శక్తిగా మల్చేందుకు కలిసికట్టుగా పని చేయాలని నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్ధేశం చేయడం జరిగింది.

## ఎరువుల దుకాణాలపై అధికారుల ఆకస్మిక తనిఖీ



**వేటపాలెం, ఆగష్టు 25, ప్రభాతవార్త**
వేటపాలెం మండల పరిధిలో గల ఎరువులు దుకాణాలపైసోమవారం నాడురెవెన్యూ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మండల తహశీల్దార్ గోపికృష్ణ వ్యవసాయ అధికారి సరిత ఉమ్మడిగా పలు షాపులు తనిఖీ చేసి రికార్డులు లైసెన్సులు పరిశీలించారు. ప్రతి దుకాణదారుడు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, రైతులు అవసరమైన అంత వరకు ఎరువులు తీసుకోవాలని, ఎరువులను ఎమ్మార్పీ ధలకే రైతులకు అందజేయాలని సూచించారు. ఈ తనిఖీలలో తహశీల్దార్, వ్యవసాయ అదికారితో పాటు రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## సెయింట్ ఆన్స్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదానం

### - వంద మంది విద్యార్థులు రక్తదానం



**వేటపాలెం, ఆగష్టు 25, ప్రభాతవార్త**
సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫన ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో సోమవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులు రక్తదానం చేసినట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం వారి ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీస్ వారి సహకారంతో నిర్వహిస్తున్న ఈ రక్త దాన శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.జగదీష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్ల రక్తదానం మిన్న, ప్రాణదానంతో సమానమని విద్యార్థులకు తెలియజేశారు. రక్తదానానికి విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం దోహదపడుతుందన్నారు. ఈ రక్తదాన శిబిరం నందు 100 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో చీరాల ఏరియా ప్రభుత్వ వైద్యశాల బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ కే.నాగిరెడ్డి, వారి సిబ్బంది పాల్గొన్నారు. ఈ రక్తదాన శిబిరంను ఎన్ఎస్ఎస్ ఫ్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ డి.జ్యోతి స్వరూప్, ఎస్ఎస్‌కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

## మూడేళ్ల పాపను హింసించిన కేసులో వ్యక్తికి జైలు, జరిమాన

**నాగులుప్పలపాడు, ఆగష్టు 25, ప్రభాతవార్త**
మూడు సంవత్సరాల పాపని హింసించిన కేసులో వ్యక్తికి రెండు సంవత్సరాలు జైలు, రూ.10వేలు జరిమానను ఒంగోలు స్పెషల్ జేఎఫ్‌సీఎం ఎక్సైజ్ కోర్టు వారు శిక్ష విధించారు. నిందితులకు శిక్ష పడటంలో సమర్ధవంతంగా విధులు నిర్వహించిన పోలీసుఅధికారులను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించిన ప్రకాశం జిల్లా ఎస్పీఏఆర్ దామోదర్.నాగులుప్పలపాడు మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన భూపతి సుధీర్ ఆంజనేయులు(32)అను అతను అదే గ్రామానికి చెందిన చంద్రావతి అను ఆమెతో సన్నిహిత సంబంధం పెట్టుకొని ఆమె పాప జయాస్ ఏంజెల్ మూడు సంవత్సరాలు అను అమ్మాయి అడ్డుగా ఉందని నిరంతరం కొట్టుతూ చిత్రహింసలకు గురి చేయడంతో శిశు సంరక్షణ శాఖ అధికారి పురుషోత్తమరావు ఫిర్యాదు మేరకు సదరు విషయం గురించి నాగులుప్పలపాడు పోలీసు స్టేషన్ నందు అప్పటిస్టేషన్ ఎస్‌హెచ్ఓ కే.పాండురంగారావు కేసు నమోదు చేయగా అప్పటి నాగులుప్పలపాడు ఎస్సైఏ.శశికుమార్ అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేపట్టి నిందితుడిపై చార్జ్‌షీట్ కోర్టులో దాఖలు చేశారు.

## కార్పొరేట్‌మయం వ్యవసాయం దూరం




**నాగులుప్పలపాడు, ఆగష్టు 25, ప్రభాతవార్త**
దేశ ప్రజలకు అన్నం పెట్టే రైతన్నలను వ్యవసాయానికి దూరం చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్‌లకు భూములను కట్టబెట్టే విధంగా అవలంభిస్తున్నారని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జే.జయంతిబాబు, పమిడి వెంకటరావులు తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన నాగులుప్పలపాడులో రైతు సంఘం మండల 3వ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జయంతిబాబు, వెంకటావు మాట్లాడుతూ పరిశ్రమల పేరుతో రాష్ట్రంలో వేలాది ఎకరాలు కార్పొరేట్‌లకు దారాదత్తం చేశారని విమర్శించారు. ఆ భూముల్లో ఎక్కడ ఒక్క ఫ్యాక్టరీని స్థాపించిన దాఖలాలు లేవన్నారు. ఆ భూములను కార్పొరేట్ సంస్థలు బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు పొంది వ్యాపారులు చేస్తున్నారన్నారు. తిరిగి వారికే ప్రభుత్వం వేలాది కోట్లు రుణమాఫీ చేస్తుందని విమర్శించారు. అదే రుణమాఫీ రైతులకు ఉన్న అన్ని అప్పులు ఒక్క పర్యాయం రద్దు చేసి వ్యవసాయాన్ని కాపాడాలని రైతు సంఘాలు కోరుతున్నప్పటికి ఆ వైపుగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా టి.శ్రీకాంత్, రావెళ్ళ వెంకటరావు, మెంబర్లుగా దాసరి ఆంజనేయులు, పి.హనుమంతరావు, పి.జనార్ధన్, పాలపర్తి యోనా, చుండూరి శ్రీరామ్మూర్తి, జట్టి హాజరత్తయ్య, జే.సుబ్బారెడ్డి, కాకాని సుబ్బారావు, గడ్డం ఏలియ, గాదె నాగేశ్వరరావు,నార్నె చెంచయ్య,మారెళ్ళ వెంకటరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

26-8Pg5 9 th pg_26-8Pg5.qxd 8/25/2025 10:21 PM Page 1



# 30 రోజుల్లో బెయిలు లేదా రాజీనామా



## అరెస్టయితే ప్రధానికైనా, ముఖ్యమంత్రికైనా అదే నియమం

### జైలునుంచి పాలన న్యాయం కాదుకదా!: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ముఖ్యమంత్రి అయినా, ప్రధానమంత్రి అయినా జైలు నుంచే పరిపాలన చేయడం మంచి విషయమేనా? అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రశ్నించారు. మన ప్రజాస్వామ్యానికి అదిమర్యాదపూర్వకంగాఉంటుందా? అంటూ విపక్షాలపై మండిపడ్డారు. మాజీ ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామా అంశంపైనా స్పందించారు. విపక్షాలు ఇప్పటికీ కూడా జైలుకు వెళ్తే సులభంగా ప్రభుత్వాలు ఏర్పాటు చేయగలమని అనుకుంటున్నారు. వారు జైలునే సిఎం, పిఎం అధికారిక నివాసాలుగా మార్చేస్తారు. అప్పుడు డిజిపి, చీఫ్‌సెక్రటరీ, కేబినెట్ సెక్రటరీ వంటి ఉన్నతాధికారులు జైలు నుంచే ఆదేశాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి సిద్ధాంతాలను నేను, మాపార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. జైలు నుంచే ప్రభుత్వాలను నడిపే పరిస్థితి మన దేశంలో రాకూడదు అని అమిత్ షా అన్నారు. ప్రధానిగానీ, ముఖ్యమంత్రి గానీ లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న ఏ నేత అయినా సరే ఏదైనా కేసులో అరెస్టయితే 30 రోజుల్లో బెయిల్ పొందాలి. లేదంటే తమతమ పదవులకు రాజీనామా చేయాలి. అలా చేయకపోతే చట్టమే వారిని తప్పించేలా 130వ రాజ్యాంగ సవరణను తీసుకొస్తున్నాం.

చట్టమేదైనా ప్రభుత్వం, ప్రతిపక్షానికి ఒకేలా అమలవుతుంది. ఈ నిబంధన ప్రధాని పదవికి కూడా వర్తించేలా స్వయంగా నరేంద్రమోడీనే దీన్ని సవరణలో చేర్చారు. ఆయనకు కూడా ఇది వర్తిస్తుంది. ప్రధాని జైలుకెళితే ఆయనైనా రాజీనామా చేయాల్సిందే. ఎన్నికైన ప్రభుత్వం రాజ్యాంగ సవరణను తీసుకొస్తే దానిపై అభ్యంతరాలు లేవనెత్తే హక్కు అందరికీ ఉంటుంది. అంతేగానీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కూడా అవకాశం లేకుండా ఆందోళనలు చేస్తే ఎలా? అని ప్రతిపక్షాలపై హోంమంత్రి మండిపడ్డారు. ఈ బిల్లు ఖచ్చితంగా పార్లమెంట్‌లో ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై విపక్షాల ఆరోపణలను అమిత్ షా తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా 2013నాటి ఉదంతాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీపై ధ్వజమెత్తారు. రాజ్యాంగ సవరణ బిల్లులో నైతికత లేదని విపక్షాలు అంటున్నాయి. నాడు లాలూ యాదవ్‌ను కాపాడేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ పత్రాలను రాహుల్‌గాంధీ చింపేశారు. ఆ రోజే ఆయన నైతికతతో వ్యవహరిస్తే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేదికాదు. ఈ రాజ్యాంగ సవరణపై కాంగ్రెస్ ద్వంద్వవైఖరి ప్రదర్శిస్తోంది. వరుస వైఫల్యాలతో ఆ పార్టీ ఆలోచనావిధానం మందగించి ఉంటుంది. అని కేంద్రమంత్రి ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా అంశాన్ని ఆయన ప్రస్తావించారు. ధన్‌ఖడ్‌జీ రాజ్యాంగ పదవిలో కొనసాగారు. ఆయన పదవీకాలంలోఎన్నో మంచి పనులు చేశారు. వ్యక్తిగత అనారోగ్య సమస్యల కారణంగా ఇప్పుడు రాజీనామా చేశారు. ఈ విషయాన్ని మరీ ఎక్కువగా లాగొద్దు. కేవలం ప్రతి పక్షాల ఆరోపణల ఆధారంగా దీనిపై ఓ అంచనాకు రావడం సరికాదుఅని అమిత్ షా స్పష్టంచేశారు. త్వరలో జరగబోయే ఉపరాష్ట్రపతి ఎన్నిక గురించి ప్రస్తావిస్తూ రాష్ట్రపతిని తూర్పు భారతం నుంచి ఎన్నుకున్నాం. ఇప్పుడు ఉపరాష్ట్రపతి దక్షిణాది నుంచి ఉండాలని అనుకున్నాం. దీనికి, తమిళనాడు ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదు అని తెలిపారు.



## రాజస్థాన్‌లో భారీ వరదలు

### రెండు కిలోమీటర్ల మేర గొయ్యి!

**జైపూర్, ఆగస్టు 25:** గతకొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాజస్థాన్‌లో భారీ వరదలు పోటెత్తాయి. వర్షాల వల్ల సుర్వాల్ జలాశయం పొంగి పొర్లటంతో రాజస్థాన్‌లోని సవాయ్ మాధోపూర్ గ్రామంలో 2కిలోమీటర్ల మేర గొయ్యి ఏర్పడి జలపాతాన్ని తలపిస్తోంది. పొలాల మీదుగా నిరు ఉధృతంగా ప్రవహించి జదవత గ్రామాన్ని ముంచెత్తడంతో విధ్వంసం జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. సవాయ్ మాధోపూర్‌లో 2 కిలోమీటర్ల పొడవు, 100 అడుగుల వెడల్పు, 55 అడుగుల లోతున బిలం ఏర్పడడంతో గ్రామా నికి రాకపోకలు నిలిచిపోయాయన్నారు. వర్షం ఇలాగే కొనసాగితే పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందన్నారు. నీటి ఉధృతికి రెండు ఇళ్లు, పలుదుకాణాలు, రెండు దేవాలయాలుకూలినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు, భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపడుతున్నారు. సమీపంలోని ఇళ్లను ఖాళీ చేయించి గ్రామస్తులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కరోడి లాల్ మీనా పేర్కొన్నారు. బిలంలోకి చేరుకున్న నీటిని యంత్రాల సహాయంతో మళ్లించాలని అధికారులను ఆదేశించారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో నేల కొతను ఆపడం అసాధ్యమన్నారు. ఇదే విధంగా రాష్ట్రంలోని పలు గ్రామాలు వరద నీటిలో మునిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. నిమోడా అనే గ్రామంలో దాదాపు 400 ఇళ్లు కూలిపోవడంతో అక్కడి ప్రజలు నిరాశ్రయులయ్యారని వారిని సహాయక శిబిరాలకు తరలించామని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సైన్యం, జాతీయ రాష్ట్ర విపత్తు సహాయ దళాలు సహాయక చర్యలు అందిస్తున్నాయన్నారు.

## రష్యాలో భారత్ కార్మికులకు డిమాండ్

**మాస్కో, ఆగస్టు 25:** రష్యాలో భారత కార్మిక శక్తికి డిమాండ్ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. రష్యన్ కంపెనీలు.. ముఖ్యంగా యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లోని సంస్థలు భారతీయులను నియమించుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు అక్కడి భారత రాయబారి వినయ్‌కుమార్ తెలిపారు. రష్యాలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు భారతీయుల సంఖ్య పెరుగుతుండటంతో కాన్సులర్‌సేవలను మరింత విస్తరిస్తున్నట్లు చెప్పారు. అమెరికా, బ్రిటన్ తదితర పాశ్చాత్య దేశాలు వలసలపై ఆంక్షలు విధిస్తున్న వేళ.. ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'రష్యాలో మానవ వనరుల అవసరం ఉంది. భారత్ వద్ద నైపుణ్యం కలిగిన కార్మిక శక్తి ఉంది. ఈ క్రమంలోనే స్థానిక చట్టాలను అనుసరించి కంపెనీలు భారతీయులను నియమించుకుంటున్నాయి. ఇక్కడికి వచ్చిన వారిలో ఎక్కువ మంది నిర్మాణ, వస్త్రరంగాల్లో ఉపాధి పొందుతున్నారు. యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో భారతీయులకు డిమాండ్ పెరుగుతోంది' అని ఓ వార్తాసంస్థ ఇంటర్వ్యూలో వినయ్‌కుమార్ వెల్లడించారు.

స్థానికంగా భారతీయ కార్మికుల సంఖ్య పెరుగుతుండటంతో.. పాస్‌పోర్ట్ పొడి గింపు వంటి కాన్సులర్ సేవలను విస్తరిస్తున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్ యుద్ధానికితోడు యువ రష్యన్లు ఫ్యాక్టరీల్లో పనిచేసేందుకు విముఖత చూపుతుండటం వంటి కారణాలతో.. 2030 కల్లా రష్యాలో 31 లక్షల మంది కార్మికులకు కొరత ఏర్పడనున్నట్లు అంచానా.

ఈ నేపథ్యంలో ఇక్కడి పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మిక కొరతను తీర్చడానికి ఈ యేడాది చివరికల్లా నిపుణులైన 10 లక్షల మంది భారతీయ కార్మికులను తీసుకోవాలని మాస్కో వ్యూహకర్తలు భావిస్తున్నట్లు ఇటీవల కథనాలు వెలువడ్డాయి.

## అమెరికాలో లాబీయింగ్‌కు భారత్ ముమ్మర యత్నాలు!



**వాషింగ్టన్, ఆగస్టు 25:** అమెరికా విధించిన అదనపు సుంకాలు అమల్లోకి రావడానికి కొన్ని రోజులముందే భారత్ లాబీయింగ్ యత్నాలను ముమ్మరం చేసింది. ఈ క్రమంలో అక్కడి ప్రభుత్వంతో వ్యూహాత్మక అంశాల్లో కమ్యూనికేషన్ల నిర్వహించడం, సోషల్ మీడియా, మీడియా రిలేషన్స్, డిజిటల్ ఆడిట్ వంటివాటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక సంస్థను నియమించుకొంది. ఫారెన్ ఏజెంట్ రిజిస్ట్రేషన్ ఫైలింగ్ ప్రకారం.. భారత దౌత్య కారాలయం నెలకు 75,000 డాలర్లు చెల్లించేలా మూడు నెలలకు మెర్క్యురీ పబ్లిక్ ఆఫైర్స్ సంస్థతో ఒప్పందం చేసుకొంది. ఇది ఈ నెల 15 నుంచి అమలులోకి వచ్చింది. మెర్క్యురీ సంస్థ మాజీ రిపబ్లికన్ సెనెటర్ డేవిడ్ విట్టర్, 2020 ట్రంప్ ట్రాన్సిషన్ బృందం కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా చేసిన బ్రయాన్‌తో కలిసి భారత్ కోసం పనిచేస్తుంది. న్యూయార్క్ రాష్ట్రానికి సెనెటర్‌గా ఎన్నికైన తొలి ఇండో-అమెరికన్ కెవిన్ థామస్ సాయం చేయనున్నారు. ప్రస్తుతం ట్రంప్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ సూసీ విలిస్ మెర్క్యురీ సంస్థతో సంబంధాలున్నాయి. 2024వరకు ఆమె ఈ సంస్థకోసం రిజిస్టర్డ్ లాబీయిస్ట్‌గా పనిచేశారు. ఆ తర్వాత శ్వేతసౌధంలో బాధ్యతలు చేపట్టారు. బ్రయాన్ గతంలో ట్రంప్ ప్రచార బృందంలో, జెడివాన్స్ సెనెట్‌కు పోటీ చేసినప్పుడు పనిచేశారు. విమర్శలు వచ్చాక.. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత పాకిస్థాన్ చాలా వేగంగా ఆయనతో సంబంధాలను బలోపేతం చేసుకొంది. భారత్ మాత్రం కొంత వెనకబడిందనే విమర్శలు వచ్చాయి. ఇక పాక్ నాయకత్వం ట్రంప్ మాజీ బాడీగార్డ్ కీత్ షల్లర్ నిర్వహిస్తున్న లాబీయింగ్ సంస్థను నియమించుకొంది. మరోవైపు భారత్ ఇప్పటికే ట్రంప్ మాజీ సహాయకుడు జేసన్ మిల్లర్‌కు చెందిన ఎస్‌హెచ్‌డబ్ల్యు పార్టనర్స్ ఎల్‌ఎల్‌సిని నియమించుకొని నెలకు 1.50 లక్షల డాలర్లు చెల్లిస్తున్నాం. అమెరికాలో కీలకమైన ఒప్పందాలు, ఇతర పనులను పూర్తి చేసుకోవడానికి లాబీయింగ్ సంస్థలను నియమించుకోవడం కొత్తేమీ కాదు. చాలా దేశాలు వీటితో కలిసి పనిచేస్తుంటాయి.

**రష్యాను అదుపు చేయడానికే భారత్‌పై చర్యలు..**

రష్యా దూకుడును అదుపు చేయడానికి ట్రంప్ సర్కారు చాలా చర్యలు తీసుకొందని ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ వెల్లడించారు. దీనిలో భాగంగానే భారత్‌పై సెకండరీ టారిఫ్‌లు విధించినట్లు పేర్కొన్నారు. ఆయన ఎన్‌బిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.

## ఎక్కడ తక్కువకు వస్తే అక్కడే చమురు కొంటాం



### రష్యాలో భారత్ దౌత్యవేత్త వినయ్‌కుమార్ స్పష్టీకరణ

**మాస్కో, ఆగస్టు 25:** రష్యా నుంచి భారత్ క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకోవటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. రష్యాతో ఆయిల్ ఒప్పందాలు రద్దు చేసుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని కొన్ని నెలల క్రితమే ట్రంప్ హెచ్చరించారు. భారత్, రష్యానుంచి క్రూడ్ ఆయిల్ కొనటం అంటే.. ఇక్రెయిన్‌పై యుద్ధం చేయడానికి రష్యాకు నిధులు సమకూరుస్తున్నట్లే అని ఆయన అన్నారు. ట్రంప్ హెచ్చరికల్ని భారత్ ఏమాత్రం లెక్కచేయలేదు. రష్యా నుంచి క్రూడ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటూ ఉంది. దీంతో ట్రంప్ ఆగ్రహానికి గురయ్యారు. ఏకంగా 50 శాతం టారీఫ్ విధించారు. అయినా కూడా భారత్ వెనక్కు తగ్గలేదు. ఈ విషయంపై భారత ప్రధాని నరేంద్ర మోడీ వారం రోజుల క్రితం మాట్లాడారు. తాము ఎవరి బెదిరింపులకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. తమకు భారత ప్రజల ప్రయోజనాలే ముఖ్యం అని అన్నారు. ఈనేపథ్యంలోనే రష్యాతన మిత్ర దేశం భారత్‌కు బంపర్ ఆఫర్ ఇచ్చింది. క్రూడ్ ఆయిల్‌పై5శాతం డిస్కౌంట్ ప్రకటించింది.

**ఎక్కడ తక్కువకు దొరికితే అక్కడే కొంటాం..**

రష్యానుంచి భారత్ క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకోవటంపై రష్యాలోని భారత అంబాసిడర్ వినయ్‌కుమార్ స్పందించారు.

తాజాగా, రష్యా ప్రభుత్వ మీడియా టాస్ ఏజెన్సీకి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'దేశంలోని ఆయిల్ కంపెనీలు ఆయిల్ ఎక్కడ తక్కువకు దొరికితే అక్కడే కొంటాయి.

భారత ప్రభుత్వానికి దేశప్రజల ప్రయోజనాలే ముఖ్యం.

ప్రజలకు సరిపడా ఆయిల్ అందించ డానికి తగిన చర్యలు తీసుకుంటుంది. రష్యాతో పాటు పలుదేశాలకు భారత్ పర స్పరసహకారం అందించటంవల్ల జాతీయ ఆయిల్ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ ఆయిల్ మార్కెట్ నిలకడగా ఉంది. అంతెందుకు.. రష్యాతో అమెరికాకూడా వ్యాపారాలు చేస్తోంది కదా..' అని అన్నారు.

## వివాదాస్పదంగా గోర్ నియామకం



### భారత్-అమెరికా మధ్య ట్రంప్ పెట్టిన మరో చిచ్చు

**వాషింగ్టన్, ఆగస్టు 25:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు భారత్-అమెరికా సంబంధాలను తీవ్రస్థాయిలో దెబ్బతీస్తున్నాయి. తాజాగా అత్యంత వివాదాస్పదమైన వ్యక్తుల్లో ఒకరైన సెర్గియో గోర్‌ను భారత్‌లో అమెరికా రాయబారిగా, దక్షిణ, మధ్య ఆసియాలో పర్యవేక్షకుడిగా నియమించడం దౌత్య వర్గాలను షాక్‌కు గురిచేసింది. ఒకప్పుడు భారత్ తీవ్రంగా వ్యతిరేకించిన పనినే ట్రంప్ బలవంతంగా చేశారు. 38 యేళ్ల గోర్‌పై ట్రంప్‌నకు విపరీత మైన నమ్మకం ఉంది. ఇతడు చెప్పిన మీదటే నాసా చీఫ్ నియామకాన్ని చివరి నిమిషంలో మార్చేశారు.

**భారత్ ప్రాధాన్యం తగ్గించినట్లా?**

గోర్ నియామకంపై భారత్‌లో మిశ్రమ స్పందన వస్తోంది. విదేశీ వ్యవహారాల నిపుణుడు, మాజీ దౌత్యవేత్త కన్వల్ సిబల్ స్పందిస్తూ భారత్‌లో నియమించిన దౌత్యవేత్తను దక్షిణ, మధ్య ఆసియాకు ప్రత్యేక దూతగా నియమించడం ఇదే తొలిసారి అని అన్నారు. పాకిస్థాన్‌సహా పొరుగు దేశాలతో భారత్‌కు ఉన్న సంబంధాలను అతడు గమనిస్తాడన్నది వాస్తవమని పేర్కొన్నారు. అయితే.. ఈచర్య భారత్, పాకిస్థాన్‌ను ఒకే గాటన కట్టినట్లవుతుందని.. ఇలాంటి అమెరికా వైఖరిని న్యూఢిల్లీ గతంలో తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. అంతేకాదు.. ఇక భారత్-అమెరికా సంబంధాల్లో ఇండో-పసిఫిక్ ప్రాధాన్యం కనుమరుగవుతుందని చెప్పారు. ఇకపోతే.. మరో మాజీ దౌత్యవేత్త నిరుపమారావ్ కూడా ట్రంప్ ఉద్దేశాలను ప్రశ్నించారు. ఈ నియమాకం భారత్-అమెరికా సంబంధాలను దెబ్బతీస్తుందన్నారు. గోర్ దౌత్యవేత్త కాకపోవడం, భారత్, దక్షిణాసియాలో అతడికి అనుభవం లేకపోవడం ఇబ్బందికరమన్నారు. కేవలం వీరవిధేయతే ఏకైక అర్హతన్నారు. అధ్యక్షుడి అజెండాను ముందుకు తీసుకెళ్లడానికే అతడిని నియమించారన్నారు. అది భారత్‌తో సంబంధాలను కూడా కలపడం ఇబ్బందికరమే అనితెలిపారు. వ్యక్తిగతంగా తనకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తిని భారత్‌లో నియమించి ట్రంప్ నుంచి మోడీ ప్రభుత్వానికి బలమైన సంకేతాలు వెళ్లాయని పొలిటికో పత్రిక పేర్కొంది. అధ్యక్షుడి నుంచి వచ్చే అభ్యంతరాలు, ఇతరసందేశాలపై భారత్ కూడా తీవ్రంగా పరిగణించి.. చర్చలు జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

**నాడు ఒబామా ప్రయత్నాన్ని వ్యతిరేకించిన భారత్..**

2009లో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా భారత్-పాక్-అఫ్ఘానిస్థాన్‌ను ఒకే పాలసీ కిందకు తెచ్చేందుకు యత్నించారు. నాడు రిచర్డ్ హోల్‌బ్రూక్‌ను ఈ ప్రాంతం మొత్తానికి ప్రత్యేక రాయబారిగా నియమించారు. అయితే.. నాటి భారత విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ దీనిపై అమెరికా రాయబారి డేవిడ్ మల్‌ఫోర్డుకు తమ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ చర్య భారత్‌కు ఆమోదయోగ్యం కాదన్నారు. దీంతో నాడు బ్రూక్‌ను పాక్-అఫ్ఘానిస్థాన్‌కు మాత్రమే పరిమితం చేసినట్లు వికీలీక్స్ లో బహిర్గమైన పత్రాల్లో తేలింది. ఇప్పుడు ట్రంప్ భారత్‌కు నచ్చని అటువంటి చర్యే తీసుకొన్నారు.

**ట్రంప్-మస్క్ వివాదాన్ని ఎగదోసి..**

శ్వేతసౌధంలో ట్రంప్ వ్యక్తిగత కార్యదర్శి హోదాలో అమెరికా ప్రభుత్వంలో ఏకంగా 4,000 నియామకాలు చేశారంటే.. గోర్ పరపతిని అర్థం చేసుకోవచ్చు. మస్క్ దోస్త్ జరేడ్ ఇస్సాక్‌మన్ సానా చీఫ్‌గా తొలుత ప్రకటించారు. ఆయన నామినేషన్ ఆమోదం కోసం సెనేట్‌కు పంపే సమయంలో మస్క్-ట్రంప్ విభేదాలు తీవ్రస్థాయిలోఉన్నాయి. అదేసమయంలో ఇస్సాక్‌మన్ డెమోక్రాట్లకు ఎన్నికల్లో నిధులు సమకూర్చినట్లు గోర్ నుంచి అధ్యక్షుడికి సమాచారం వెళ్లింది. దీంతో డోజ్ అధిపతిగా ఉన్న మస్క్ చివరిరోజున.. నాసా చీఫ్‌పదవి నుంచి ఇస్సాక్‌మన్ పేరును ట్రంప్ తొలగించారు. ఈ నేపథ్యంలో గోర్‌ను 'పాము'గా అభివర్ణిస్తూ మస్క్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇక సెనేట్‌లో ఆమోదముద్ర పడితే గోర్ భారత్‌కు రావడం ఖాయమవుతుంది. ఇది కూడా అంత ఈజీ ఏమీకాదు. బైడెన్ ప్రభుత్వం నియమించిన ఎరిక్ గార్సెట్టీకి సెనెట్ ఆమోదముద్ర వేయడంలో తీవ్ర జాప్యం చేసింది. దీంతో ఆన చివరి రెండేళ్లు మాత్రమే భారత్‌లో పనిచేశారు.



ఫిజి ప్రధాని సిత్వేని రబుకా సోమవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ముతో భేటీ దృశ్యం

## గాజా ఆస్పత్రిపై ఇజ్రాయెల్ మళ్లీ భీకర దాడులు..

### ముగ్గురు జర్నలిస్టులు సహా 15 మంది మృతి



**టెల్‌అవీవ్, ఆగస్టు 25:** హమాస్ అంతమే లక్ష్యంగా గత 22 నెలలుగా గాజా నగరంపై ఇజ్రాయెల్ భీకర దాడులు చేస్తోంది. తాజాగా గాజా నగరంలోని పలు ప్రాంతాలపై ఐడిఎఫ్ దాడులకు తెగబడింది. నాజర్ ఆస్పత్రిపై సోమవారం జరిపిన దాడుల్లో ముగ్గురు జర్నలిస్టులు సహా కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోయినట్లు పాలస్తీనా ఆరోగ్య అధికారులు తెలిపారు. ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టుల్లో ఒక రాయిటర్స్‌కు చెందిన హతేమ్ ఖలీద్, ఓ ఫొటోగ్రాఫర్ అని స్థానిక వార్తాసంస్థ తెలిపింది. 2023 అక్టోబరు 7న మొదలైన ఈ యుద్ధంలో ఇప్పటివరకూ గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 62 వేలు దాటింది. లక్షలాది మంది గాయపడ్డారు. ఇక ఈ యుద్ధంలో సుమారు 200 మందికిపైగా మీడియా వర్కర్స్ మరణించారు.

**గాజా సిటీపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం.. 64 మంది మృతి**

గాజా సిటీపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపిస్తోంది. వైమానిక దాడులతోపాటు.. ట్యాంకులతోనూ విరుచుకుపడుతోంది. గత 24 గంటల వ్యవధిలో 64 మంది మృతి చెందారని, 300 మందికి గాయాలయ్యాయని హమాస్‌కు చెందిన ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. గాజాసిటీ లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్‌కు ఇజ్రాయెల్ 60 వేల మందితో రిజర్వు దళాలను రంగంలోకి దింపింది. మొత్తం గాజాస్ట్రిప్‌ను ఆక్రమించే ఉద్దేశం ఉందని బందీల విడుదలపై హమాస్‌తో పరోక్ష చర్చలు విఫలమైన తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పేర్కొన్న సంగతి తెలిసిందే. యెమెన్ రాజధాని సనాపై ఇజ్రాయెల్ ఆదివారం దాడులు చేసింది. ఓ విద్యుత్‌కేంద్రం, గ్యాస్ స్టేషన్‌పాటు రాజధాని వ్యాప్తంగా వివిధ ప్రాంతాలపై బాంబుల కురిపించింది.

## సంక్షిప్తంగా..

### ఇడి దాడులతో గోడదూకబోయిన ఎమ్మెల్యే



**కోల్‌కతా, ఆగస్టు 25:** పశ్చిమబెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పలువురు నేతల ఇళ్లపై దాడులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఇడి అధికారులు ముర్షిదాబాద్ జిల్లాలోని తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే జిబన్ కృష్ణ సాహా నివాసం సహా ఆయనకు సంబంధించిన పలు ప్రదేశాలపై దాడులు నిర్వహించారు. అయితే సోదాల గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే తమ ఇంటి మొదటి అంతస్తు నుంచి కిందకు దూకి గోడ దూకి పారిపోయేందుకు యత్నించారు. ఇంటి బయట కాపలా అధికారులు కృష్ణ సాహాను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పారిపోయే క్రమంలో ఎమ్మెల్యే తన వద్ద ఉన్న సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకు తన మొబైల్ ఫోన్‌ను ఇంటికి సమీపంలోని చెరువులోకి విసిరేసినట్లు అధికారులు తెలిపారు. మరో రెండు ఫోన్‌లను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపామన్నారు. ఇంటి నుంచి పారిపోవడానికి ఎందుకు ప్రయత్నించారనే విషయంపై కృష్ణ సాహాను విచారిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఉపాధ్యాయ నియామక కుంభకోణం కేసులో 2023 ఏప్రిల్‌లో సిబిఐ అధికారులు కృష్ణ సాహాను అరెస్టు చేశారని, 2025 మేలో ఆయనకు బెయిల్ మంజూరయిందని తెలిపారు. ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతో పాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కార్ రాష్ట్ర స్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షను 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు.

### నటి ఆరోపణలు.. ఎమ్మెల్యేను సస్పెండ్ చేసిన కాంగ్రెస్



**తిరువనంతపురం, ఆగస్టు 25:** కేరళ కాంగ్రెస్‌లో ఓ నటి చేసిన ఆరోపణలు కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ అతనిపై చర్యలు చేపట్టింది. ఎమ్మెల్యే రాహుల్ మామకుటత్తిల్‌ను ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేసింది. ఆయన పాలక్కాడ్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఓ ప్రముఖ పార్టీకి చెందిన యువనేత తనతో అనుచితంగా వ్యవహరిస్తు న్నాడని, మూడేళ్లుగా వేధిస్తున్నారంటూ రీని జార్జ్ అనే నటి ఓ ఇంటర్వ్యూలో ఆరోపించారు. ఈ విషయాన్ని పలుమార్లు ఆ పార్టీ సీనియర్ల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. రాహుల్ పేరును ఆమెనేరుగా ప్రస్తావించనప్పటికీ బిజెపి, సిపిఎం శ్రేణులు ఆయన ప్రమేయం ఉందని ఆరోపించాయి. రాజీనామా చేయాలని నిరసనలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్ రాజీనామా ప్రకటించారు. నాపై వచ్చిన ఆరోపణల విషయంలో పార్టీ పెద్దలతో మాట్లాడాను. వారెవరూ నన్ను రాజీనామా చేయాలని డిమాండ్ చేయలేదు. ఆ నటి నా స్నేహితురాలు. ఆమె ఆరోపణలు చేసిన వ్యక్తి నేనేకాదని నమ్ముతున్నాను. నేను ఎటువంటి చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడలేదుఅని రాజీనామా అనంతరం పేర్కొన్న సంగతి తెలిసిందే. అయినా విమర్శలు ఆగకపోవడంతో ఇప్పుడు పార్టీ చర్యలు తీసుకుంది.

### యుపిలో ట్రాక్టర్, కంటైనర్ ఢీ: 8 మంది మృతి

**లక్నో, ఆగస్టు 25:** ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లా ఘటల్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదివారం రాత్రి 2.15 గంటల సమయంలో 34వ జాతీయ రహదారిపై బులంద్‌షహర్, అలీగఢ్ సరిహద్దుల్లోని ఘటల్ వద్ద వేగంగా దూసుకొచ్చిన ఓ కంటైనర్ అదుపుతప్పి గోగాజీ భక్తులతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో 8 మంది మృతి చెందారు. మరో 43 మంది గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. బాధితులు యూపీలోని కాస్గంజ్ నుంచి రాజస్థాన్‌లోని గోగామేడికి వెళ్తుండగా ప్రమాదం జరిగిందని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం 43మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన ట్రాక్టర్‌ను ఘటనా స్థలం నుంచి తొలగించామన్నారు. ట్రక్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

26-08pg6exHMNWJQE 10_26-08pg6exHMNWJQE.qxd 8/26/2025 12:11 AM Page 1



# మాస్టర్‌ప్లాన్ అమలుకు మరో శివరాత్రి రావాలేమో!

## మంత్రి, కలెక్టర్ ప్రకటనలు ఉత్తుత్తివేనా? ఎమ్మెల్యే హామీల మాటేమిటి?



సన్నిధి వీధిలో మాస్టర్ ప్లాన్‌కు అడ్డంగా ఉన్న భవనం

**శ్రీకాళహస్తి,ఆగస్టు 25 ప్రభాతవార్త** :శ్రీకాళహస్తీశ్వరాలయం మాస్టర్ ప్లాన్ అమలుకు మరో శివరాత్రి రావాలా? మహాశివరాత్రి ఏర్పాట్లు సమీక్ష సందర్భంగా సాక్షాత్తు దేవాదాయశాఖ మంత్రి ఆనం నారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ మహాశివరాత్రి లోపల మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని అడ్డం ఉన్న ఒకే ఒకణ్ణి ఒప్పించి, నష్టపరిహారం చెల్లించి అమలుకు మార్గం సుగమం చేయాలని ఆదేశించారు. నిధులు ఇవ్వటానికి కూడా మంత్రి సిద్ధం అంటూ ప్రకటించారు. శివరాత్రి జరిగి ఆరునెలలు అయినా అతీ గతీ లేదు. దాంతో జనం ఇక కొత్త ఆలయ పరిసరాలను చూడవచ్చునని కలలు కన్నారు. కానీ నెలలు గడుస్తున్నా ఆ ఒక్కణ్ణి తొలగించటానికి ఎందుకో మీన మేషాలు లెక్కించుకుంటున్నారు. దేవాదాయశాఖ అధికారులు ఏమో మేము ప్రతి పాదనలు పంపామంటూచేతులు దులుపుకుంటుండగా ఫైలు కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి ఎందుకు ముందడగు వేయటం లేదో ఎవరికి అంతుపట్టడం లేదు. శ్రీకాళహస్తీశ్వరాలయం మాస్టర్ ప్లాన్‌ను గతంలో దివంగత నేత గోపాలకృష్ణారెడ్డి అప్పటి ముఖ్యమంత్రి(ప్రస్తుత) నారాచంద్రబాబునాయుడు సూచనలతో మాస్టర్ ప్లాన్‌ను ఆమలు చేసారు. సుమారు రూ.వంద కోట్లు భక్తులు సమర్పించిన విరాళాలతో భూసేకరణ చేసారు. ఆలయం చుట్టు నిర్మించిన నిర్మాణాలే కాకుండా మరో 3.5 ఎకరాల భూములను సేకరించారు. వంద కోట్లు వెచ్చించి సేకరించిన స్థలాలను నేడు పార్కింగ్‌గా వినియోగించుకుంటున్నారు. మాస్టర్ ప్లాన్ కోసం వంద ఇళ్ళు లాడ్జిలు,వ్యాపార సంస్థలను సేవకరించారు. నష్టపరిహారాలు చెల్లించారు. అయితే సన్నిధివీధిలో అందరి కంటే ముందుగా తమ ఆస్తిని అప్పగిస్తామని ఓ లాడ్జి యజమాని దేవస్థానంకు ప్రతిపాదించారు. అయితే ఆయన తప్ప మిగిలినఅ ందరి ఆస్తులను సేకరించారు. ఆయన వృత్తి రీత్యా న్యాయవాది కావటంతో పరిహారం విషయంలో పేచీ పడింది. ఇలా ఐదేళ్ళు గడిచిన తరువాత కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి స్థానిక శాసనసభ్యుడు ఆయన వెంట పడ్డారు. పలుమార్లు సమావేశం జరిపారు. చివరకు ఫిబ్రవరి 25లో దేవాదాయశాఖ,రెవెన్యూశాఖ మంత్రి కలెక్టర్‌లు పది రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కానీ జరగలేదు. శివరాత్రి తరువాత జిల్లా కలెక్టర్ స్థాయిలో కమిటి సమావేశం జరిపారు. బాధితునికి ఒప్పించారు. ఆతను రాతమూలకంగా ఇచ్చి మూడు నెలలు దాటుతున్నా ఇప్పటి వరకు పరిష్కారం లేదు. మాస్టర్ ప్లాన్‌కుఅ అడ్డంకిగా ఉన్న ఒకే ఒకవ్యక్తితో కలెక్టర్ కార్యాలయం చర్చలు జరిపింది. చివరకు బాధితుడు ఎంత కాలం పోరాటం చేస్తామన్నారు.



అంతర్జాతీయ బయోడిజైన్ నిపుణులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశ దృశ్యం

# వైద్యరంగంలో వినూత్న ఆవిష్కరణలు

## భారత్ బయోడిజైన్ రిసెర్చి ఇన్నోవేషన్ కార్యక్రమం రతన్‌టాటా ఇన్నోవేషన్‌తో కలిసి పనిచేయనున్న బయోడిజైన్ రిసెర్చి : సిఎంచంద్రబాబు

విజయవాడ, ఆగస్టు 25,ప్రభాతవార్తప్రతినిధి: వైద్యారోగ్య రంగంలో వినూత్న ఆవిష్కరణల కోసం భారత్ బయోడిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. అమరావతిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లో అంతర్భాగంగా ఈ రీసెర్చి ఇన్నోవేషన్ కార్యకలాపాలు ఉంటాయని ఆయన అన్నారు. ఏఐ, మెడ్ టెక్ అలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆసియాపసిఫిక్ బయోడిజైన్ అలయన్స్, అమెరికాలోని ప్రతిష్టాత్మక స్టాన్ ఫోర్డ్ బయోడిజైన్ సంయుక్త భాగస్వామ్యంలో దీనిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆరోగ్య రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించేలా భారత్ బయో డిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ దృష్టి సారించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెడికల్ టెక్నాలజీ రంగాల్లో, నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం చేయడమే లక్ష్యంగా పని చేయనుంది. అంతర్జాతీయ, స్థానిక నైపుణ్యాలను సమన్వయం చేయటం ద్వారా ప్రజారోగ్య రంగంలో బ్రెయిన్ కార్యక్రమం గణనీయమైన మార్పులను తీసుకువచ్చే అవకాశం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆసియా పసిఫిక్ బయోడిజైన్ అలయన్స్ కు చెందిన వేర్వేరు దేశాల వైద్య నిపుణులతో సీఎం సమావేశం అయ్యారు. ఈ ప్రాజెక్టు ద్వారా మెడికల్ టెక్నాలజీ రంగంలో కొత్త స్టార్టప్ లతో పాటు పరిశోధనలు, నిపుణులకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. తద్వారా ఏపీ నాలెడ్జి ఎకానమీ, ఆవిష్కరణల కేంద్రంగా ఎదుగుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియా, అమెరికా, ఇజ్రాయెల్, జపాన్, సింగపూర్, తైవాన్, ఐర్లాండ్ తదితర దేశాలకు చెందిన వైద్య నిపుణులు ఆయా దేశాల్లో బయోడిజైన్ కార్యకలాపాలపై ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏఐ,మెడ్ టెక్ అలయన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాకేష్ కలపాల, స్టాన్‌ఫర్డ్ సెంటర్ ఫర్ బయోడిజైన్ ప్రొఫెసర్ అనురాగ్ మైరల్, ఆసియా పసిఫిక్ బయోడిజైన్ సహాధ్యక్షుడు డాక్టర్ యోనా వైస్‌బచ్, బయోడిజైన్ ఆస్ట్రేలియా ఛైర్ ప్రొఫెసర్ కెవిన్ ఫ్లైగర్, టోక్యో బయోడిజైన్ ప్రతినిధి యూరియోన్ కొబయాషి, తైవాన్ బయోడిజైన్ నుంచి జేమ్స్ చియెన్‌హియా ట్సెంగ్, సింగపూర్ నేషనల్ యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ మార్క్ చాంగ్, మిరాయ్ మెడికల్ సహ వ్యవస్థాపకుడు కొలిన్ ఫోర్డే తదితరులు ముఖ్యమంత్రికి తమ దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌ను వైద్యారోగ్య రంగంలో ఆవిష్కరణలకు, మెడ్‌టెక్ పరిశోధనలకు కేంద్రంగా అభివృద్ధి చేయాలనే రోడ్‌మ్యాప్ పై ముఖ్యమంత్రి చర్చించారు. వైద్యారోగ్య రంగంలో పరిశోధన, శిక్షణ, సాంకేతిక బదిలీ స్టార్టప్, ఇంక్యుబేషన్ తదితర రంగాల్లో సహకారం అందించే అంశంపై గ్లోబల్ నిపుణులు ఏపీ ప్రభుత్వం మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. ప్రత్యేకించి యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా ఎయిమ్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం కుదిరింది. ఒప్పందంతో భారత్ బయోడిజైన్ బయోడిజైన్ ఆస్ట్రేలియాలు ఉమ్మడిగా పనిచేయనున్నాయి. వైద్యారోగ్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, విద్యార్థులకు ప్రత్యేక కోర్సులను నిర్వహించేలా ఈ ఒప్పందం సహకరించనుంది. ఆంధ్రప్రదేశ్ ను గ్లోబల్ హెల్త్ టెక్నాలజీ, డిజిల్ హెల్త్ ఇన్నోవేషన్ హబ్ గా తీర్చిదిద్దే అంశంపై భారత్ బయోడిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ కార్యక్రమం ప్రధానంగా పనిచేయనుంది. ముందస్తు విశ్లేషణల ద్వారా వ్యాధుల సంక్రమణను నియంత్రించటం, ముందస్తుగా ఆరోగ్య భద్రతా కార్యక్రమాలు, తక్కువ వ్యయంతో ఆరోగ్య సేవల్ని ప్రజలకు అందించే అంశాలపై దృష్టి సారించనుంది. ఆదే సమయంలో అంతర్జాతీయ బయో డిజైన్ ఎకో సిస్టంలను భారత్‌లో ఉన్న భాగస్వాములను అనుసంధా నించటం పైనా ఈ ఒప్పందం సహకరించనుంది. ప్రపంచ వ్యాప్తంగా అనుసరిస్తున్న ఉత్తమ విధానాల్ని ఏపీలో అమలు చేయ టం, బయో డిజైన్‌లో శిక్షణ, పరిశోధనా రంగాల్లో అంతర్జాతీయ సహకారం, ప్రజారోగ్య రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించాలన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

## కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే బోడే ప్రసాద్



**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ 9 జిల్లాల్లో ప్రారంభమైంది. ఉచితంగా 1.45 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం ఉదయం మొదలైంది. చౌకబియ్యం పక్కదారి పట్టకుండా నివారించడమే లక్ష్యంగారాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన స్మార్ట్ రైస్ కార్డులను నేటి నుంచి పంపిణీ చేస్తోంది. లబ్దిదారులకు సాంకేతిక హంగులతో స్మార్ట్ కార్డులు అందిస్తున్నారు. క్యూఆర్ కోడ్‌వంటి ప్రత్యేకతలు రూపొందించారు. దీనివల్ల రాష్ట్రంలో ఎక్కడి వారైనా, ఎక్కడి నుంచైనా రేషన తీసుకునే సదుపాయం కల్పించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ పంపిణీ ప్రక్రియ వచ్చే నెల 15 తేదీ వరకు 4 విడతల్లో జరగనుంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, కృష్ణా, ఎన్టీఆర్ , తిరుపతి, నెల్లూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజయవాడలో వరలక్ష్మీ నగర్ లోను,కృష్ణాజిల్లా పెనమలూరులోను స్మార్ట్ రైస్ కార్డులను పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఆయా జిల్లాల్లో మంత్రులు, ఏ కార్డులను ప్రారంభించారు. అనంతరం సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్నారు. 15 రోజుల్లో 1.45 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు ఉచితంగా ఇంటింటికీ వెళ్లి అందించనున్నట్లు ప్రభుత్వం తెలియజేసింది. ఇక రాష్ట్రంలో నేటి నుంచి మొదటి విడత ప్రక్రియ కొన్ని జిల్లాల్లో ప్రారంభించారు. అదే విధంగా రెండో విడతను ఈనెల 30వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నారు. స్మార్ట్ రైస్ కార్డులను ఏటీఎం కార్డు తరహాలో జేబులో ఇమిడి పోయే విధంగా తయారు చేశారు. ఈ స్మార్ట్ కార్డులపై ఒకవైపు రాజముద్రతో పాటు లబ్ధిదారు ఫొటో ఉండే విధంగా రూపొందించారు. మరోవైపు క్యూఆర్ కోడ్ ఉండేలా ముద్రించారు. కార్డుపై ఎటువంటి రాజకీయ నాయకుల ఫొటోలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కొత్తగా రైస్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా త్వరలోనే కార్డులు రానున్నాయని అధికారులు పేర్కొన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న 6.70 లక్షల కార్డుదారులతో పాటు అడ్రస్ మార్పు చేసుకున్న వారికీ స్మార్ట్ కార్డులు జారీ చేస్తున్నారు. క్యూఆర్ కోడ్ సహా పలు సాంకేతిక అంశాలతో స్మార్ట్ కార్డులు తయారు చేశారు. రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ పోస్ యంత్రాలనూ ప్రభుత్వం ఆధునికీకరించింది. స్మార్ట్ రైస్ కార్డుతో స్కాన్ చేసి బయోమెట్రిక్, ఐరీష్ గుర్తింపుతో సరకులు పంపిణీ చేసే ఏర్పాట్లు చేశారు. సరకుల పంపిణీ సమాచారం ఎప్పటికప్పుడు కేంద్ర సర్వర్ కు చేరవేసేలా రూపొందించారు. రేషన్, సరకుల పంపిణీలో అక్రమాలు వివరించడమే లక్ష్యం.

## మిక్ కళాశాల అధ్యాపకుడు జి వి పి చంద్ర శేఖర్ యాదవ్‌కి డాక్టరేట్

**విజయవాడ,ఆగస్టు25,ప్రభాతవార్తప్రతినిధి:** మిక్ కాలేజీ అఫ్ టెక్నాలజీ, కంచికచర్ల లో పని చేయుచున్న జి వీ పి చంద్ర శేఖర్ యాదవ్ కి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం లో కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ నుంచి డాక్టరేట్ అందుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. వంశీ కిరణ్ గారు తెలిపారు. "క్వాడ్రాటిక్ ఫ్రీక్వెన్సీ మోడులాటెడ్ థర్మల్ వేవ్ ఇమేజింగ్ ఫర్ కేరెక్టరైజషన్ అఫ్ సాలిడ్స్" అను అంశం పై జి వీ పి చంద్ర శేఖర్ యాదవ్ చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా డా. జి వీ పి చంద్ర శేఖర్ యాదవ్ ను కళాశాల సి. ఈ. ఓ. డి. పాండురంగ రావు, మేనేజ్మెంట్ మెంబెర్ ఎమ్. సుహాస్ గారు, ప్రిన్సిపాల్ డాక్టర్. టి. వంశీ కిరణ్. ఇతర అధ్యాపకులు అభినందిచారు.

## పూజల పేరిట పురోహితుడికి టోపీ

### రూ.6 లక్షలు స్వాహా చేసిన సైబర్ నేరగాళ్లు

**హైదరబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల ఆగడాలు శృతి మించు తున్నాయి. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని, రోజుకో కొత్తరకం పద్ధతుల్లో అమాయకపు ప్రజలను బురిడి కొట్టిస్తున్నారు. తాజాగా పూజల పేరుతో నగరానికి చెందిన ఓ పురోహితుడికి కుచ్చు టోపీపెట్టి అతడి ఖాతా లో ఉన్న రూ. 6 లక్షలు స్వాహా చేశారు. సైబర్ నేరాల కట్టడికి పోలీసులు విశ్వప్రయత్నం చేస్తున్నా నిత్యం ఎక్కడో ఒకచోట మోసాలు జరుగుతుం డటం కలకలం రేపు తోంది. వివరాల్లోకి వెళ్తే.. పాతబస్తీ పురానాపూల్‌కి చెందిన పురోహితుడు(52)కి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. తాను సికిందరాబాద్ మిలిటరీ కార్యాలయం నుంచి క్యాప్టెన్ అమన్‌కుమార్ మాట్లాడు తున్నానని పరిచయం చేసుకొని, కల్నల్ సార్ ఆరోగ్యం బాగోలేదని ఇందుకోసం 11 రోజుల పూజ జరిపించడానికి 21 మంది పురోహితులు కావాలని తెలిపాడు. నిజమేనని నమ్మిన పురోహితుడు 11 రోజుల పూజకయ్యే ఖర్చుతో పాటు పురోహితుల సంభావన తదితర వివరాలను తెలపగా, అడ్వాన్స్ కింద రూ. 3 లక్షలు చెల్లిస్తామని చెప్పిన నేరగాళ్లు నమ్మకం కలిగించేందుకు ముందు గా ఆయన యుపిఐకి రూ. 10 వేలు పంపించారు. అనంతరం వేరే నంబర్ నుంచి విడియో కాల్‌చేసి మిగతా డబ్బు పంపుతా మని పురోహితుడిని నమ్మించి ఆయన బ్యాంకుఖాతా, ఎటిఎమ్ కార్డు, పిన్ నంబర్ వివరాలు తీసుకు న్నారు. ఇంకేముంది విడతల వారీగా పురోహితుడి బ్యాంక్ ఖాతా నుంచి రూ. 5.99 లక్షలు కాజేశారు. దీంతో మోసపో యానని గ్రహించిన బాధి తుడు సోమవారం సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ డయల్ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైమ్ పోలీ సులు దర్యాప్తు చేపట్టారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతా, ఎటిఎమ్ కార్డు, పిన్‌నంబర్, ఒటిపి తదితర వివరాలు చెప్పవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# కోవూరులో వేడుకగా స్త్రీశక్తి విజయోత్సవ సభ


## - భారీగా తరలివచ్చిన మహిళా గణం- ఆస్తిలో సమాన హక్కు కల్పించిన చరిత్ర మనది- తాత ఎన్టీఆర్ భావజాలాలను ముందుకు తీసుకెళ్తున్న లోకేష్: ఎమ్మెల్యే



**కోవూరు (నెల్లూరు), ఆగష్టు 25, ప్రభాతవార్త :** సూపర్ సిక్స్. సూపర్ హిట్ అన్న నినాదాలు హోరెత్తాయి. తరలివచ్చిన మహిళాగణంతో కోవూరు వీధులు కిక్కిరిశాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం మహిళా సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలపై ఆనందహేళి వెల్లివిరిసింది. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో దాదాపు 5వేల మంది మహిళామణుల సమక్షంలో సోమవారం జరిగిన స్త్రీ శక్తి విజయోత్సవ సభ ఆద్యంతం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దంపతులు హాజరుకాగా మహిళలు వారికి అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. అనంతరం వేదిక వద్దకు చేరుకున్న వేమిరెడ్డి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఎం చంద్రబాబు పాలనలో జరిగిన లబ్ధిని వివరిస్తూ మహిళలు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పలువురు మహిళలతో ముచ్చటించి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. మహిళలు సంతోషం వ్యక్తం చేస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు మహిళా సాధికారత ఎలక్షంగా మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్నారని చెప్పారు. మహిళా శక్తికి నిదర్శనమే ప్రశాంతిరెడ్డికి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వడమని ఉద్ఘాటించారు. చంద్రబాబు అవకాశం ఇవ్వడం వల్లే ప్రశాంతి రెడ్డి ఎమ్మెల్యేగా తాను ఎంపీగా ఇక్కడ ఉన్నామని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి నిత్యం కోవూరు ప్రజల అభివృద్ధి గురించి ఆలోచిస్తుంటారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే మహిళలకు సంబంధించి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 10 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారని, దీని ద్వారా రూ. 3.7 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఏడాదికి 3 ఉచిత సిలిండర్ల పథకాన్ని అమలు చేస్తున్నారని, మహిళల రక్షణ కోసం శక్తి యాప్‌ను కూడా తీసుకువచ్చారన్నారు. డ్వాక్రా మహిళలకు(ఎస్‌ఎంఎస్‌ఎ) వడ్డీ లేని రుణాలు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందని గుర్తు చేశారు. ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం కార్యక్రమం కింద అకౌంట్లో 15000 జమ చేశారని, ప్రతి నెల ఒకటవ తేదీన ఇంటింటికి పెన్షన్ అందజేస్తూ ఆదుకుం టు న్నారన్నారు. ఎంఎస్ఎం ఈ కింద పరిశ్రమల ఏర్పాటుకు సహకరిస్తా జిల్లాలో మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా ఎంపీగా తనవంతు మద్దతు ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఎవరైనా మహిళలు మంచి ఆలోచనలతో ముందుకు వస్తే ఎంఎస్ఎంఈ కింద పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా తగిన సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు.

# స్మార్ట్ కార్డులతో రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత

## సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



**ముత్తుకూరు (నెల్లూరు), ఆగస్టు 25, ప్రభాతవార్త :** ముత్తుకూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారన్నారు. సరుకులు పొందిన, పొందని వారి వివరాలు ఎప్పటికప్పుడు అప్ డేటెడ్‌గా కనిపించేలా క్యూఆర్ కోడ్ స్మార్ట్ రేషన్ కార్డులు అందుబాటులోకి వచ్చాయన్నారు. రేషన్ పంపిణీ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న లోపాలను సరిదిద్దేందుకు ఈ స్మార్ట్ కార్డులు దోహదం చేస్తాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు సౌకర్యవంతంగా అనేక మార్పులు తీసుకొస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే సరుకులు అంటూ కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి వాహనాలను తెచ్చారు. ఆ వాహనాలు వచ్చిన సమయంలోనే రేషన్ సరుకులు తీసుకోవాలని, అవి కూడా ఇంటి వద్దకు రావు వీధిలో ఎక్కడో ఒక చోట నిలుపుతారన్నారు. వాహనాలు వచ్చిన గంటలో రేషన్ సరుకులు తీసుకోకపోతే ఇక ఆ నెలలో కట్, ఇప్పుడు కూటమి ప్రభుత్వం రేషన్ వ్యవస్థలో పాత విధానాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులు ఏ రోజైనా రేషన్ షాపుకి వెళ్లి సరుకులు పొందవచ్చు65 ఏళ్ల పైబడిన వారు, దివ్యాంగులకు నేరుగా ఇళ్ల వద్దకే సరుకులే ఇచ్చే ఏర్పాటు చేసింది. ఒకటో తేదీకి ఐదు రోజుల ముందే వారికి సరుకులు అందజేస్తున్నారు. మొదట రేషన్ కార్డు వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందే తెలుగుదేశం పార్టీ అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదల ప్రయోజనాల కన్నా పాలకుల ఫొటోలకే ప్రాధాన్యమిచ్చారు. ఇప్పుడు మా ప్రభుత్వం కేవలం లబ్ధిదారుల ఫొటోలతోనే స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, కృష్ణపట్నం సొసైటీ అధ్యక్షులు పల్లారెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఈదురు రామ్ ప్రదీప్ కలిసేటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నక్సలిజాన్ని సమర్ధించినట్టు 'సుప్రీం' తీర్పులో ఎక్కడా పేర్కొనలేదు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 25:** సల్వాజుడుం రద్దు కేసులో సుప్రీం కోర్టు తీర్పును వక్రీకరించి మాట్లాడటం సరికాదని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సుప్రీం తీర్పును తప్పుగా అర్థం చేసుకుంటున్నారని సుప్రీంకోర్టు, హైకోర్టు లకు చెందిన ప్రముఖ విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ బెనర్జీ, జస్టిస్ అంజనా ప్రకాష్, జస్టిస్ అభయ్ ఒకా, జస్టిస్ కైలాష్ గంభీర్, జస్టిస్ మదన్, జస్టిస్ జేసీ, జస్టిస్ కురియన్, జస్టిస్ విక్రమ్, జస్టిస్ ఏకే పట్నాయక్, జస్టిస్ గోపాల్ గౌడ, జస్టిస్ మురళీ ధర్, జస్టిస్ గోవింద్ మథుర్, జస్టిస్ చంద్రు, జస్టిస్ గోపాల్ రెడ్డి, జస్టిస్ కన్నన్, జస్టిస్ చంద్రకుమార్, జస్టిస్ మోహన్ గోపాల్, జస్టిస్ సీహెచ్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ రఘురామ్ ఓ ప్రకటనలో అమిత్ షా వ్యాఖ్యలను ఖండించారు. సల్వాజుడుం తీర్పు కేసులో నక్సలిజాన్ని గానీ, దాని భావజాలాన్ని గానీ ఎక్కడా సమర్థించినట్లు పేర్కొనలేదని స్పష్టం చేశారు. ఎన్డీఏ కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి తరపున ప్రచారం కోసం అమిత్ షా అటువంటి వ్యాఖ్యలు చేయడం సహేతుకం కాదని తప్పుబట్టారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలు గౌరవ ప్రదంగా, భావజాల కేంద్రీకృతంగా జరగాల్సిన ఎన్నికలని తెలిపారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలు వ్యక్తుల మధ్య జరగవని, అయినప్పటికీ అత్యు న్నత పదవిలో ఉన్న హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు దేశ న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఇది సుప్రీంకోర్టు న్యాయమూర్తులపైనా ప్రభావం పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా ఉపరాష్ట్రపతి ఎన్నికను గౌరవప్రదంగా భావించాలని, వ్యక్తిగత దూషణలు, పేరుపెట్టి అవమానించడం వంటి సరికాదని పేర్కొన్నారు.

## సిఎం రేవంత్‌ను కలిసిన బాలాపూర్, ఖైరతాబాద్ గణేశ ఉత్సవ సమితి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 25:** జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని బాలాపూర్ గణేశ ఉత్సవ సమితి కలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బాలాపూర్ గణేశ నవరాత్రి వేడుకలకు గణేశ ఉత్సవ సమితి ఆహ్వా నించింది. కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ పారిజాత నర సింహారెడ్డి, బాలాపూర్ గణేశ ఉత్సవ సమితి చైర్మన్ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఖైరతాబాద్ గణేశ అడ్‌హాక్ కమిటీ కలిసింది. ఎమ్మెల్యే దానం నాగేందర్ నేతృత్వంలో అడ్‌హాక్ కమిటీ శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి-2025 నవరాత్రి ఉత్సవాలకు సిఎంను ఆహ్వానించింది.

# రాష్ట్రంలో యూరియా కొరత లేదు

## కాంగ్రెస్ చేస్తున్నది తప్పుడు ప్రచారం
## బిసి రిజర్వేషన్లు బిసిలకు ఇవ్వాలి
## నిజామాబాద్ జిల్లా పర్యటన సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసిలకు చెందాల్సిన రిజర్వేషన్లు బిసిలకే దక్కాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. సోమ వారం నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఇందూర్‌లో బూత్ స్థాయి సభ్యుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు యూరియా కొరత అంటూ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, బిజెపి ఎక్కడా కూడా యూరియా పంపిణీని ఆపలేదు. తెలంగాణకు అవసరమైనంత మేరకు యూరియా సరఫరా చేసిందన్నారు. తెలంగాణలో నడుస్తోంది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన కృత్రిమ యూరియా కొరత మాత్రమే అన్నారు. తాను పలు జిల్లాల్లో పర్యటించి కలెక్టర్లతో మాట్లాడానని, ఎక్కడా కూడా యూరియా కొరత లేదని వారు చెప్పారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటగా రైతులకు బేడీలు వేసిన ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వమని, రైతుల ఆత్మ హత్యలు ఎక్కువగా జరిగినది కూడా బిఆర్ఎస్ పాలనలోనే. అందుకే రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్‌కు లేదన్నారు. ఈ సందర్భంగా ఎంపి ధర్మ పురి అర్వింద్ జన్మదినం సందర్భంగా హృద యపూర్వక శుభా కాంక్ష లు తెలిపిన ఆయన రూ.25 లక్షల వరకు ధర్మపురి అర్వింద్ ట్రస్ట్ ద్వారా కార్యకర్తల సంక్షేమం కోసం వితరణ చేశా రు. కార్యకర్తల పట్ల అర్వింద్‌కి ఉన్న ప్రేమ గొప్పది అన్నారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు రావడం ప్రధాని నరేంద్ర మోడీ గొప్పతనం, అర్వింద్ అలుపెరుగని ప్రయత్నం అన్నారు. ప్రధాని మోడీ తెలంగాణలో 32 లక్షల మంది రైతులకు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద మూడు విడతల్లో రూ.2 వేల చొప్పున మొత్తం రూ.6 వేలు రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. తెలం గాణలో రైతుబంధు బంద్ అయిందని, తెలంగా ణలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల పేరుతో, గ్యారంటీల పేరుతో అనేక వాగ్ధానాలు చేసి మాట తప్పిందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వలేదని, రైతు భరోసా సరిగ్గా ఇవ్వలేద న్నారు. 19 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3,500 ఇండ్ల చొప్పున పేదలకు ఇళ్లు కడతామని చెప్పారు, కానీ అమలు చేయలేదన్నారు. అన్నీ అబద్ధాలతోనే కాంగ్రెస్ కాలయాపన చేస్తుంద న్నారు. ఓటు చోరీతోనే గెలుస్తోందని టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ ఆరోపించారు.

## ఇండియన్ వెయిట్‌లిఫ్టింగ్ సభ్యురాలుగా శ్రుతి

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ (ఐడబ్ల్యూ ఎఫ్) ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎం. శ్రుతి ఎంపిక య్యారు. అహ్మదాబాద్ వేదికగా సోమవారం జరిగిన జాతీయ సమ్మేళనంలో వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్‌కు ఎన్నికలు జరిగాయి. ఇందులో శ్రుతి జాతీయ కార్యవర్గ సభ్యురాలుగా ఎన్నికైనట్లు ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు సహదేవ్ యాదవ్ ప్రకటించారు.

వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్‌కు విశేషంగా సేవలు అందించిన శ్రుతి ప్రస్తుతం ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్, రాష్ట్ర శాఖకు అధ్యక్షుడుగా పనిచేస్తున్నారు.

26-8P□g7exHMNWJQE 11_26-8P□g7exHMNWJQE.qxd 8/26/2025 12:09 AM Page 1





ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో సమావేశమైన ఎంపి అసదుద్దీన్ ఒవైసి

## హైదరాబాద్‌లో ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించాలి : ఎంపి అసదుద్దీన్‌ఒవైసి

**హైదరాబాద్ (యాకుత్‌పుర), ఆగస్టు 25, ప్రభాతవార్త :** ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను సోమవారం ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసి కలిశారు. కొద్ది రోజులుగా హైదరాబాద్ నగరంలో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవటంతో ప్రజలు ఇబ్బందుల పాల వుతున్నారని ఎంపి ఒవైసి.. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్ట్యా నిలిచిపోయిన ఇంటర్నెట్ సేవలు వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ఈ సమావేశంలో మలక్‌పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్‌బిన్ అబ్దుల్లా బలాలతోపాటు పలువురు పాల్గొన్నారు.

## కూరగాయలకు ఇతర రాష్ట్రాలే దిక్కు

### యేటా 19 లక్షల టన్నుల కొరత

### రాష్ట్ర అవసరాల్లో బయట నుండి 60 శాతం

### మహారాష్ట్ర క్యాలీఫ్లవర్, యుపి మిర్చి, జైపూర్ టమోట

### కొరత ఉన్న వాటిపై దృష్టి సారించని ఉద్యాన శాఖ

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వినియోగించే కూరగాయలకు సంబంధించి ఉద్యాన శాఖ వైఫల్యంతో ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. జనాభా అవసరాలకు తగినట్లుగా రాష్ట్రంలో కూరగాయల సాగు జరగడం లేదు. రాష్ట్రంలో కొరత ఉన్న కూరగాయలను ప్రోత్సహించి, వాటిని సాగు చేయించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. ఫలితంగా రాష్ట్ర అవసరాల్లో 60 శాతం ఇతర రాష్ట్రాల నుండే దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో కూరగాయల సాగు చేసేందుకు ప్రోత్సాహం లేక, తగిన సమాచారం, సలహాలు ఇచ్చేవారు లేక వాటి సాగు పట్ల రైతాంగం పెద్దగా ఆసక్తి చూపడం లేదు. చివరకు పచ్చి మిర్చికి కూడా ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన అగత్యం ఏర్పడింది. రాష్ట్ర వ్యాప్తంగా 3.10 లక్షల ఎకరాల్లో కూరగాయల సాగు అవుతున్నట్లు ఉద్యాన శాఖ లెక్కలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో ఏడాదికి 42 లక్షల టన్నుల కూరగాయలు అవసరం కాగా 23 లక్షల టన్నులు మాత్రమే సాగవుతోంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 19 లక్షల టన్నుల కూరగాయల కొరత ఏర్పడుతోంది. ఫలితంగా పంటలు అధికంగా పండే తెలంగాణలో ప్రస్తుతం కాయగూరలు ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. వేసవిలో అన్ సీజన్‌లో 60 శాతం నుండి 70 శాతం కూరగాయలు ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి అవుతున్నాయి. సాగు ఎక్కువగా జరిగే అక్టోబరు నుండి మార్చి వరకూ మాత్రమే 50 శాతం కూరగాయలు దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే మహారాష్ట్ర నుండి క్యాలీఫ్లవర్, రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ నుండి టమోటాలు, ఉత్తరప్రదేశ్ నుండి పచ్చిమిర్చి తెలంగాణ రాష్ట్రంలోకి వస్తోంది. శ్రీలంకలో సంక్షోభం కారణంగా ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి ఆ దేశానికి టమోటాలు, ఇతర కూరగాయలు సరఫరా అవుతుండడంతో తెలంగాణలో కూరగాయల ధరలు భారీగా పెరిగినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా జైపూర్ నుండి టమోటాలు, ఉత్తరప్రదేశ్‌లోని సంబాల్ మార్కెట్ నుండి పచ్చిమిర్చి, మహారాష్ట్ర నుండి క్యాలీఫ్లవర్ హైదరాదాబాద్‌తో సహా తెలంగాణలోని పలు పట్టణాలకు వచ్చినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో కూరగాయల ధరలు గత నెలతో పోలిస్తే చెప్పకోదగ్గ స్థాయిలో పెరిగాయి. నెల క్రితం కిలో 10 రూపాయలకు అమ్మిన టమోటా ప్రస్తుతం హైదరాబాద్‌లో క్వాలిటీని బట్టి 150 రూపాయలు పలుకుతోంది. బోడ కాకరకాయలు అయితే కిలో 400 రూపాయలు, మిర్చి 130 రూపాయలు, ఇక బీరకాయ, బెండకాయలు తదితర కూరగాయలు అన్నీ కిలోకు 60 రూపాయల పైబడి ధరలు పలుకుతున్నాయి. ఇక క్యాబేజీ విషయానికి వస్తే అన్ని రాష్ట్రాల నుండి హైదరాబాద్‌కు 1,650 క్వింటాళ్లు వస్తోంది. అయితే ఇటువంటి కూరగాయలను తెలంగాణలోనే పండించే అవకాశం ఉన్నా ఉద్యాన శాఖ నిర్లక్ష్యం కారణంగా ఇతర రాష్ట్రాలే దిక్కవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## ఇండియా కూటమి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికే మద్దతు

### డిసెంబర్‌లో పార్టీ శతజయంతి వేడుకలు

### సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఉపరాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఇండియా కూటమి అభ్యర్థి సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా ప్రకటించారు. సోమారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తప్పు చేస్తే ఏ ప్రభుత్వాన్ని అయినా నిలదీసే హక్కు ప్రజలకు, ప్రతిపక్షాలకు ఉంటుందన్నారు. భారత ఎన్నికల కమిషన్ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారిందని విమర్శించారు. కుల రాజకీయాలు, మత రాజకీయాలకు కేరాఫ్‌గా బిజెపి నిలిచిందని మండిపడ్డారు. ఓట్ల చోరీతో బిజెపి అధికారంలోకి రావడం చాలా అన్యాయమని.. ఇంతకంటే దౌర్భాగ్యం మరొకటి లేదన్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో సిపిఐ పార్టీ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించ నున్నట్టు తెలిపారు.

## ఎసిబి వలలో వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

### రూ.25 వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన వైనం

**చుంచుపల్లి, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఫెర్టిలైజర్ షాపు యజమాని నుంచి లంచం తీసుకుంటూ వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఏసీబీ అదికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏసీబీ డీఎస్పీ రమేష్ వెల్లడించారు. మండలంలోని విద్యానగర్ కాలనీలో ఉన్న వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహారావు ఇటీవల తనిఖీల్లో భాగం గా యూరియా అమ్మ కాలకు సంబంధించి పాల్వంచ మండలంలోని ఉల్వనూరులో ఉన్న ఫెర్టిలైజర్ షాపు సిబ్బం దిని మీ వద్ద ఎలాంటి లైసెన్సులు లేవని బెదిరించి రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో వారు ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు సంబంధిత వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు ఫోన్ చేసి తాము అంత ఇచ్చుకోలేమని చెప్పడంతో రూ.30 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు తాము రూ.25 వేలు ఇస్తామని చెప్పడంతో సదరు అధికారి ఒప్పుకున్నారు. దీంతో రూ.25 వేలు నగదును సదరు అదికారికి ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



ఎసిబికి పట్టుబడిన వ్యవసాయ అధికారి నరసింహారావు

## ఎస్సారెస్పీలోకి వారం రోజుల్లో 128.394 టిఎంసిల వరదనీరు

### 61.449 టిఎంసిలు బయటకు విడుదల చేసిన అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరామసాగర్ జలాశయంపై ఎగువన మహారాష్ట్ర జైక్వాడ్ నుంచి బాబ్లీ వరకు అనేక ప్రాజెక్టులు నిర్మించి బేసిన్ బయటి ప్రాంతాలకు నీటిని తరలిస్తుండటంతో ప్రతియేడు ఎస్సారెస్పీకి నీరు వచ్చి చేరుతుందా లేదా అనే అనిశ్చితి నెల కొంటుంది. బాబ్లీ ప్రాజెక్ట గేట్లు సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ప్రతి యేడు జూలై 1న ఎత్తి అక్టోబర్ 29న దించి వేయాల్సి ఉంటుంది. అంతేకాదు మార్చి 1న బాబ్లీ గేట్లు ఎత్తి 0.6టిఎంసి నీటిని ఎస్సారెస్పీకి వదలాల్సి ఉంటుంది. ఈ సంవత్సరం బాబ్లీ గేట్లు ఆనవాయితీగా ఎత్తినా కూడా ఆగస్టు రెండో వారం పెద్దగా నీరు వచ్చి చేరలేదు. మూడోవారం మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల కారణంగా వరద ఎస్సారెస్పీలోకి పోటెత్తింది. వారం రోజుల్లోనే 128.394 టిఎంసిల నీటిని ఎస్సారెస్పీ ఒడిసిపట్టింది. అందులో 61.449 టిఎంసిల నీరు ఇందిరమ్మ ఫ్లడ్‌ఫ్లో, మిషన్‌భగీరథ, నిజామాబాద్, నిర్మల్ టిఎస్‌ఐడి పథకాలద్వారా, గుప్త లిఫ్ట్ ఇరిగేషన్, అనిసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్, లక్ష్మీ కెనాల్, కాకతీయ మెయిన్ కెనాల్, జల విద్యుత్ ఉత్పత్తి వంటి అవసరాలు తీర్చుకోవడానికి వినియోగించడంతో పాటు స్పిల్‌వే ద్వారా దిగువకు విడుదల చేసిన 34 టిఎంసిల నీరు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వచ్చిచేరింది. శ్రీరామ సాగర్‌కు ప్రస్తుతం సోమవారం రాత్రి8గంటల వరకు ఎగువ నుంచి 30వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరుతోంది. అదే స్థాయిలో నీటిని బయటకు వదిలిపెడుతున్నారు. నీటిమట్టం 1090.90 ఫీట్ల ఎత్తులో 80టిఎంసిలనీరు ఇప్పు డు అందులో ఉంది. ఉష్ణోగ్రత పెరిగి పోవడంతో రోజుకు 666 క్యూసెక్కుల నీరు ఆవిరిగా వృధా అవుతోన్నది. జూరాల జలాశయానికి కూడా 3.88 లక్షల క్యూసెక్కుల వరదనీరు ఎగువన కర్ణాటక నుంచి ఆదివారం రాత్రి వరకు వచ్చిచేరింది.

## చంద్రబాబు, వైఎస్ హయాంలో హైదరాబాద్ అభివృద్ధి కుంటుపడలేదు

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** చంద్రబాబు, వైఎస్ ఉన్నప్పుడు కూడా హైదరాబాద్ అభివృద్ధి కుంటుపడలేదని, అదే హైదరాబాద్ అభివృద్ధిని అణగదొక్కో మీ కుటుంబం వాడుకొని ఆర్థికంగా ఎదిగిందని ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం గాంధీభవన్ ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌ను కెసిఆర్ కని పెట్టినట్లు కెటిఆర్ మాట్లాడుతున్నారని అన్నారు. కెటిఆర్‌కి తెలియక మాట్లాడుతున్నారా అర్థం కావడం లేదని అభిప్రా యపడ్డారు. కెసిఆర్ హయంలో నాలుగు ఫ్లై ఓవర్లు, దుర్గం చెరువు సెల్ఫ్ పాయింట్ తప్ప ఏం కాలేదని ఆయన చెప్పారు. బరాబర్ ఎన్నికలు పెడతాం 42 శాతం అంతేకాదు బిసి రిజర్వేషన్ ఇస్తామని ప్రకటించారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఎన్నికలు వెళ్ళే దమ్ము ఉందా అని అంటున్నారు. పదేళ్లలో 60 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారితే, అప్పుడు మీ దమ్ముకు దుమ్ము పట్టిందా? అని నిలదీశారు. హైదరాబాద్‌లో ఎక్కువ ఎమ్మెల్యేలు గెలిచినా పార్లమెంట్‌లో సున్న వచ్చింది. కంటోన్మెంట్‌లో మూడో స్థానం వచ్చింది. ప్రెస్‌మీట్ మూడు పూటలు పెట్టకపోతే మిమ్మల్ని ప్రజలు మర్చిపోతారనుకుంటున్నారు. హరీశ్‌రావు వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న ప్పుడు డెంగ్యూ మరణాల సంఖ్య ఎంత ఉంది. కేవలం రేవంత్‌రెడ్డి హయంలో మాత్రమే డెంగ్యూ వస్తుందన్నట్లు చెబుతున్నారని అన్నారు. బిసిపై బిజెపి, బిఆర్ఎస్ లకు చిత్తశుద్ధి ఉంటే 42శాతం పార్టీ పరంగా ఇస్తామని ప్రకటిం చండి. రేవంత్ రెడ్డికి బిజెపి ఎంపిలు కాపాడితే తెలంగాణ నంబర్ వన్ అయ్యేదని అన్నారు. మెట్రో ఫేజ్ 2 వచ్చేది. పది మంది ఎమ్మెల్యేలు ఏ పార్టీ లో ఉన్నారో చెప్పుకోవడం అనేది వాళ్ళ ఇండిజ్యుల్ కెపాసిటీ అని తెలిపారు. చంద్ర బాబుకు ఇచ్చే ఇంపార్టెన్స్ బిజెపి ఎంపిలకు కేంద్రం ఇవ్వడం లేదు. తెలంగాణకు రావాల్సిన వాటాను గుజరాత్, ఎపికి కేంద్రం పంపుతుందని అవేదన చెందారు.




సోమవారం గాంధీభవన్ మాట్లాడుతున్న ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**ఎంఎంటిఎస్‌తో భువనగిరి ప్రజల కష్టాలు తీరుతాయి**

ఘట్కేసర్ నుండి యాదాద్రి భువనగిరి ఎంఎంటిఎస్ రైలు భూసేకరణ కోసం యాదాద్రి కలెక్టర్, మేడ్చల్ కలెక్టర్‌లు కృషిచేస్తున్నారని భువగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ఎంపి చామల సికిందరాబాద్‌లోని రైల్ నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవను కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటిని త్వరితగతిన పనులు పూర్తి చేసి యాదాద్రికీ వచ్చే భక్తులకు, అప్ అండ్ డౌన్ కార్మికుల కష్టాలు తీరుతాయని ఆయన చెప్పారు.

## 'స్థానిక' ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధం చేయాలి

### సత్యాగ్రహ దీక్షలో ఎంపి ఆర్.కృష్ణయ్య

### మద్దతు తెలిపిన ఎంపి ఈటల రాజేందర్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీమంత్రి శ్రీనివాసగౌడ్ తదితరులు



సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న ఎంపి ఈటల రాజేందర్

**హైదరాబాద్(ధర్నాచౌక్), ఆగస్టు 25, ప్రభాతవార్త:** స్థానిక సంస్థ ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు చట్టబద్ధం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఆర్.కృష్ణయ్య చేపట్టిన సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈదీక్షకు మల్కా జిగిరి పార్లమెంట్ సభ్యు డు ఈటల రాజేందర్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్, బీసీ కమీషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, గువ్వల బాలరాజు, ఐఏఎస్ చిరంజీవులు తదితరులు హాజరై మద్దతు తెలిపారు. ఈ సంద ర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు జనాభా ప్రకారం సమాన వాటా కావాలని డిమాండ్ చేశారు. 76 సంవత్స రాలుగా ముఖ్య మంత్రి, మంత్రి పదవులు కూడా మీరే తీసుకుంటున్నారని, మాకు కనీసం సర్పంచులు, కౌన్సిలర్లు కూడా వద్దా అని ప్రశ్నించారు. 42 శాతం రిజర్వేషన్లు అని హామీ ఇచ్చి, ఇప్పుడు పార్టీ పరంగా ఇస్తామని ప్రకటిస్తున్నారని, పార్టీల పరంగా మాకు భిక్షం వద్దని, 42శాతం రిజర్వేషన్ మా హక్కు, మా హక్కు మాకు కావాలని స్పష్టం చేశారు. ఈటెల రాజేందర్ మాట్లాడుతూ 42శాతం రిజర్వేషన్ల కోసం ఆర్.కృష్ణయ్య చేస్తున్న సత్యాగ్రహదీక్షకు సంపూర్ణంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాకమాటలు బందుపెట్టి, తక్షణమే 42శాతం రిజర్వేషన్లు అమలుచేసి, స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో ఓడిపోతామని భయంతో బీసీ సమస్య అడ్డుపెట్టుకుని అది తేలేవరకు ఎన్నికలు జరపమని మోసం చేసే ప్రయత్నం చేస్తే తెలంగాణ బీసీ సమాజం మిమ్మల్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఒక బీసీ ప్రధానమంత్రి, 27మంది ఓబీసీలను మంత్రులుగా చేయగలిగిన పార్టీ భారతీయజనతాపార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. ఉపరాష్ట్రపతి పదవిని కూడా ఓబీసీకి ఇచ్చి, సన్మానించుకున్న చరిత్ర మనకు తెలుసన్నారు. దీక్షా కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, నీల వెంకటేష్, లాల్‌కృష్ణ, వేముల రామకృష్ణ, బర్క కృష్ణ, రాజేందర్, బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్ గౌడ్, దూదిమెట్ల బాలరాజ్, రాజారామ్‌యాదవ్, బి.ఎస్.రాములు తదితరులు పాల్గొన్నారు.

## అనాజ్‌పూర్ రైతులకు పట్టాదార్ పాసుపుస్తకాలు ఇవ్వాలి

### జాన్‌వెస్లీతోపాటు, రైతు నేతల అరెస్టును ఖండిస్తున్నాం: సిపిఎం రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా అనాజ్‌పూర్ రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు వెంటనే ఇవ్వాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అనాజ్‌పూర్ భూపోరాటం నేపథ్యంలో సోమవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్య దర్శివర్గ సభ్యులు ఇ. నర్సింహ, రైతుసంఘం జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని పార్టీ రాష్ట్ర కమిటీ మండిపడింది. సిపిఎం పార్టీ నాయకులతోపాటు సంబంధిత రైతులను పోలీసులు అక్రమంగా అరెస్టుచేసి పహడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని తీవ్రంగా ఖండి స్తున్నామని పార్టీ రాష్ట్ర ఆఫీస్ ఇన్‌ఛార్జ్ జె బాబురావు ఒక ప్రకటనలో తెలిపారు. అరెస్టు చేసిన అయిన వారిని తక్షణమే విడుదల చేసి, బాధిత రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చి, ప్రభుత్వ పథకాలన్నీ వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లా పూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ రెవెన్యూ సర్వే నంబర్లు 274, 275, 276, 277, 278, 281లో 125 ఎకరాల సీలింగ్ భూమిని 125 మంది పేదలకు 1991 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం అసైన్డ్ చేసి, సర్టిఫికేట్లు, పట్టాదారు పాసుపుస్తకాలను జారీ చేసిందన్నారు. అట్టి భూములను నాటి నుండి నేటి వరకు రైతులు సాగు చేసుకుంటున్నారని.. కానీ ధరణి పోర్టల్ ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు నమోదు చేయలేదన్నారు. ఇప్పటికీ ధరణి పాసుపుస్తకం ఇవ్వ లేదని.. దీంతో రైతు భరోసా, రైతుబీమా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, బ్యాంకు లోన్లు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చి న్యాయం చేయాలని బాధిత రైతులు గత ఎనిమిదేళ్ళుగా అనేకసార్లు జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దారును కలిసినా ఫలితం లేదన్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం) అబ్దుల్లాపూర్‌మెట్టు మండల కమిటీ బాధిత రైతులకు అండగా నిలబడిందని.. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు, బాధిత రైతులు భూమి దగ్గరకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని వారిని అక్రమంగా అరెస్టులు చేశారని మండిపడ్డారు.

తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని బాధిత రైతులకు న్యాయం చేయాలని, అక్రమంగా అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## పోలీసు పహారా మధ్య ముగిసిన స్వాతి అంత్యక్రియలు

### మూసీలో లభ్యంకాని మృతురాలి శరీర భాగాలు

### మొండెంతోనే అంత్యక్రియలు పూర్తిచేసిన కుటుంబీకులు

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** భర్త చేతిలో అత్యంత దారుణంగా హత్యకు గురైన గర్భిణీ స్వాతి అంత్యక్రియలు సోమవారం వికారాబాద్ జిల్లా కామారెడ్డి గూడలో ముగిసాయి. తొలుత స్వాతి ముఖం, చేతులు, కాళ్ల వెతికి పూర్తి శరీరం అప్పగిస్తేనే అంత్యక్రియలు నిర్వహిస్తామని స్వాతి తల్లిదండ్రులు ఆందో ళనకు దిగారు. కానీ, భారీవర్షాల నేపథ్యంలో మూసీ ఉధృతంగా ప్రవహించ డంతో ఎంత గాలించినా శరీరభాగాలు లభ్యం కాకపోవడంతో పోలీసులు, గ్రామస్థులు వారిని అంత్యక్రియలు చేసేలా ఒప్పించారు. నిందితుడికి చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించాక స్వాతి మొండేన్ని కామారెడ్డిగూడకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. నిందితుడు మహేందర్‌రెడ్డి తీరుపై గ్రామస్థులు ఆగ్రహంతో మండిపడ్డారు. నిందితుడి ఇంటిముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోకి మహేందర్ కుటుంబసభ్యులను రానివ్వమని తేల్చిచెప్పారు. పోలీసులు భారీగా మోహరించి, అంత్యక్రియలు పూర్తి చేయించారు. నిందితుడు మహేందర్‌రెడ్డి పెద్దసైకో అని, స్వాతితో తరచూ గొడవపడేవాడని స్వాతి సోదరి శ్వేత తెలిపింది. తన అక్కను అతికిరాతకంగా చంపిన వాడికి బతికే అర్హత లేదని, వెంటనే చంపేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. వాడు ఒకవేళ జైలు నుంచి విడుదలైతే తమ కుటుంబాన్ని కూడా అంతం చేస్తాడంటూ రోదించింది.

లేకపోతే మహేందర్‌రెడ్డిని తమకు అప్పగించాలని, మా అక్కను ఎలాగైతే చంపాడో వాడిని అలాగే చంపుతామని ఆవేదన వ్యక్తం చేసింది. స్వాతి హత్యకు కొద్దిరోజుల ముందు మహేందర్‌రెడ్డి తాను ఉండే హాస్టల్ దగ్గరికి వచ్చి కలిశాడని, ఈ విషయం స్వాతికి చెప్పొద్దని అన్నాడని చెప్పింది. అలాగే తాము గొడవ పడుతున్న విషయం గురించి అమ్మనాన్నలకు చెప్పొద్దని స్వాతి కూడా తనతో చెప్పినట్లు తెలిపింది. నిందితుడికి వెంటనే ఉరిశిక్ష విధించాలని పోలీసులను ప్రాధేయపడింది.

తన భార్య స్వాతిని హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని మాయం చేసే ప్రయత్నంలో ఆమె శరీర భాగాలను ముక్కలు ముక్కలుగా రంపంతో కోసి ప్రతాపసింగారం వద్ద గల మూసీలో విసిరేశాడు నిందితుడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. జీహెచ్‌ఎంసీ, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలతో సహాయంతో శరీర భాగాలను వెతికించారు. ఆదివారం పది కిలోమీటర్ల మేర గాలించిన అవి లభ్యం కాలేదు. ఈ క్రమంలో తిరిగి మళ్లీ సోమవారం మరోసారి డీఆర్‌ఎఫ్ బృందాలు బోట్ల సహాయంతో గాలించిన ఫలితం లేకుండా పోయిందని పోలీసులు పేర్కొన్నారు.

## శంషాబాద్ విమానాశ్రయం నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఆర్‌టిసి బస్సు

### ఆర్‌టిసి ఎండి సజ్జనార్

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయమైన శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలానికి ఆర్‌టిసి నేరుగా బస్సును నడపనుంది. ఈ సౌకర్యాన్ని భక్తులు ఉపయోగించుకోవాలని ఆర్‌టిసి ఎండి విసి సజ్జనార్ 'ఎక్స్' వేదికగా సూచించారు. శ్రీశైలం వెళ్లాలనుకునే భక్తుల సౌకర్యార్థం విమానాశ్రయానికి సమీపంలో ఉన్న ఆర్‌జిఐఎ క్రాస్ రోడ్స్ వద్ద కొత్తగా బోర్డింగ్ పాయింట్‌ని టిజిఎస్ ఆర్‌టిసి ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్ట్ నుంచి పుష్పక్ బస్సుల్లో సమీపంలో ఉన్న ఆర్‌జిఐఎ బోర్డింగ్ పాయింట్‌కి భక్తులు ప్రయాణించి.. అక్కడి నుంచి ఆర్‌టిసి బస్సుల్లో శ్రీశైలానికి వెళ్లొచ్చని తెలి పారు. ఈ బోర్డింగ్ పాయిం ట్ నుంచి ప్రతి 20 నిమిషాలకి ఒక బస్సు శ్రీశైలానికి అందుబాటులో ఉంటుందన్నారు. ఎయిర్‌పోర్టు నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు టిజిఎస్‌ఆర్‌టిసి బస్.ఇన్ వెబ్‌సైట్‌లోనూ ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని.. రిజర్వేషన్ సమయంలో వారు ఆర్‌జిఐఎ క్రాస్‌రోడ్ బోర్డింగ్ పాయింట్‌ని ఎంచుకోవాలన్నారు. శ్రీశైలం వెళ్లే భక్తులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని టిజిఎస్ ఆర్‌టిసి కోరుతోందని సజ్జనార్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

## అడ్‌హాక్ కమిటీ యూరియా సరఫరాలో కేంద్ర వైఫల్యం

### కేటాయింపుల కోసం ఎంతకైనా పోరాడతాం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బహిరంగ లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** రాష్ట్రానికి యూరియా సరఫరా చేయడంలో కేంద్రం ఘోరంగా వైఫల్యం చెందిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఇప్పటికే పాత నిల్వలతో కలుపుకొని 7.32 లక్షల టన్నుల యూరియాను రైతులకు అందించడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు సోమవారం రైతులకు బహిరంగ లేఖ విడుదల చేశారు. కేంద్ర అసమర్థతను రాష్ట్ర ప్రభుత్వంపై నెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇతర దేశాల నుంచి దిగుమతి కావల్సిన యూరియా నిలిచిపోవడం, దేశీయంగా డిమాండ్ కు తగ్గ ఉత్పత్తి లేక అన్ని రాష్ట్రాల్లోనూ యూరియా కొరత ఉందన్నారు. తెలంగాణకు కేంద్రం ఈ ఖరీఫ్ సీజన్‌లో 9.80 లక్షల టన్నుల యూరియా కేటాయింపు చేయగా, ఇందులో ఇప్పటి వరకు 5.72 లక్షల టన్నులు మాత్రమే సరఫరా చేసిందని చెప్పారు. ఇంకా 2.58 లక్షల టన్నుల యూరియా సరఫరా చేయలేదని, దీంతో డిమాండ్‌కు తగ్గట్టు నిల్వలులేక రాష్ట్రంలో ఇబ్బందులు తలెత్తాయని వివరించారు. దిగుమతి యూరియాలో ఇబ్బందులు తలెత్తుతాయని ముందే గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి స్వదేశీ యూరియానే కేటాయించాలని ఎన్నోసార్లు కోరినా పట్టించుకోలేదని తప్పుపట్టారు. యూరియా కొరతపై సొసైటీల వద్ద చెప్పులు క్యూ లైన్ లో పెట్టించడం, బర్త్ డే వేడుకలు పేరుతో బస్తా గిఫ్ట్ ఇచ్చినట్లు స్కిట్ లు చేయడం, మహిళలను క్యూ లో నిలబెట్టి కొరత ఉందని అసత్యాలు ప్రచారం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసే దిగజారుడు రాజకీయానికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్రం తరపున రాష్ట్ర రైతాంగానికి యూరియా సరఫరాలో జరిగిన ఆలస్యానికి చింతిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులకు కారణం ఎవరో రైతులు తెలుసుకోవాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

## ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలి

### మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్(ధర్నాచౌక్), ఆగస్టు 25, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో బీఆర్‌టియూ అనుబంధ సంఘమైన తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల (ఆశా) సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిధిగా హాజరై హరీష్‌రావ్ మాట్లాడుతూ ఆనాడు ఎన్నికల సమయంలో మమ్మల్ని గెలిపించండి ఫిక్స్‌డ్ వేతనం 18వేలు ఇస్తామని ఆశా వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ మాటలు నమ్మి, ఆశావర్కర్లు ఓట్లు వేసి గెలిపించారు కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని అమలుచేయలేదని ఆరోపించారు. ఆశావర్కర్లు కేవలం రేవంత్‌రెడ్డి ఏమాట ఇచ్చారో ఆ మాటను నెరవేర్చండి అని అడుగుతున్నారు తప్ప గొంతెమ్మ కోర్కెలు కోరటం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశావర్కర్లకు ఇచ్చిన మాటలు నెరవేరుస్తారా లేక ఉద్యమించమంటారా అని ప్రశ్నించారు. సంఘం గౌరవాధ్యక్షులు, బీఆర్‌టియూ రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబుయాదవ్ మాట్లాడుతూ ఆశాల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. ధర్నా కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, టీఆర్‌టియూ ఉపాధ్యక్షులు బి.శివశంకర్, సంఘం అధ్యక్షురాలు ఆర్.సంతోష, ప్రధాన కార్యదర్శి బి.మంజుల తదితరులతోపాటు వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన ఆశాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పత్తి రైతులకు మద్దతు ధర

### అందుబాటులోకి కాటన్ కార్పొరేషన్ ప్రత్యేక యాప్

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** పత్తి రైతులకు మద్దతు ధర అందుకునేందుకు కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా కొత్తగా ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'కపాస్ కిసాన్' పేరుతో రైతుల నిమిత్తం ఈ కొత్త యాప్‌ను రూపొందించింది. కాటన్ కార్పొరేషన్ అధికారవర్గాలు వెల్లడించిన వివరాలు ప్రకారం పత్తి వేసిన రైతులు వారు పేర్లను సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు ఈ యాప్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధంగా ఈ యాప్‌లో నమోదు చేసుకున్న రైతులు కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు కేంద్రాల్లో పత్తి పంటను అమ్ముకునే అవకాశం కల్పించింది. ఈ మేరకు ఈ యాప్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ సిబ్బందికి ఆదేశాలు జారీ అయ్యాయి. ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత ఈ యాప్‌లో ఆధార్ కార్డు, మీ భూమి రికార్డులు, పత్తి పంటకు సంబంధించిన వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. తద్వారా దేశవ్యాప్తంగా పత్తి రైతులు ఎందరున్నారు, వారికి వేసిన పత్తి పంట విస్తీర్ణం ఎంత అనే వివరాలు అన్నీ కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా వద్ద రికార్డ్ అవుతాయి. ఈ ఏడాది పత్తికి కనీస మద్దతు ధర రూ.8,110గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కపాస్ కిసాన్ యాప్‌లో రిజిస్టర్ అయిన రైతులు పత్తిని అమ్మే సమయంలో స్లాట్ బుక్ చేసుకోవాలి. అప్పుడు ఏ రోజు పత్తిని సీసీఐ కేంద్రానికి తీసుకెళ్లాలో యాప్ వివరాలు పంపుతుంది. ఈ పద్ధతి వల్ల పత్తిని అమ్ముకునేందుకు రైతులకు నీరీక్షణ సమస్యలు ఉండవని, ప్రధానంగా వారికి మద్దతు ధరలు దక్కుతాయని కాటన్ కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు.

26-08pg10 12 ONG_26-08pg10.qxd 8/25/2025 10:25 PM Page 1



## మహిళల ఆర్చరీ వరల్డ్ టోర్నీ..
# ప్రపంచ ఛాంపియన్‌గా శార్వరి



**న్యూఢిల్లీ:** వరల్డ్ యూత్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్-2025లో భారత్‌కు చెందిన శార్వరి షెండే ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. కెనడాలోని విన్నిపెగ్‌లో సోమవారం జరిగిన అండర్ 18 మహిళల వ్యక్తిగత రికర్వ్ విభాగంగా శార్వరి బంగారు పతకాన్ని గెలుచుకుంది. దక్షిణ కొరియాకు చెందిన కిమ్ యెవాన్‌తో తీవ్రంగా పోరాడిన శార్వరి ఫైనల్లో 6-5 తేడాతో గట్టి పోటీని ఎదుర్కొని ఛాంపియన్‌షిప్ సాధించింది. 16 ఏళ్ల శార్వరి మొదటి మూడు సెట్లలో రెండింటిని గెలుచుకుని, మరొక సెట్‌ను సమం చేసి ఫైనల్‌లో 41-తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే, కిమ్ తరువాతి రెండింటినీ గెలిచి స్కోర్‌లను సమం చేయడానికి మరియు షూట్‌ఆఫ్ చేయడానికి పోరాడింది. దక్షి ణ కొరియా ఆర్చర్ షూట్‌ఆఫ్‌లో తడబడి తొమ్మిది పరుగులు చేసింది. అయితే శార్వరి మ్యాచ్‌ను ముగించాల్సి న ఒత్తిడితో అద్భుత ప్రదర్శన చేసి 10 పరుగులు చేసి ఉత్కంఠభరితమైన ఫైనల్‌ను గెలుచుకుంది. దీంతో ప్రస్తుతం జరుగుతున్న 2025 ప్రపంచ యూత్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం గెలుచుకున్న రెండవ భారతీయ మహిళగా శార్వరి గుర్తింపు పొందింది. అంతకు ముందు రోజు తనపర్తి చికిత అండర్ 21 విభాగంలో మహిళల కాంపౌండ్ వ్యక్తిగత స్వర్ణాన్ని గెలుచుకుంది.

## బుచ్చిబాబు క్రికెట్ టోర్నీలో..
# హైదరాబాద్ రెండో విజయం



**జార్ఖండ్ 2 వికెట్లు తేడాతో చిత్తు**

న్యూఢిల్లీ: ఆలిండియా బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ హైదరాబాద్ జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. జార్ఖండ్‌తో జరిగిన మూడు రోజుల మ్యాచ్‌లో భాగంగా సోమవారం హైదరాబాద్ 2 వికెట్లు తేడాతో గెలిచింది. జార్ఖండ్ నిర్దేశించిన 84 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన హైదరాబాద్ 22.3 ఓవర్లలో 8 వికెట్లు కోలోనఊపయి 89 పరుగులు చేసింది. స్కోరు 83 వద్ద అనికేత్ సిక్స్ కొట్టి హైదరాబాద్ విజయాన్ని ఖరారు చేశాడు. జార్ఖండ్ తొలి ఇన్నింగ్స్‌లో 89.3 ఓవర్లలో 283 పరుగులకు ఆలౌట్ అయింది. హైదరాబాద్ బౌలర్లు తనయ్ త్యాగరాజన్ (4/75), రోహిత్ రాయుడు (4/69) రాణించారు. అనంతరం హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 82.4 ఓవర్లలో 330 పరుగులకు ఆలౌటై 47 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. నితీశ్ (106, 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ చేయగా, రాహుల్ రాధేశ్ (70, 6 ఫోర్లు, 1 సిక్స్), వరుణ్ (65, 3 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. 47 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన జార్ఖండ్ 25.3 ఓవర్లలో 130 పరుగులకు కుప్పకూలింది. హైదరాబాద్ బౌలర్లు తనయ్ త్యాగరాజన్ (4/74), అనికేత్ (3/25) ఆకట్టుకున్నారు. 84 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ ఒక దశలో 61 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమి దిశగా సాగింది. అయితే రోహిత్ రాయుడు (31 బంతుల్లో 18 నాటౌట్, 1 సిక్స్), అనికేత్ (13 బంతుల్లో 12 నాటౌట్, 1 సిక్స్) 9 వికెట్‌కు 28 పరుగులు జోడించి హైదరాబాద్ జట్టును విజయతీరానికి చేర్చారు.

## కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో..
# ప్రీతి, ధర్మ జ్యోతి, మీరాకి స్వర్ణాలు



**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ ప్రారంభ రోజున భారత్ ఖాతాలో మూడు బంగారు పతకాలు జమఅయ్యాయి. భారత వెయిట్ లిఫ్టర్లు మంచి ప్రదర్శన కనబరిచి సత్తా చాటారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరుగుతున్న 30వ కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ తొలి రోజు సోమవారం భారత్ వెయిట్ లిఫ్టర్లు స్వర్ణ పతకాలను సాధించారు. మహిళల 44-48 కిలోల విభాగంలో ప్రీతిస్మిత భోయ్ స్నాచ్‌లో 63 కిలోలు మరియు క్లీన్ అండ్ జెర్క్‌లో 87 కిలోలు ఎత్తి మొత్తం 150 కిలోలతో ముగించింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ మీరాబాయి చాను స్నాచ్‌లో 84 కిలోలు మరియు క్లీన్ అండ్ జెర్క్‌లో 109 కిలోలు ఎత్తి మొత్తం 193 కిలోలు ఎత్తి అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లలో మీరాబాయి చానుకి ఇది ఐదవ పతకం. ఆమె గతంలో 2013, 2017, 2019 ఎడిషన్లలో బంగారు పతకాలు, 2015లో రజతం గెలుచుకుంది. అలాగే పురుషుల 56-60 కిలోల విభాగంలో ధర్మజ్యోతి దేవఘూరియా స్నాచ్‌లో 97 కిలోలు మరియు క్లీన్ అండ్ జెర్క్‌లో 127 మొత్తం 224 కిలోలతో ముగించి భారత్‌కు రోజులో రెండవ స్వర్ణ పతకాన్ని అందించాడు. ఒలింపిక్ పతక విజేత వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను సోమవారం జరిగిన కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల 48 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించి, తిరిగి పోటీలకు శ్రీకారం చుట్టింది.









## సౌతాఫ్రికా టి20 లీగ్‌కు
# భారత్ ప్లేయర్ల క్యూ
### వేలానికి 13 మంది రెడీ

**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికా లీగ్ ఆడేందుకు భారత ఆటగాళ్లు ఆసక్తి చూపుతూ క్యూ కడుతున్నారు. సౌతాఫ్రికా టీ20 లీగ్ నాలుగో ఎడిషన్‌కు ముందు నిర్వహించనున్న వేలానికి మొత్తం 13 మంది భారత ఆటగాళ్లు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్, ముంబై ఇండియన్స్ లెగ్ స్పిన్నర్ పీయూష్ చావ్లా సైతం ఉన్నాడు. అంతేకాకుండా సిద్ధార్థ్ కౌల్, అంకిత్ రాజ్‌పుత్‌లు సైతం వేలంలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

ఢిల్లీకి చెందిన అనురీత్ సింగ్ కతూరియా, పంజాబ్‌కు చెందిన సరుల్ కన్వర్, గుజరాత్‌కు చెందిన మహేశ్ అహిర్, రాజస్థాన్‌కు చెందిన నిఖిల్ జగా, యూపీకి చెందిన ఇమ్రాన్ ఖాన్, అతుల్ యాదవ్, తమిళనాడుకు చెందిన కేఎస్ నవీన్, రాష్ట్రాల పేర్లు పొందుపరచని అన్సారీ మరూఫ్, మొహమ్మద్ ఫైద్, వెంకటేశ్ గాలిపెల్లి లు సౌతాఫ్రికా టీ20 లీగ్ 2025 వేలంలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరంతా తమ బేస్ ప్రైజ్‌ను రూ.10లక్షలుగా నిర్ణయించుకున్నారు. చావ్లా తన బేస్ ప్రైస్‌ను రూ.50లక్షలుగా నమోదు చేసుకున్నాడు. సెప్టెంబర్ 9న సౌతాఫ్రికా టీ2025 వేలం జోహన్నెస్‌బర్గ్‌లో జరగనుంది. మొత్తం 784 మంది ఆటగాళ్లు వేలంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పాకిస్థాన్ నుంచి 40 మంది, ఇంగ్లాండ్ నుంచి 150 మంది ఆటగాళ్లు వేలంలో నమోదు చేసుకున్నారు. ఆరు ఫ్రాంచైజీల వద్ద 7.4 మిలియన్ల యూఎస్ డాలర్ల (భారత్ కరెన్సీ ప్రకారం 646 కోట్ల 73 లక్షల రూపాయలు) పర్స్ ఉంది.

వేలంలో ఫ్రాంఛైజీలు అన్ని కలిపి 84 మంది ఆటగాళ్లను మాత్రమే తీసుకునే అవకాశం ఉంది. అయితే భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) నిబంధనల ప్రకారం దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆటగాళ్లు ఎవ్వరూ కూడా విదేశీ లీగుల్లో ఆడకూడదు. అంతేకాకుండా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పడంతో పాటు, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)తోనూ అనుబంధం పూర్తిగా తెంచుకోవాలి. అంటే ఒక్కసారి ఎవరైనా భారత ప్లేయర్ విదేశీ లీగ్ ఆడితే అతడు భారత జట్టుతో పాటు ఐపీఎల్ ఆడే అర్హతను కోల్పోతాడని బీసీసీఐ స్పష్టంగా పేర్కొంది. దీంతో వీరంతా భారత్ తరపున క్రికెట్ ఆడే అవకాశాన్ని కోల్పోనున్నారు.

## అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్..
# మురళి, రవీనా, రోహిత్ స్వర్ణం



**న్యూఢిల్లీ:** అంతర్‌రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో శ్రీశంకర్ మురళి, రోహిత్ యాదవ్, రవినా గయాక్వాడ్‌లు స్వర్ణ పతకాలు సాధించారు. జాతీయ అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌ల చివరి రోజున ఒలింపియన్ లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ 8.06 మీటర్ల దూరం దూకి స్వర్ణం సాధించాడు.ఈ ప్రయత్నంతో, శ్రీశంకర్ ఇప్పుడు రోడ్ టు వరల్డ్ ఛాంపియన్‌షిప్ స్టాండింగ్స్‌లో టాప్ 36లోకి ప్రవేశించాడు, గ్లోబల్ ఈవెంట్‌కు అర్హత స్థానాన్ని సంపాదించడానికి దగ్గరగా ఉన్నాడు. ఇక పురుషుల జావెలిన్ త్రో ఫైనల్స్‌లో అత్యంత ఉత్కంఠభరితమైన పోటీలో రోహిత్ యాదవ్ 83.65 మీటర్ల వ్యక్తిగత ప్రయత్నంతో ఉత్తమ ప్రదర్శన చేయడంతో స్వర్ణం సాధించాడు. తన చివరి ప్రయత్నంలో 83.20 మీటర్లు నమోదు చేసిన సచిన్ యాదవ్‌ను ఓడించాడు. పరుగులో మహారాష్ట్రకు చెందిన రవినా గయాక్వాడ్ మహిళల 10,000 మీటర్ల పరుగును 35:09.57 సెకన్లలో గెలుచుకోవడం ద్వారా తొలి స్వర్ణం సాధించింది. ఉత్తరాఖండ్‌కు చెందిన అంకిత మహిళల 3000 మీటర్ల పరుగును 9:44.83 సెకన్లతో దూసుకెళ్లగా, హర్యానాకు చెందిన బాల్కిషన్ పురుషుల టైటిల్‌ను కైవసం చేసుకుంది. రిలేలు నాటకీయత మరియు వేగంతో సాయంత్రం ముగిసింది. మహిళల 4+400 మీటర్లలో, కర్ణాటక, పంజాబ్, తమిళనాడులను ఓడించి ముగింపును అందించింది.

వాణిజ్యం



# టెక్ ఎఐకి భారత్ అద్భుత మార్కెట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు25:** టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఏఐ)కు భారత్ అద్భుతమైన మార్కెట్ అని మైక్రోసాఫ్ట్ ఇండియా భావిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వచ్చే ఏడాది లేదా ఏడాదిన్నరలో నూటికి 82 కంపెనీలు తమ ఉద్యోగులకు ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతుంటే, భారత్‌లో మాత్రం 93 శాతం కంపెనీలు ఇందుకు సిద్దంగా ఉన్నట్టు సంస్థ ప్రెసిడెంట్ పునీత్ చందోక్ చెప్పారు. ఈ గిరాకీని తట్టుకునేందుకు పెద్దసంఖ్యలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, అప్లికేషన్స్ ఇంజనీర్లు అవసరమవుతారన్నారు. ప్రస్తుతం మైక్రోసాఫ్ట్ కోడింగ్‌లో 30 శాతం ఏఐ ద్వారానే రాస్తున్నట్టు తెలిపారు. భారత్‌లో తమ వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐలో 300 కోట్ల డాలర్లు పెట్టుబడి పెడుతున్నట్టు తెలిపారు. ఏఐతో ఉద్యోగాలు పోతాయన్న భయాలను చందోక్ తోసిపుచ్చారు. కొన్ని ఉద్యోగాలు పోయినా, ఏఐ ఆర్కెస్ట్రేటర్, ఏఐ ఏజెంట్ మేనేజర్, ఏజెంట్ బాస్, ప్రాంప్ట్ ఇంజనీర్ వంటి అనేక కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయన్నారు. అయితే ఇందుకు అవసరమైన పూర్తి స్థాయి ఏఐ నైపుణ్యాలను యువత అలవర్చుకోక తప్పదన్నారు. ట్రంప్ టారిఫల ప్రభావంపై అడిగిన ప్రశ్నకు మాత్రం చందోక్ నేరుగా సమాధానం ఇవ్వలేదు. అయితే ఆర్థిక సంబంధాలు ప్రపంచ పురోగతికి దోహదం చేస్తాయన్నారు. ఐదేళ్లలో భారత్‌లో కోటి మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వాలనే లక్ష్యానికి మైక్రోసాఫ్ట్ ఇండియా కట్టుబడి ఉన్నట్టు తెలిపారు.

# గేమింగ్ పేరుతో భారీ నష్టం
### యేడాదిలో రూ.20 వేల కోట్లు నష్టపోయిన 45 కోట్ల ఇండియన్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు25:** దేశంలో ఆన్‌లైన్ గేమింగ్ విపరీతంగా పెరిగిపోయింది. ఇదే సమయంలో గేమింగ్ గురించి షాకింగ్ నివేదిక వెలుగులోకి వచ్చింది. దాదాపు 45 కోట్ల మంది భారతీయులు ఏటా రూ.20 లక్షల కోట్లు రియల్ మనీ గేమ్స్ ద్వారా పోగొట్టుకుంటున్నారని ప్రభుత్వం అంచనా వేసింది. గేమ్ ఆడితే టైమ్ పాస్ అవుతుందని చాలా మంది యువత రియల్ మనీ గేమ్స్ ఆడారు. కానీ ఇది కేవలం ఆట మాత్రమే కాదని, వాస్తవంగా ఇదొక ఫైనాన్షియల్ ట్రాప్ అని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఇటీవల గవర్నమెంట్ అంచనాల ప్రకారం, దేశంలో దాదాపు 45 కోట్ల మంది భారతీయులు రియల్ మనీ గేమింగ్ ద్వారా ఏడాదికి రూ.20 వేల కోట్లు నష్టపోయారు. ఈ భారీ నష్టాలు వాటి వెనక ఉన్న విషాద



సంఘటనలు చూసిన ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 2025లో ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ బిల్ చట్టంగా మారింది. ఈ చట్టం హానికరమైన రియల్‌మనీ గేమ్స్‌ను నిషేధిస్తూ, ఇ-స్పోర్ట్స్, విద్య పరమైన గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లను ప్రోత్సహిస్తోంది. లక్ష్యం ఏంటంటే, కుటుంబాలను ఆర్థిక సంక్షోభం, బానిసత్వం నుంచి కాపాడడం, అదే సమయంలో గేమింగ్ రంగంలో ఉద్యోగాలు, పెట్టుబడులు, గ్లోబల్ ఇ-స్పోర్ట్స్ మ్యాప్‌లో భారత్‌ను నిలబెట్టడం.కాగా, ఈ గేమింగ్ నష్టాల వెనక యువత అప్పుల్లో కూరుకుపోవడం, కుటుంబాలు నాశనం కావడం, కొన్ని చోట్ల ఆత్మహత్యలు కూడా జరిగాయి. కర్ణాటకలో గత మూడేళ్లలో 18 మంది ఆన్‌లైన్ మనీ గేమ్స్ వల్ల ఆత్మహత్య చేసుకున్నారు. మైసూరులో ఒక కుటుంబం రూ.80 లక్షలు పోగొట్టుకుని ముగ్గురూ ఆత్మహత్య చేసుకున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ముంబై, హైదరాబాద్‌లలోనూ ఇలాంటి ఘటనలు నమోదయ్యాయి. ఈ సమస్య ఎంత విస్తృతంగా ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

అయితే, గేమింగ్ రంగంలో అంతా చెడు కాదు. ఇ-స్పోర్ట్స్ ఒక అద్భుతమైన అవకాశంగా మారుతోంది. ఇప్పటికే ఈ రంగం 1.5 లక్షల డైరెక్ట్ ఉద్యోగాలను సృష్టించింది. 2030 నాటికి ఈ సంఖ్య రెట్టింపు అవుతుందని అంచనా. ప్రతి డైరెక్ట్ ఉద్యోగానికి, లాజిస్టిక్స్, కంటెంట్, ఎనలిటిక్స్‌లో మరో రెండు మూడు ఉద్యోగాలు వస్తున్నాయి. ఆసక్తికరమైన విషయం ఏంటంటే, దాదాపు 40 గేమర్స్ టైర్2, టైర్3 నగరాల నుంచి వస్తున్నారు. అంటే, గేమింగ్ అవకాశాలు మెట్రోలకు మాత్రమే పరిమితం కాకుండా, చిన్న పట్టణాలకూ విస్తరిస్తున్నాయి. ఈ కొత్త చట్టం గ్యాంబ్లింగ్ రకం మనీ గేమ్స్‌ను, నిజమైన స్కిల్-బేస్డ్ ఇ-స్పోర్ట్స్‌ను స్పష్టంగా వేరు చేస్తుంది. ఈ చట్టం రూపొందించడానికి ప్రభుత్వం మంత్రిత్వ శాఖలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, బ్యాంకులు, తల్లిదండ్రులు, గేమింగ్ ఇండస్ట్రీతో సుదీర్ఘ సంప్రదింపులు జరిపింది. ఈ చట్టం హానికరమైన గేమ్స్‌ను నియంత్రిస్తూ, నిజమైన గేమింగ్ ఔత్సాహికులకు మద్దతు ఇస్తుంది.



## ఫార్మా ఎగుమతుల్లో
# 5శాతం వృద్ధి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు25:** అనిశ్చిత పరిస్థితుల్లోనూ భారత ఫార్మా ఎగుమతులు పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో భారత్ నుంచి 757 కోట్ల డాలర్ల (సుమారు రూ.65,860 కోట్లు) విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 5.21 శాతం ఎక్కువగా నమోదైంది. ఫార్ములేషన్లు, బయోలాజిక్స్ విభాగాలు ఎగుమతులు పెరిగేందుకు బాగా దోహదం చేశాయి. కాగా ఇదే కాలంలో విదేశాల నుంచి మన దేశానికి దిగుమతయ్యే ఫార్మా ఉత్పత్తులు 4.21 శాతం పెరిగి 78.6 కోట్ల డాలర్లకు చేరినట్టు ఫార్మెగ్జిల్ చైర్మన్ నమిత్ జోషి చెప్పారు. జూన్ త్రైమాసికంలో భారత్‌కు దిగుమతైన ఫార్మా ఉత్పత్తుల్లో 46 శాతం బల్క్ డ్రగ్స్, ఇంటర్మీడియరీలు ఉన్నాయి. అమెరికా మార్కెట్లో ధరల ఒత్తిడి, టారిఫ్ సమస్యలు ఉన్నా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మిగతా త్రైమాసికాల్లోనూ ఎగుమతుల వృద్ధి రేటు కొనసాగుతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2024-25) లో భారత్ నుంచి 3,047 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.65 లక్షల కోట్లు) విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 9.39 శాతం ఎక్కువగా నమోదైంది.

# లాభాలతో ముగిసిన సూచీలు
### సెన్సెక్స్ 300 పాయింట్లు జంప్




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు25:** అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, ఐటీ షేర్లపై మదుపర్లు ఆసక్తి కారణంగా దేశీయ సూచీలు లాభాలను ఆర్జించాయి. అయితే బ్యాంకింగ్ రంగం మాత్రం స్వల్ప నష్టాలను నమోదు చేసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత ఉంటుందని అంచనాలు వెలువడడం సూచీలకు సానుకూలంగా మారింది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ ఈ వారాన్ని లాభాలతో ప్రారంభించాయి గత శుక్రవారం ముగింపు (81, 306)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం 200 పాయింట్లకు పైగా లాభంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఒక దశలో దాదాపు 500 పాయింట్లు ఎగబాకి 81, 799 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. అయితే చివర్లో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగారు. దీంతో చివరకు సెన్సెక్స్ 329 పాయింట్ల లాభంతో 81, 635 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 97 పాయింట్ల లాభంతో 24, 9673 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో వొడాఫోన్ ఐడియా, జుబిలెంట్ ఫుడ్, పీజీ ఎలక్ట్రోప్లాస్ట్, జైడస్ లైఫ్, ఇన్ఫోసిస్ షేర్లు లాభాలను ఆర్జించాయి. ఏంజెల్ వన్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్, సీడీఎస్ఎల్, ఫోర్టిస్ హెల్త్, మ్యాన్‌కైండ్ ఫార్మా షేర్లు నష్టాల బాటలో నడిచాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 71 పాయింట్లు అర్జించింది. బ్యాంక్ నిఫ్టీ 10 పాయింట్లు కోల్పోయింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ రూ.87.58గా ఉంది.

# 19 నుంచి విజయవాడలో నారెడ్కో ప్రాపర్టీ ఫెస్టివల్
### 60కి పైగా హౌసింగ్ ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ సంస్థలు పాల్గొంటున్న మెగాషో

**విజయవాడ, ఆగస్టు 25,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నారెడ్కో సెంట్రల్ జోన్ 11వ అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్‌ను విజయవాడసి ఏ కన్వెన్షన్‌లో సెప్టెంబర్ 19 నుండి 21 వరకు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. సోమవారం నగరంలోని మాలక్ష్మి ఛాంబర్స్‌లో నిర్వహించిన మీడియాకు సమావేశంలో వివరాలను ప్రకటించారు. మూడు రోజులపాటు జరిగే ఈ ప్రాపర్టీ ఎక్స్‌పో గృహ కొనుగోలుదారులు, స్థిరాస్తి వ్యాపార రంగానికి చెందిన వారికి సంయుక్త వేదికగా నిలవనుంది. ఈ ఫెస్టివల్‌లో 60కుపైగా ఎగ్జిబిటర్స్ పాల్గొనబోతున్నారు. వీరిలో విశ్వసనీయ రియల్ ఎస్టేట్ డెవలపర్లు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలు, ఇంటీరియర్స్, బిల్డింగ్ మెటీరియల్ బ్రాండ్లు, ఆర్కిటెక్ట్‌లు, కన్సల్టెంట్లు, బ్యాంకులు ఇతర అనుబంధ సేవల విభాగాలు ఉంటాయి. ఈ ఎక్స్‌పో ద్వారా విజయవాడ, ప్రజా రాజధాని అమరావతి పరిసర ప్రాంత ప్రజలు తమ బడ్జెట్‌కు అనుగుణంగా అన్ని రకాల ఆమోదం పొందిన రెసిడెన్షియల్ ప్రాజెక్టులను సరిచూసుకుని ఎంచుకునే అవకాశం ఉంది. బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ భాగస్వాములతో నేరుగా చర్చించి తక్షణ సలహాలు పొందవచ్చు. ఇంటీరియర్ సొల్యూషన్స్, హోమ్ ఇంప్రూవ్‌మెంట్ ఆప్షన్లు కూడా అందుబాటులో ఉండనుండగా, నగర వాసులు తమ సొంత ఇంటి కలను సాకారం చేసుకోవచ్చు. ఈ సందర్భంగా నారెడ్కో సెంట్రల్ జోన్ అధ్యక్షుడు సందీప్ మండవ మాట్లాడుతూ నారెడ్కో 11వ అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్ ద్వారా పారదర్శకత, ప్రాక్టికల్ ఫైనాన్స్ సపోర్ట్ ఆలంబనగా గృహ కొనుగోలుదారులను క్రమబద్ధమైన మార్గదర్శకత్వం అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. విశ్వసనీయ డెవలపర్లు, స్పష్టమైన ప్రాజెక్ట్ ఆప్షన్లు, తక్షణ ఫైనాన్షియల్ సహాయం అన్నింటినీ ఒకే గొడుగు కిందకి తీసుకురావటం ప్రాపర్టీ షో ప్రత్యేకత అన్నారు. విజయవాడఅమరావతి రియల్ ఎస్టేట్ రంగం తదుపరి వృద్ధి దశలోకి అడుగిడుతోందని, ప్రజలు ధైర్యంగా, తగిన సమాచారం ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడానికి ఇది సరైన సమయం అని సందీప్ మండవ పేర్కొన్నారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్ పరుచూరి మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పాలసీ స్పష్టత, మౌలిక వసతుల అభివృద్ధి తద్వారా ప్రాజెక్టుల సమయానుకూల నిర్మాణంతో కొనుగోలుదారుల నమ్మకానికి అనుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. టైటిల్ స్పాన్సర్ ఎస్ఎల్‌వి డెవలపర్స్ చైర్మన్ పెన్మత్స శ్రీనివాస రాజు మాట్లాడుతూ హోమ్ బయ్యర్స్‌కు నేరుగా సేవలందించే ఈ ఈవెంట్‌లో భాగస్వామ్యం కావటం గర్వంగా ఉందని, మా ప్రీమియమ్ కమ్యూనిటీలను ఈ ఫెస్టివల్‌లో ప్రదర్శించి, ప్రత్యేక మార్గదర్శకతను అందిస్తామని తెలిపారు. నారెడ్కో సెంట్రల్ జోన్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ హరి ప్రసాద్ వేదిక వద్ద ఉండే వినియోగదారులకు అందుబాటులో ఉండే సౌకర్యాలను వివరించారు. ఇందులో ప్రాజెక్ట్ జోన్లు, బ్యాంకులు, ఫైనాన్షియర్ డెస్క్‌లు, ఇంటీరియర్స్ ఎగ్జిబిషన్, కొనుగోలు దారుల సలహా కౌంటర్లు, రిజిస్ట్రేషన్ వంటి సదుపాయాలు ఉంటాయన్నారు. ప్రాపర్టీ షోకు ఉచిత ప్రవేశం కల్పించామని, కన్వెన్షన్ వద్ద తక్షణ రిజిస్ట్రేషన్ సదుపాయం అందుబాటులో ఉందని నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో నారెడ్కో రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps